అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
గురువారం 6-4-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



ప్రసంగిస్తున్న ప్రభాత్ పట్నాయక్

సంపుటి : 9 సంచిక : 33 | Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

ప్రజలపై దాడి తీవ్రం..

- మోడీ సర్కార్ నయా ఉదారవాద పాలన ప్రమాదకరం : ప్రభాత్ పట్నాయక్

ప్రజలపై మోడీ సర్కార్ దాడి తీవ్రతరం చేసిందని మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీ ఆహ్వాన సంఘం చైర్మెన్, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ విమర్శించారు. దేశంలో నయా ఉదారవాద పాలన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలపై తీవ్ర దాడిని ప్రారంభించిందన్నారు. దీంతో రెండు దశాబ్దాలుగా మూడు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని వివరించారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈ దాడి మరింత తీవ్రమైందన్నారు. ఎన్ఎస్ఎస్ డేటా ప్రకారం 2011-12 నుంచి 2017-18 మధ్య గ్రామీణ భారతదేశంలో తలసరి వాస్తవ నెలవారీ వ్యయం 9 శాతం క్షీణించిందని తెలిపారు. ఈ డేటాను పూర్తిగా అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ...5లో

సంఘర్ష్ కరో...

మజ్దూర్ కిసాన్ మార్చ్ చారిత్రాత్మకం

- దేశ భవిష్యత్తుకు మార్పు అవసరం
- 2024లో బీజేపీ సర్కార్‌ను గద్దెదించుతాం 5లో..
- యువతకు ఉద్యోగ కల్పనలో మోడీ విఫలం
- కార్పొరేట్లకు ప్రభుత్వ రంగ సంస్థలు ధారాదత్తం : సంఘర్ష్ మార్చ్‌లో నేతలు

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్ చారిత్రాత్మకమనీ, దేశ భవిష్యత్తుకు మార్పు అవసరమని నొక్కి చెప్పిందని పలువురు వక్తలు అన్నారు. బుధవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో సీఐటీయూ, ఏఐకెఎస్, ఎఐఎడబ్ల్యుయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్‌లో ఆయా సంఘాల నేతలు మాట్లాడారు.



దద్దరిల్లిన ఢిల్లీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని హస్తిన ఎర్ర రంగు పులుముకుంది. ఢిల్లీ వీధుల్లో అరుణ పతాకాలు రెపరెపలాడాయి. దీంతో ఢిల్లీ అరుణార్ణవ రాజధానిగా మారింది. భుజాలపై ఎర్ర జెండాలు మోస్తూ కార్మిక, కర్షకులు కదంతొక్కారు. డప్పుల మోతలు, కష్ట జీవుల గొంతెత్తిన పాటలు మోడీ సర్కార్‌ను హెచ్చరించాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ...10లో

పస్తుల్లో పేదలు..



దేశంలో కరోనా సమయంలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. మరోపక్క అదానీ, అంబానీల ఆస్తులు పెరిగాయి. మోడీ ప్రభుత్వం పేదల వద్ద లాక్కొని పెద్ద పెద్ద కార్పొరేట్లకు ఊడిగం చేస్తోంది. ప్రభుత్వం రంగ సంస్థలను ధారాదత్తం చేశారు. యువతకు ఉద్యోగాలు లేవు. ఆకలితో పేదలు అలమటిస్తున్నారు.

- సీఐటీయూ అధ్యక్షులు కె. హేమలత

కార్పొరేట్ల లూటీకి వ్యతిరేకంగా పోరు

- ఏఐకేఎస్ ప్రధానకార్యదర్శి విజ్జూ కృష్ణన్



దేశంలో కార్పొరేట్ల లూటీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరు చేస్తున్నాం. మోడీ పాలనలో లక్షకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రెండున్నర ...5లో

ట్రిపుల్ ఇంజిన్‌తో మోడీని ఓడిస్తాం

- ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



ప్రధాని మోడీ తెల్లారితే డబుల్ ఇంజిన్ పాలనంటూ ప్రకటన చేస్తున్నారు. అయితే, ఇక్కడ ట్రిపుల్ ఇంజిన్ అని చెప్పాలనీ, అందులో ఒకటి మోడీ, అమిత్ షా ...5లో

ట్రంప్‌నకు 136 ఏండ్ల జైలుశిక్ష !



న్యూయార్క్ : అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై 34 నేరాభియోగాలు నమోదు అయిన విషయం తెలిసిందే. ఒకవేళ ఆ కేసుల్లో కోర్టు ట్రంప్‌ను దోషిగా తేల్చితే, అప్పుడు ఆయనకు కనీసం 136 ఏండ్ల జైలు శిక్ష పడే ఛాన్సు ఉన్నదని నిపుణులు భావిస్తున్నారు. హష్ మనీ కేసులో ఆయన వ్యాపార రికార్డులను తారుమారు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

హష్‌మనీ కేసులో...

హష్‌మనీ కేసులో ట్రంప్ తొలుత సరెండరై ఆ తర్వాత రిలీజ్ అయిన విషయం తెలిసిందే. బిజినెస్ రికార్డులను మోసం చేసిన కేసులో ట్రంప్‌పై నేరాభియోగాలు నమోదయ్యాయి. ఒకవేళ ఆ కేసుల్లో ట్రంప్ దోషిగా తేలితే, భారీగా జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నట్టు న్యాయ నిపుణులు చెబుతున్నారు. నిజానికి ఒకవేళ ట్రంప్ ...5లో

స్వేచ్ఛనిస్తే బీజేపీ నేతలంతా జైల్లోనే..

ఈడీ, సీబీఐని నియంత్రిస్తున్నారు

- అదానీని ముట్టుకునే దమ్ము ఈడీ, సీబీఐకి ఉందా?
- బీజేపీని గద్దె దింపడమే మా లక్ష్యం :సీపీఐ ఎంపీ బినోయ్ విశ్వం



వివరాలు 5లో..

సూత్రధారి బీజేపీ అధ్యక్షుడే

పది ప్రశ్నాపత్రం లీకులో ఏ1గా బండి సంజయ్

- వరంగల్ కోర్టులో హాజరు.. 14 రోజుల రిమాండ్
- కరీంనగర్ జైలు తరలింపు
- మరో 10 మందిపై కేసు నమోదు
- ఇదంతా గేమ్ ప్లాన్.. : సీపీ ఏవీ రంగనాథ్
- అరెస్ట్‌పై లోక్‌సభ స్పీకర్‌కు సమాచారం
- బీఆర్ఎస్, బీజేపీల పరస్పర ఆందోళనలు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/బొమ్మలరామారం

పదో తరగతి హిందీ పరీక్షా పత్రం లీకు విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను ఏ1గా పోలీసులు పేర్కొన్నారు. బండి సంజయ్‌ను మంగళవారం అర్ధరాత్రి కరీంనగర్‌లో అరెస్ట్ చేసి బుధవారం సాయంత్రం హన్మకొండ ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఇరువైపులా వాదనలు విన్న అనంతరం జడ్జి అనిత రాపోలు.. బండి సంజయ్‌కు 14 రోజులు (ఈ నెల 19వ తేదీ వరకు) రిమాండ్ విధిస్తున్నట్టు తీర్పు వెల్లడించారు. పదో తరగతి పేపర్ల లీక్ పక్కా ప్రణాళికలో భాగంగానే జరిగినట్టు బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరించారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలోనే.. పేపర్ల ఫొటోలు వాట్సాప్‌లో బయటికి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను కరీంనగర్‌లో మంగళవారం అర్ధరాత్రి అరెస్టు చేసిన పోలీసులు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. ఈ కేసులో 10 మందిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు ఒక మైనర్‌తోపాటు ఐదుగురిని అరెస్ట్ చేయగా, మరో ఐదుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. వీరిపై 120 (బి), 420, 447, 505 (1)(బి), ఐపిసి సెక్షన్ 4(ఎ), 6 రెడ్ విత్ 8 తెలంగాణ పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్‌ప్రాక్టీసెస్) యాక్ట్ 1997, సెక్షన్ 66-డి ఐటీ యాక్ట్ 2008 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అరెస్టయిన వారిలో.. ఏ2.. బూర ప్రశాంత్, ఏ3.. గుండెబోయిన మహేశ్, ఏ4.. మైనర్ బాలుడు, ఏ5.. మోతం శివగణేష్, ఏ6.. పోగు సురేష్, ఏ7.. పోగు శశాంక్, ఏ8.. దూలం శ్రీకాంత్, ఏ9.. పెరుమాండ్ల శార్మిక్, ...2లో

విద్యార్థులు, నిరుద్యోగులతో బీజేపీ చెలగాటం: కేటీఆర్



వివరాలు 3లో..

జాతీయ భద్రత సాకు మాత్రమే !

ఆ పేరుతో పౌర హక్కులు నిరాకరిస్తున్నారు

- మీడియా వన్‌పై నిషేధం చెల్లదు: కేంద్రానికి సుప్రీంకోర్టు మొట్టికాయలు
- ప్రజాస్వామ్య బలోపేతానికి స్వతంత్ర మీడియా అవశ్యమని హితవు



న్యూఢిల్లీ : రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను హరించివేయడానికి జాతీయ భద్రతను ఒక సాధనంగా ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని, ఇది చట్టబద్ధపాలనకు అనుగుణంగా లేదని సుప్రీం కోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. మలయాళం వార్తా చానెల్ 'మీడియా వన్'పై కేంద్ర ప్రభుత్వం విధించిన నిషేధాన్ని రద్దు చేసింది. ఈ సందర్భంగా కేంద్రంలోని మోడీ సర్కార్‌కు సర్వోన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడమనేది మీడియా లేదా టెలివిజన్ చానెల్ లైసెన్స్‌ను రద్దు చేయడానికి ఒక కారణం కారాదని సుప్రీం స్పష్టం చేసింది. భద్రతా ...5లో

భానుడి భగభగ..

మరోవైపు వర్ష సూచన

- నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43 డిగ్రీల ఎండ
- 17 జిల్లాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ
- పలు జిల్లాలకు వర్ష సూచన, వడగండ్లు పడే అవకాశం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏప్రిల్ మొదటి వారంలోనే ఓవైపు భానుడు భగభగ మండిపోతున్నాడు. మరోవైపు గాలి, వడగండ్ల వానలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో అత్యధికంగా 43 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. రాష్ట్రంలో 17 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎనిమిది జిల్లాల్లో (వనపర్తి, నిజామాబాద్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, నిర్మల్) 41 డిగ్రీలకుపైన రికార్డయ్యాయి. ఆ జిల్లాలకు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ(టీఎస్‌డీపీఎస్) ఆరెంజ్ హెచ్చరికను జారీచేసింది. రాష్ట్రంలో వచ్చే ...5లో

చరిత్రను తుడిచేస్తున్న మోడీ సర్కారు

సిలబస్ నుంచి మొఘలుల చాప్టర్లు తొలగింపు

- గాంధీ హత్యానంతరం ఆరెస్సెస్‌పై నిషేధం కూడా..
- నూతన విద్యా విధానాన్ని పాటిస్తున్నాం : ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ సక్లానీ
- తొలగింపులపై ప్రతిపక్షాల ఆగ్రహం



న్యూఢిల్లీ : దేశంలో విద్య కాషాయీకరణలో భాగంగా కేంద్రంలోని మోడీ సర్కారు ఆరెస్సెస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నది. గత చరిత్రను చెరిపివేసి వక్రీకరణలతో విద్యార్థుల మెదళ్లను కలుషితం చేసే చర్యకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ)కు చెందిన పలు తరగతుల పాఠ్యపుస్తకాల సిలబస్‌ల నుంచి అనేక చాప్టర్లను తొలగించింది. ఇందులో మొఘలు, గాంధీ హత్యానంతరం ఆరెస్సెస్‌పై నిషేధం, హిందూ-ముస్లింల ఐక్యతకు గాంధీ చేసిన కృషితో పాటు పలు కీలక చాప్టర్లు, అంశాలు, పేరాగ్రాఫ్‌లు ఉన్నాయి. దీంతో ఈ చర్యపై రాజకీయంగా అనేక వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

'అతివ్యాప్తి.. అసంబంధం'

తమకు, తమ భావజాలానికి వ్యతిరేకంగా ఉన్న చాప్టర్ల తొలగింపునకు మోడీ సర్కారు చర్యలు తీసుకున్నది. ఇందులో భాగంగానే నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) 2020ని తీసుకొచ్చింది. ఇప్పుడు ఆ ...2లో

సీబీఐ, ఈడీలకు వ్యతిరేక పిటిషన్ తిరస్కరణ

- విచారణకు ఒప్పుకోని సుప్రీంకోర్టు ధర్మాసనం
- ఉపసంహరించుకున్న విపక్షాలు

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీల దుర్వినియోగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నేతృత్వంలోని 14 ప్రతిపక్ష పార్టీలు దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో ప్రతిపక్షాలు పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాయి. ప్రతిపక్షాల తరఫున న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అంటే 2014 నుంచి 2022 వరకు సీబీఐ, ఈడీ కేసులు అత్యధిక స్థాయిలో 600 శాతం పెరిగాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటివరకు 121 మంది రాజకీయ నేతలను ఈడీ విచారించగా అందులో 95 శాతం మంది ప్రతిపక్ష పార్టీలకు చెందినవారేనని ఆయన కోర్టుకు తెలిపారు. అయితే ఈ పిటిషన్‌పై అభిషేక్ సింఘ్వీ వాదనలు విన్న సుప్రీం ధర్మానం స్పందించింది. " దర్యాప్తు సంస్థల విచారణ ఉండకూడదని చెప్పగలమా..? నాయకులను దూరంగా ఉంచగలరా? రాజకీయ నాయకుడు ప్రాథమిక పౌరుడు. పౌరులుగా మనమంతా ఒకే చట్టానికి లోబడి ఉంటాం" అని సుప్రీంకోర్టు తెలిపింది. దీనికి సింఘ్వీ స్పందిస్తూ.. భారతదేశంలో పెండింగ్‌లో ఉన్న ఏ కేసును సైతం ఈ పిటిషన్ ప్రభావితం చేయకూడదనీ, ప్రస్తుతం జరుగుతున్న దర్యాప్తులో జోక్యం చేసుకోవాలని కూడా కోరడం లేదని ఆయన అన్నారు. ఇక ఈ పిటిషన్‌ను ప్రస్తావిస్తూ.. కోర్టు సామాన్యులకు, రాజకీయ నాయకులకు ప్రత్యేకంగా మార్గదర్శకాలు రూపొందించలేదని సీజేఐ డివై చంద్రచూడ్ నేతత్వంలోని ధర్మాసనం స్పష్టం చేస్తూ.. పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. అయితే పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు సింఘ్వీ కోర్టును కోరగా.. దానికి అనుమతినిచ్చింది.

బండి సంజయ్ ఆదేశాలతోనే..

- ఆయనపై పీడీ యాక్టు నమోదు చేయాలి
- పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలి :మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నాపత్రాలు వాట్సాప్‌ల్లో ప్రత్యక్షమవటమనేది ముమ్మాటికీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశాలతోనే జరిగిందని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. ఆయన సూచనలు, సలహాలతోనే ఏబీవీపీ, ఆరెస్సెస్, బీజేపీతోపాటు ఆ పార్టీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం తపస్ నేతలు, కార్యకర్తలు ఈ కుట్రకు పాల్పడ్డారని విమర్శించింది. అందువల్ల బండి సంజయ్‌పై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలని రాష్ట్ర మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని లోక్‌సభ స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో వేర్వేరుగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పువ్వాడ, కొప్పుల, పల్లా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అప్రదిష్ట పాల్జేసేందుకే బీజేపీ నేతలు లీకుల ప్రహసనాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే బండి సంజయ్ తన అనుచరులకు ఆదేశాలనిచ్చి పదో తరగతి ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా బయటకు పంపారని తెలిపారు. గత 15,20 రోజులుగా ఇలాంటి రాజకీయ క్రీడలు కొనసాగుతున్నాయని చెప్పారు. బీజేపీ నేతల ఇలాంటి చర్యలను ప్రజలు చీదరించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వ హయాంలో గతంలో ఎన్నో పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించామని వివరించారు. బీజేపీ ఢిల్లీ పెద్దల సూచనలు, సలహాలతోనే లీకుల బాగోతం నడుస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ఆ పార్టీ తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారంటూ హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవనరెడ్డి, గొంగిడి సునీత, ముఠా గోపాల్, సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలో రాజకీయ కుట్ర ఆందోళనకరం: కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రాల బయటకు రావడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉండడం ఆందోళనకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. లీకేజీ వ్యవహారంలో బండి సంజయ్‌కి ఎలాంటి సంబంధం లేదంటూ ఆయన నిరూపించుకోవాల్సిన అవసరముందని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లీకేజీతో బీజేపీకి సంబంధముందంటూ మీడియాలో వస్తున్న వార్తలకు ఆయనే బాధ్యత వహించాలని కోరారు. ఈ అంశాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడి రాజకీయ ప్రయోజనాల కోసం ఆలోచించే ఎంతటివారినైనా కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

జగ్జీవన్‌రామ్‌కు సీపీఐ నివాళి

బాబు జగ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి బినయ్‌విశ్వం, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొట్టాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బీజేపీ రాజకీయ కుట్ర చేసిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ విమర్శించారు. లీకేజీ ద్వారా రాజకీయ లబ్ది పొందాలనుకోవడం సిగ్గుచేటని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీజేపీని విద్యార్థులు, తల్లిదండ్రులు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వికలాంగులకు సంక్షేమ పథకాల్లో వాటా పెంచాలి

- విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి: ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల జనాభాకనుగుణంగా సంక్షేమ పథకాల వాటా పెంచాలని, విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వికలాంగుల జనాభాలో 7రకాల వైకల్యాలు కల్గినవారు 10.48 లక్షల మంది ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం సుమారు 20 లక్షల మంది అలాంటి వారు ఉంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. వీటన్నింటికీ భిన్నంగా ఈ మధ్య కాలంలో తెలంగాణ డిసేబుల్డ్ స్టడీస్ ఇండియా రిపోర్ట్ ప్రకారం రాష్ట్రంలో 43.02 లక్షల మంది(ఒకటి కంటే ఎక్కువ వైకల్యాలు కలిగిన వారు) వికలాంగులు ఉన్నారని పేర్కొన్నట్టు వివరించారు. మొత్తం జనాభాలో వికలాంగుల జనాభా 12.02శాతంగా ఉందని, ఈ రకంగా చూసినప్పుడు దేశ సగటు కంటే తెలంగాణలో ఎక్కువ మంది వికలాంగులు ఉన్నారని వివరించారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి వికలాంగుల జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాలలో వాటాను 12.02 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కొన్ని తరగతుల జనాభా కంటే వికలాంగుల జనాభానే ఎక్కువగా ఉందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగుల డిమాండ్ల చుట్టూ రాజకీయ పార్టీలు తిరిగే విధంగా బలమైన ఉద్యమాలు తెలంగాణ రాష్ట్రంలో రావాల్సిన అవసరం ఉందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా వికలాంగుల హక్కులు, సంక్షేమ పథకాలు, విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్ల అమలు కోసం పోరాడాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

మోడీ హటావో... దేశ్‌కో బచావో

అధికారంలో కొనసాగే హక్కు బీజేపీకి లేదు

- 14 నుంచి దేశవ్యాప్త ప్రచారోద్యమం
- సీపీఐ జాతీయ కార్యదర్శి బినయ్‌విశ్వం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మోడీ హఠావో... దేశ్‌కో బచావో అంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ బినయ్ విశ్వం పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని ధ్వంసం చేస్తున్న బీజేపీకి అధికారంలో కొనసాగే హక్కు లేదన్నారు. లౌకిక, ప్రజాస్వామిక, వామపక్ష పార్టీలన్నీ ఏకమై వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయన్నారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రమాదకరమైన విధానాలపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ఈనెల 14 నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా ప్రచారోద్యమం చేపడుతున్నామని వివరించారు. దేశంలో అవినీతిని అరికట్టడంలో సీబీఐ బాగా పనిచేస్తుందంటూ ఇటీవల ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. సీబీఐతోపాటు ఇతర దర్యాప్తు సంస్థలకు స్వేచ్ఛనిస్తే బీజేపీ నాయకులపైనే అవినీతి కేసులు ఎక్కువగా నమోదవుతాయని ఎద్దేవా చేశారు. ఆ కేసుల్లో ప్రధాని మోడీ పేరు కూడా ఉంటుందని చెప్పారు. సీబీఐ చేతులు కట్టి బాగా పనిచేస్తుందంటూ ప్రధాని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ప్రసంగాలు చేయడంలో మోడీ మొనగాడని, ఆచరణ మాత్రం శూన్యమని విమర్శించారు. అదానీ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోని ప్రధాని అవినీతిపై ఎన్ని మాటలు మాట్లాడినా వృథాయేనని చెప్పారు. గుజరాత్‌కు చెందిన చిన్న వ్యాపారి అదానీ మోడీ ప్రధాని అయ్యాక ప్రపంచంలోనే కుబేరుల జాబితాలో రెండో స్థానానికి చేరారని వివరించారు. అందుకే మోడీని మోదానీ అంటున్నారని చెప్పారు. అదానీ అక్రమాలపై జేపీసీతో విచారణ చేయాలని మోడీకి సవాల్ విసిరారు.

పడిపోతున్న రూపాయి విలువ : అజీజ్‌పాషా

డాలర్‌తో పోల్చినప్పుడు భారత రూపాయి విలువ పడిపోతున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా అన్నారు. ఆసియా ఖండంలోనే భారతదేశం చివరన ఉందన్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి 8.6 శాతం పడిపోయిదని వివరించారు. సింగపూర్, మలేసియా కరెన్సీ విలువ 6.4 శాతం, థాయ్‌లాండ్ కరెన్సీ 2.4 శాతమే పడిపోయిందని గుర్తు చేశారు. ఎంతో అభివృద్ధి సాధించామంటూ గొప్పలు చెప్పే మోడీ ప్రభుత్వం రూపాయి పతనంపై ఏం సమాధానం చెబుతుందంటూ ప్రశ్నించారు. రూపాయి విలువను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలోని బ్యాంకులు, ఎల్ఐసీ, గనులు, ఖనిజాలు, వనరులను పెట్టుబడిదారులకు కట్టబెడుతూ, ప్రధాని మోడీ దేశ సంపదను లూటీ చేయిస్తున్నారని విమర్శించారు. ఈ అంశాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. స్వదేశీ జపం చేసే ఆర్ఎస్ఎస్, బీజేపీ వాస్తవంగా విదేశీ పెట్టుబడులకే ఎర్ర తివాచీ వేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, ఈటి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

సూత్రధారి బీజేపీ అధ్యక్షుడే



(మొదటిపేజీ తరువాయి)

ఏ10.. పోతబోయిన వసంత్ ఉన్నారని తెలిపారు. వరంగల్ కమిషనరేట్‌లో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో సీపీ రంగనాథ్ కేసు వివరాలు వెల్లడించారు. ఏ2గా ఉన్న బూర ప్రశాంత్ గతంలో హెచ్ఎం టీవీలో పనిచేశారని, ఇప్పుడు బీజేపీకి చెందిన నమో టీవీలో ప్రతినిధిగా, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. సోమవారం సాయంత్రం బండి సంజయ్‌తో ప్రశాంత్ వాట్సాప్ కాల్‌లో మాట్లాడారన్నారు. మంగళవారం ఉదయం 11.24 గంటలకు ప్రశాంత్, సంజయ్‌కి హిందీ పేపర్‌ను వాట్సాప్‌లో పంపారని, ఆయనిచ్చిన సమాచారంతోనే ఉదయం 11.30 గంటల నుంచి 11.50 గంటల మధ్య బండి సంజయ్ మీడియాతో మాట్లాడారన్నారు. పక్కా ప్లాన్‌తోనే ఈ వ్యవహారం నడిపించారన్నారు. బండి సంజయ్‌ని కరీంనగర్‌లో ప్రివెంటివ్ కింద అరెస్టు చేసి కేసు ఇక్కడ ఉండటం వల్ల వరంగల్‌కు తీసుకొచ్చినట్టు తెలిపారు. వారెంట్, నోటీసు లేకుండా అరెస్ట్ చేయొచ్చని సెక్షన్ 41 సీఆర్‌పీసీ చెబుతుందన్నారు. పార్లమెంట్ స్పీకర్‌కు కూడా బండి సంజయ్ అరెస్ట్‌పై సమాచారం ఇచ్చినట్టు తెలిపారు. న్యాయపరంగానే ముందుకు వెళ్తున్నామని, మాపై ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవన్నారు. చాలా మంది కాల్‌డేటా డిలిట్ చేశారని, బండి సంజయ్ తన ఫోన్ ఇవ్వలేదని స్పష్టం చేశారు. సంజయ్ ఫోన్ డేటా లభిస్తే మరింత సమాచారం తెలుస్తుందన్నారు. విద్యార్థుల్లో అయోమయం సృష్టించాలనే కుట్రతోనే చేసినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్లాన్ చేశారు కాబట్టే బండి సంజయ్‌ని ఏ1గా పెట్టడం జరిగిందన్నారు. ఈటల రాజేందర్‌కు కూడా మెసేజ్ పంపారని చెప్పారు. కమలాపూర్ నుంచి పేపర్ రావడం వెనుక ఉన్న పక్కా ప్లాన్‌పై విచారణ జరుపుతున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ డీసీపీ అబ్దుల్ బారీ, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ అరెస్టుతో ఉద్రిక్తత పరిస్థితులు

పదో తరగతి హిందీ పేపర్ లీకేజీ కేసులో.. బండి సంజయ్‌ను కరీంనగర్‌లో అరెస్ట్ చేసి వరంగల్ కోర్టుకు తీసుకువస్తున్న క్రమంలో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బీజేపీ శ్రేణులు పోలీస్‌స్టేషన్లు, మార్గమధ్యలో ధర్నాలు, అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పరస్పర ఆందోళనలతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కరీంనగర్‌లో అరెస్ట్ చేసి యాదాద్రి జిల్లా బొమ్మలరామారంకు తరలించడంతో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బుధవారం బొమ్మలరామారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని లోపలికెళ్లేందుకు ప్రయత్నించారు. అయన్ను పోలీసులు అడ్డుకున్నారు. యాదాద్రి భువనగిరి నుంచి మధ్యాహ్నం జనగామకు తరలిస్తుండగా, పెంబర్తి వద్ద బీజేపీ శ్రేణులు అడ్డుకునే యత్నం చేశాయి. దాంతో పోలీసులు లాఠీఛార్జి చేసి సంజయ్‌ని పాలకుర్తికి తరలించారు. అక్కడ ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ చెకప్ చేయించి వర్ధన్నపేటకు తరలించారు. వర్ధన్నపేటకు సంజయ్‌ని తరలిస్తున్నట్టు సమాచారం రాగానే ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు రోడ్డుపై అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సంజయ్‌ని జఫర్‌గఢ్‌కు తరలించి అక్కడి నుంచి మడికొండ పీటీసీకి తరలించారు. ఈ క్రమంలో వరంగల్ కోర్టుకు బండి సంజయ్‌ని తరలిస్తున్నట్టు ప్రచారం జరగడంతో బీజేపీ కార్యకర్తలు చేరుకున్నారు. వారిని ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. దీనికి ప్రతిగా అదాలత్ అమరవీరుల స్తూపం వద్ద చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి నాయకత్వంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. వరంగల్ అదాలత్‌కు సాయంత్రం బండి సంజయ్‌ని తరలిస్తుండగా, బీఆర్ఎస్ పార్టీ నేతలు చెప్పులు, కోడిగుడ్లు విసిరి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోర్టు వద్ద భారీ బందోబస్తును నిర్వహించి సంజయ్‌ని న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.

సునీత్ చోప్రాకు తుది వీడ్కోలు

- ఏచూరితో సహా సీపీఐ(ఎం) సీనియర్ నేతల సంతాపం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) మాజీ కేంద్ర కమిటీ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నేత సునీత్ చోప్రాకి వేలాది మంది తుదివీడ్కోలు పలికారు. మంగళవారం ఆయన తుదిశ్వాస విడిచిన విషయం విదితమే. భౌతికకాయాన్ని బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సీపీఐ(ఎం) కేంద్ర కార్యాలయం (ఎకేజీభవన్)లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆయనకు నివాళులు అర్పించేందుకు వేలాదిగా తరలివచ్చారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, బృందా కరత్, ఎంఏ బేబి, బీవీ. రాఘవులు, నీలోత్పల్ బసు, తపన్‌సేన్, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విజయరాఘవన్, బి.వెంకట్, ఎంపీ. వి శివదాసన్, ఏఐకేఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజ్జూ కృష్ణన్, అశోక్ ధావలే, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపీ ఎఎ రహీం, ప్రధాన కార్యదర్శి హిమఘ్నరాజ్ భట్టాచార్య, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీపీ.సానూ, మయూఖ్ బిశ్వాస్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, ఐద్వా నేత మెమూనా మొల్లా తదితరులు నివాలులర్పించారు. ఆర్టిస్టులు, ఆర్ట్ క్రిటిక్స్, ఉత్తర కొరియా ప్రతినిధులు, జెఎన్‌యు, ఢిల్లీ యూనివర్శిటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులు, జర్నలిస్టులు తదితరులు సునీత్ చోప్రాను కడసారి చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అంతిమ నివాళులర్పించేందుకు వచ్చిన పలువురు భావోద్వేగానికి గురయ్యారు. తమ ప్రియమైన సహచరుడిని చూసి ఉత్తర కొరియా ప్రతినిధులు కన్నీళ్లు పెట్టుకున్నారు. సునీత్ చోప్రా భార్య సుమిత్రా చోప్రా, సోదరీమణులు, బంధువులు కూడా హాజరయ్యారు. సాయంత్రం నాలుగు గంటలకు లోథిరోడ్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

చరిత్రను తుడిచేస్తున్న మోడీ సర్కారు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఈపీ ఆధారంగానే సిలబస్‌లో ఇలాంటి మార్పులు చోటు చేసుకున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. గతేడాది సిలబస్ హేతుబద్ధత ప్రక్రియలో భాగంగా మొఘలులకు సంబంధించిన పాఠాలను తొలగించడానికి ఎన్‌సీఈఆర్‌టీ వాటిని 'అతివ్యాప్తి', 'అసంబద్ధమైనవంటూ కారణాలుగా పేర్కొనటం గమనార్హం.

తొలగించిన చాప్టర్లు ఏమిటి?

- 'థీమ్స్ ఆఫ్ ఇండియాన్ హిస్టరీ-పార్ట్ 2' నుంచి 'కింగ్స్ అండ్ క్రోనికల్స్ : ది మొఘల్ కోర్ట్స్ (16 మరియు 17వ శతాబ్దాలు)'కు సంబంధించిన చాప్టర్లు.
- 11వ తరగతిలో సెంట్రల్ ఇస్లామిక్ ల్యాండ్స్, సంస్కృతుల ఘర్షణ, పారిశ్రామిక విప్లవం.
- 12వ తరగతి పౌరశాస్త్రం పుస్తకం 'స్వాతంత్ర్యం నుంచి భారత రాజకీయాలు'లో రైస్ ఆఫ్ పాపులర్ మూవ్‌మెంట్స్', 'ఎరా ఆఫ్ వన్ పార్టీ డామినెన్స్'.
- పదో తరగతి డెమొక్రాటిక్ పాలిటిక్స్-2 పుస్తకాల నుంచి 'డెమొక్రసీ అండ్ డైవర్సిటీ', 'పాపులర్ స్ట్రగుల్స్ అండ్ మూవ్‌మెంట్', 'ప్రజాస్వామ్యానికి సవాళ్లు'.
- 12వ తరగతి పొలిటికల్ సైన్స్ పాఠ్యపుస్తకం నుంచి మహాత్మా గాంధీ హత్యానంతరం ఆరెస్సెస్‌పై విధించిన నిషేధానికి సంబంధించిన కొన్ని పేరాలను తొలగించారు. అలాగే, హిందూ-ముస్లిం ఐక్యతకు గాంధీ చేపట్టిన కృషికి సంబంధించిన పేరాలను కూడా తొలగించారు.

చాప్టర్ల తొలగింపుపై ఎన్‌సీఈఆర్‌టీ ఏం చెప్పింది?

దీనిపై ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ మాట్లాడుతూ.. " కోవిడ్ కారణంగా గతేడాది హేతుబద్ధీకరణ ప్రక్రియ సాగింది. అప్పుడు విద్యార్థులపై ఒత్తిడి పడింది" అని చెప్పారు. ఆరు నుంచి 12వ తరగతులకు చెందిన పుస్తకాలను నిపుణుల కమిటీలు పరిశీలించాయన్నారు. చాప్టర్లను తొలగించడం వల్ల పిల్లల నాలెడ్జ్‌పై ప్రభావం చూపవని నిపుణులు తెలిపిన తర్వాత తొలగింపులు జరిగాయనీ, ఈ చర్చ అనవసరమని అన్నారు. "మేము నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) 2020 ప్రకారం పని చేస్తున్నాం. కంటెంట్ లోడ్‌ను తగ్గించుకోవడం గురించి ఎన్ఈపీ 2020 చెబుతుంది. దానినే మేము అమలు చేస్తున్నాం. పాఠశాల విద్య కోసం నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఎఫ్) ఏర్పాటైంది. ఇది త్వరలో ఖరారవుతుంది. ఎన్ఈపీ ప్రకారం 2024లో పాఠ్యపుస్తకాలు ముద్రించబడతాయి" అని అన్నారు.

చరిత్ర సిలబస్ మార్పుపై ప్రతిపక్షాలు ఏమంటున్నాయి?

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో కేంద్రం మార్పులకు సంబంధించి ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మోడీ సర్కారు ప్రయత్నాలను తప్పుబట్టాయి. మొఘలుల చరిత్రను తొలగించడం ద్వారా గతాన్ని కేంద్రం తుడిచివేస్తున్నదని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఇది దేశ చరిత్రను మార్చే ప్రయత్నమని కాంగ్రెస్ నాయకుడు అవినాశ్ పాండే అన్నారు. కేంద్రంపై రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ దాడికి దిగారు. "హిందూ, ముస్లింల ఐక్యతకు గాంధీ తపన, ఆరెస్సెస్‌పై నిషేధం, గుజరాత్ అల్లర్లకు సంబంధించిన అన్ని రిఫరెన్సులు, సమకాలీన భారతదేశంలో సామాజిక ఉద్యమాలుగా మారిన నిరసనలు" వంటివి ఎన్‌సీఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించబడ్డాయని ఆయన ట్వీట్ చేశారు.

తెలంగాణలో పండే ధాన్యాన్ని కేంద్రమే కొనుగోలు చేయాలి

- ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పండించే ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాడిక్కడ తెలంగాణ భవన్‌లో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్ రావు, టి. సాగర్‌తో కలిసి జూలకంటి రంగారెడ్డి విలేకరులతో మాట్లాడారు. గత సీజన్లలో ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం అలసత్వంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అన్యాయం చేస్తోందని విమర్శించారు. శాసనసభలో ఆమోదం పొందిన బిల్లులను గవర్నర్ ఆమోదించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలు అమలు చేయకుండా తెలంగాణ విషయంలో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందనిన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నారని విమర్శించారు. పలు నిబంధనలతో ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

- కొడుకు పుట్టాక భార్యను వద్దంటున్న బీజేపీ నాయకుడు
- తనకు న్యాయం చేయాలని వేడుకోలు



నవతెలంగాణ మద్దూరు

కొడుకు పుట్టాక బీజేపీ నాయకుడు భార్యను కాపురానికి తీసుకెళ్లకపోవడంతో ఆమె తన భర్త ఇంటి ఎదుట బైటాయించి ఆందోళనకు దిగింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం నర్సాయపల్లిలో బుధవారం జరిగింది. నర్సాయపల్లి గ్రామానికి చెందిన మాజీ ఆర్మీ సైనికుడు బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి బీజేపీ సైనిక దళ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. కాపురానికి తీసుకుపోకుండా వేధింపులకు గురి చేయడంతో భార్య తన కుమారునితో కలిసి భర్త ఇంటిముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు బద్దిపడగ అంజలి మాట్లాడుతూ.. నర్సాయపల్లి గ్రామానికి చెందిన బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డితో తనకు 2019లో వివాహం జరిగిందన్నారు. పెండ్లి చేసుకున్న కొద్ది రోజులకు ఉద్యోగరీత్యా లక్నోకి వెళ్లాడని తెలిపారు. అప్పటినుంచి అతని తల్లిదండ్రులు, అతని అన్న, వదినలు వేధించడం ప్రారంభించారని తెలిపారు. తీవ్ర వేధింపులకు గురి చేసి తన పుట్టిల్లయిన సిద్దిపేట జిల్లా రామాయంపేటకు పంపించారని వాపోయారు. తన భర్త శ్రీనివాస్ రెడ్డి ఉద్యోగం ముగించుకుని స్వగ్రామం వచ్చిన తర్వాత మా అమ్మవాళ్ల ఇంటికి వచ్చి తనను తీసుకెళ్లాడని, అనంతరం వారం రోజుల నుంచి అందరూ కలిసి తీవ్రంగా వేధించారని తెలిపారు. వారి వేధింపులను తట్టుకోలేక సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 2020 ఫిబ్రవరిలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ విషయంపై సఖి కేంద్రానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారని గుర్తు చేశారు. అయినా అతనిలో ఎలాంటి మార్పు రావడంలేదన్నారు. పైగా.. అదనంగా కట్నం తీసుకువస్తే తప్ప కాపురానికి తీసుకుపోనని, లేదంటే విడాకులు ఇస్తానని బెదిరిస్తూ... అతని కుటుంబ సభ్యులతో కలిసి తనపై దాడి చేశారన్నారు న్యాయం జరిగే వరకూ తన భర్త ఇంటి ఎదుట కుమారునితో ఎన్ని రోజులైనా బైటాయిస్తానని స్పష్టం చేశారు. వేధింపులకు గురిచేస్తున్న భర్త, అతని కుటుంబంపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు ఆమెకు మద్దతు తెలిపారు.

డీజీపీపై వ్యాఖ్యలు చేసిన రఘునందన్‌పై ఐపీఎస్‌ల ఆగ్రహం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్‌పై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవి, అమర్యాదకరమైనవని తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా న్యాయానికి లోబడి ప్రజారక్షణకు నిర్విరామంగా కృషి చేస్తున్న రాష్ట్ర డీజీపీని బీహారీ గుండాగా కించపరుస్తూ రఘునందన్ చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమైనవని ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారుల సంఘం జాయింట్ సెక్రెటరీ బి. సుమతి అన్నారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను కాపాడుతున్న పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దిగజార్చే విధంగా ఉన్నాయని ఆమె అన్నారు. రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులను పాటించరాదంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు పూర్తి అప్రజాస్వామికమైనవని, ఒక బాధ్యతాయుతమైన శాసన సభ్యుడు అనాల్సిన మాటలు కావని ఆమె చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రఘునందన్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు.

రఘునందన్ వ్యాఖ్యలు అత్యంత హేయమైనవి

రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం

'బీహారీ గుండా అంజనీకుమార్' అంటూ రాష్ట్ర డీజీపీపై బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవనీ, తెలంగాణ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.గోపిరెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే నెంబర్ 1 గా నిలిచిన రాష్ట్ర పోలీసుల అధిపతిని ఇలాంటి దౌర్భాగ్యపు మాటలతో కించపర్చడం ఎమ్మెల్యేకు సరికాదని ఆయన అన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రఘునందన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యార్థులతో బీజేపీ క్షుద్ర రాజకీయం : మంత్రి హరీశ్‌రావు



నవ తెలంగాణ మెదక్ టౌన్

టీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక బీజేపీ విద్యార్థులతో క్షుద్ర రాజకీయం చేస్తోందని ఆర్థిక, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశంతో కలిసి మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి హిందీ ప్రశ్నాపత్రం బహిర్గతం కేసులో.. అరెస్టయిన బండి సంజయ్.. భవిష్యత్ తరాలకు ఏం సందేశం ఇవ్వదల్చుకున్నారని ప్రశ్నించారు. బీజేపీ ఇంత నిసిగ్గుగా వ్యవహరిస్తుందా అని దేశ, రాష్ట్ర ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు. బండి సంజయ్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడని, బీజేపీకి చదువు విలువ తెలియదన్నారు. విద్యార్థులు బీజేపీ కుట్రలను గమనించాలని పిలుపునిచ్చారు. తాండూరులో లీకేజీకి పాల్పడ్డ టీచర్ బీజేపీ ఉపాధ్యాయ సంఘంలో ఉన్నారని, వరంగల్‌లో అరెస్టయిన ప్రశాంత్ బీజేపీలో ఉన్నారని తెలిపారు. ప్రశాంత్‌కు బీజేపీ అగ్ర నేతలతో సంబంధాలు ఉన్నాయని ఫొటోలు ప్రదర్శించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలప్పుడు, టీఎస్పీఎస్సీ లీకేజీలో, ఎమ్మెల్యేల కొనుగోలులో బీజేపీ కుట్రలు రెడ్ హ్యాండెడ్‌గా బయటపడ్డాయనేది స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

ఎర్రజెండా నీడన పోరుబాట

ఉండేందుకు ఇండ్ల జాగా కావాలి



- అద్దెలు కట్టలేక అప్పుల్లోకి..
- స్థలం కేటాయించాలని రామగుండంలో పేదల ఆందోళన

నవతెలంగాణ -
సింగరేణి ప్రతినిధి(మదాసి రామ్మూర్తి)

రెక్కలు ముక్కలు చేసుకున్నా... కడుపునిండా బువ్వ దొరకని అభాగ్యులకు పెద్దపల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆసరాగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పర్మినెంట్ ఉద్యోగాలు కనుమరుగయ్యాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారు కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారు. కష్టానికి తగిన ఫలితం దక్కకపోయినా కష్టపడి పని చేసుకుంటున్నారు. వేలాదిమంది చేతివృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉండేందుకు వారికి సరైన నివాసం లేదు. రేకుల షెడ్లు, పాలథిన్ కవర్లు కప్పిన గుడారాలే నివాసాలయ్యాయి. పగలు సూర్యుడు, రాత్రి జాబిల్లి వెలుగులతో పోటీపడతారు. వానకు తడిసి, చలితో సహవాసం వీరి జీవితంలో భాగమైంది. ఇండ్ల స్థలాల కోసం ఏండ్ల తరబడి పోరాటం చేస్తున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారంతా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేస్తున్నారు.

నివేశనా స్థలాలు కావాలని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని నిరుపేదలు ఎర్రజెండా చేపట్టి సీపీఐ(ఎం) నేతృత్వాన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భారీఎత్తున భూ పోరాటం చేస్తున్నారు. 18 రోజులుగా కొనసాగుతున్న భూ పోరాట కేంద్రాల్లో 'నవ తెలంగాణ' పర్యటించి అక్కడి వివరాలు సేకరించింది.

మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరొందిన రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య నామమాత్రమే. కాంట్రాక్టు కార్మికులు కీలకంగా పని చేస్తున్నారు. సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, బసంత్‌నగర్ సిమెంటు కర్మాగారం, రామగుండం జెన్‌కో లో ఎక్కువమంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారు. అదేవిధంగా చేతివృత్తులను నమ్ముకుని ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. వారికి ఉండేందుకు సరైన ఇల్లు లేదు. ఇండ్లు కట్టిస్తామని ప్రభుత్వం చెప్పినా ఒక్కరికీ కేటాయించలేదు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులు నత్తకే నవ్వు తెప్పించే విధంగా ఉన్నాయి. కనీసం నివేశనా స్థలాలైన కేటాయించాలని ప్రభుత్వ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని పేదలు వాపోతున్నారు. పరిశ్రమల ఆధీనంలోనే వేలాది ఎకరాల భూములు ఉండటం వల్ల తామేమీ చేయలేకపోతున్నామని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.





భూబకాసురుల ఆక్రమణలు.. తిరగబడుతున్న పేదలు

వాస్తవానికి ప్రభుత్వ భూములను కొందరు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, భూబకాసురులు ఒక జట్టుగా ఏర్పడి ఆక్రమించడం, దర్జాగా అమ్ముకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని సుమారు 7300మంది ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ప్రభుత్వం 2268మందిని అర్హులుగా గుర్తించింది. అధికారుల పరిశీలన అనంతరం 768మందికి ఇండ్లను కేటాయించారు. ఇందులో కూడా పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మల్యాపూర్ జనగామ శివారులో 43ఎకరాల ప్రభుత్వ భూమిని, ఎన్‌టీపీసీ సమీపంలోని 15ఎకరాల భూమిని తమకు కేటాయించాలని స్థానిక పేదలు, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేస్తున్నారు. భూ పోరాట కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే, 15 ఎకరాల స్థలాన్ని విక్రయించడానికి కొంతమంది ప్రజాప్రతినిధులు అధికారుల సహాయంతో ప్రయత్నం చేయగా.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు అడ్డుకున్నారు. స్థలాల కోసం అక్కడ గుడిసెలు వేసుకొని పోరాడుతున్నారు. పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని స్వాధీనపరచుకొని అర్హులైన పేదలకు కేటాయించాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో జరుగుతున్న భూ పోరాట శిబిరాలను ఇటీవల సీపీఐ(ఎం) కేంద్ర, రాష్ట్ర నాయకులు సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.



బెదిరింపులకు భయపడం



పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించే వరకు భూ పోరాటాన్ని కొనసాగిస్తాం. ప్రభుత్వ బెదిరింపులకు తలొగ్గేది లేదు. పెరిగిన ధరల నేపథ్యంలో కొనుగోలు శక్తి లేని ప్రజలు పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు. కిరాయి ఇండ్లలో నివసించే కార్మికులు అద్దె చెల్లించలేక అప్పుల పాలవుతున్నారు. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి, సొంత ఇంటి స్థలం కలిగిన వారికి రూ.5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. కేంద్ర ప్రభుత్వం వీరికి మరో రూ.10లక్షలు తక్షణమే కేటాయించాలి.

వై.యాకయ్య- సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి

మా గోస పట్టించుకోండి : జంగ భిక్షపతి



తినడానికి తిండి లేనోళ్లం. చేయడానికి పని దొరకడం లేదు. పది ఏండ్ల నుంచి ఇంటి జాగాల కోసం మున్సిపల్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు చుట్టూ తిరుగుతున్నాం. హామీలు ఇస్తున్నరు.. కానీ పట్టాలు ఇత్తలేరు. ప్రభుత్వ భూమిని నిరుపేదలకు కేటాయించాలని వందలాది మందిమి ఎర్రటెండలో పడిగాపులు పడుతున్నాం. మా గోస అర్థం చేసుకొని ఇంటి స్థలం ఇప్పించాలి.

ఎర్ర జెండాలతో ధీమా : మల్లీశ్వరి



ఇండ్ల స్థలాల కోసం సీపీఐ(ఎం) నాయకుల అండతో ఎర్రజెండాలు పట్టాం. స్థలాలు సాధించుకుంటామన్న ధీమా ఏర్పడింది. ఇక్కడే వండుకొని తింటున్నాం. నిలువ నీడలేని పేదోళ్లం.. మాకు డబుల్ బెడ్రూం ఇండ్లనైనా ఇవ్వండి, కనీసం ఇంటి జాగాలైనా ఇవ్వండి. ప్రాణం పోయినా సరే ఖాళీ చేతులతో ఈ స్థలాన్ని ఖాళీ చేసేదిలేదు.

రాజకీయాల్లో రాములుది చురుకైన పాత్ర

- సీఎం కేసీఆర్ సంతాపం

నవతెలంగాణ- హైదరాబాద్‌బ్యూరో

మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు మతి పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి నాయకుడిగా, తదనంతరం ఉమ్మడి రాష్ట్రంలో మెట్‌పల్లి నుండి ఎమ్మెల్యేగా పనిచేసిన రాములు ప్రజా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించారని సీఎం వారి సేవలను స్మరించుకున్నారు. రాములు కుటుంబ సభ్యులకు సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

11న హలో విద్యార్థి- చలో హైదరాబాద్

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి
- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీపై సమగ్రమైన న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హలో విద్యార్థి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీలు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, కోట రమేష్, టి నాగరాజు, ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 11న విద్యార్థి, నిరుద్యోగుల మహాదీక్ష చేపడుతున్నామని తెలిపారు. ప్రశ్నాపత్రం లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించాలని, ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. లీకేజీ వల్ల నష్టపోయిన నిరుద్యోగులకు పరీక్షలు పూర్తయ్యేంత వరకు నెలకు రూ.20 వేలు నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. ప్రశ్నాపత్రం లీకేజీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీతో సంబంధం ఉన్న ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : డీవైఎఫ్ఐ

పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ లీకేజీలో బీజేపీ నేతలు, కార్యకర్తల హస్తం ఉందనే ఆరోపణలొస్తున్నాయని తెలిపారు. రాజకీయ స్వప్రయోజనాల కోసం ఆ పార్టీ నాయకులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎంపీగా బండి సంజయ్ అనర్హుడు

- అతడిని అనర్హుడిగా పార్లమెంట్ ప్రకటించాలి
- పచ్చగా ఉన్న తెలంగాణలో అగ్గి రాజేయాలని బీజేపీ యత్నం
- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే మట్టి కొట్టుకుపోతారు : తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై అనర్హత వేటు వేయాలని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పార్లమెంట్ స్పీకర్, సెక్రెటరీలకు లేఖ రాశారు. తెలంగాణలో విద్యార్థులు, నిరుద్యోగుల్లో అయోమయం పెంచేందుకే బీజేపీ పేపర్ లీకేజీలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీకి పాల్పడిన బూర ప్రశాంత్‌తో బండి సంజయ్ గంటల కొద్ది ఫోన్లు మాట్లాడాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. కావాలనే పదవ తరగతి పరీక్షలు రాస్తున్న 4.8 లక్షల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అయోమయానికి గురి చేయడానికే బండి సంజయ్ కుట్ర పన్నారని విమర్శించారు. ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతోందని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీ ఆప్తమిత్రుడు అదానీ గురించి ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిన పార్లమెంట్, దాదాపు 4.8 లక్షల మంది పదవ తరగతి విద్యార్థుల ప్రాణాలతో వారి ఉజ్వల భవిష్యత్‌తో చెలగామడుతున్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ సభ్యత్వంపై సైతం అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్ కులస్తుల గ్రామబహిష్కరణ

- ఇసుక అక్రమ రవాణాతో ప్రమాదాలపై..ప్రశ్నించినందుకు వీడీసీ దుశ్చర్య
- రాత్రికి రాత్రే కిరాయి ఇండ్లు ఖాళీ చేయించినట్టు వెల్లడి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండటంతో పొలాలకు వెళ్లే వారికి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రశ్నించినందుకు నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం రామన్నపేట వీడీసీ సుమారు 300 ముదిరాజ్ కుటుంబాలను బహిష్కరించింది. 15 రోజులుగా తమకు చాయ్ పోయడం లేదని, కిరణా సామాను ఇవ్వడం లేదని, మంచి చెడులకు వేరే కులస్తులను రానీయకుండా ఆంక్షలు విధించినట్టు వాపోయారు. బాధిత కుటుంబీకులు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రామన్నపేట గ్రామంలో సుమారు 6 వేల జనాభా ఉండగా, వారిలో సుమారు 300 ముదిరాజ్ కుటుంబాలు ఉన్నాయన్నారు. గ్రామంలోని కప్పల వాగు నుంచి సంగేమ్ కిషన్ ఇసుకను అక్రమంగా జేసీబీతో తవ్వించి టిప్పర్లు, ట్రాక్టర్లతో లోడింగ్ చేసుకొని అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. రాత్రుళ్ళు పెద్ద పెద్ద వెహికల్స్ ఇసుకతో నడవటం వల్ల నిద్ర పట్టడం లేదని, పొలాలు, తోటల్లో కరెంట్ మోటార్ల దగ్గరికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇసుక తరలిస్తున్న వాహనాలు తమపైకి వస్తున్నాయని తెలిపారు. ఇలాగయితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనాలు ఆపి అడిగినందుకు తమపై వీడీసీ కక్ష కట్టినట్టు ఆరోపించారు. తమ కుటుంబాలను 15 రోజుల కిందట బహిష్కరించారని, అప్పటి నుంచి గ్రామంలోని హెూటల్‌లలో తమకు చాయ్‌లు పోయడం లేదని, కిరాణా షాపుల్లో నిత్యావసర సామాను ఇవ్వటం లేదని, మటన్, చికెన్ షాపుల్లోనూ ఇదే పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి చెడులకు ఇతర కులస్తులెవ్వరినీ రానీయ్యకుండా వీడీసీ ఆంక్షలు విధించిందని వాపోయారు. కిరాయికి ఇతరుల ఇండ్లలో ఉన్న వారిని రాత్రికి రాత్రే ఖాళీ చేయించారని, తమ ఇండ్లల్లో ఉన్న కిరాయిదుకాణాలను సైతం తీసివేయించారని వాపోయారు. వీరి విష బీజాలు పిల్లలపై సైతం రుద్దుతున్నారని, దాంతో స్కూళ్లల్లో తమ పిల్లలతో వేరే పిల్లలు మాట్లాడటం లేదని తెలిపారు. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, లింబాద్రి, నాగుల శేఖర్ తమపై బహిష్కరణకు ప్రధాన కారణమని, వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం సంఘం ముదిరాజ్, బొమ్మ సంఘం ముదిరాజ్, ఈర్ల సంఘం ముదిరాజ్, కుంట కింది సంఘం ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలేవి?

- కేంద్రానికి వైఎస్ షర్మిల సూటి ప్రశ్న

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

'కేంద్రంలోని బీజేపీ ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసింది. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఎందుకు మౌనం వహిస్తోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది ఉద్యోగాలు ఇచ్చి ఉంటే కనీసం 10 లక్షల ఉద్యోగాలు వచ్చేవి. బీఆర్ఎస్, బీజేపీ దొందు దొందే?' అని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిరుద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగమని ఉద్యమంలో చెప్పి కేసీఆర్ మోసం చేశారని అన్నారు. పేపర్ లీక్‌తో నిరుద్యోగులు ఆందోళనలో ఉన్నారని, సీబీఐ విచారణ అంటే కేసీఆర్ ఎందుకు భయపడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగుల పక్షాన కొట్లాడింది కేవలం వైఎస్ఆర్‌టీపీనేననీ, పార్టీ పెట్టక ముందే తాను 72 గంటలు దీక్ష చేశానని తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై ఈ నెల 7న రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్లకు వినతి పత్రం ఇవ్వాలనీ, 8న రిలే దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. 9న దిష్టి బొమ్మలు దగ్ధం చేయాలని, 10న హైదరాబాద్‌లో టీ-సేవ్ ఫోరం సమావేశం ఏర్పాటు చేయాలనీ కోరారు. 12న కాగడాల ప్రదర్శన చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

పాలనపై పట్టు కోల్పోయిన సీఏం కేసీఆర్

అఖిలపక్ష పార్టీల నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జాతీయ రాజకీయాల మీద దృష్టిని కేంద్రీకరించి, సొంత రాష్ట్రంలో పరిపాలన మీద సీఏం కేసీఆర్ పట్టు కోల్పోయారని, అందుకే రాష్ట్రంలో పేపర్ల లీకేజీ అనేది ఒక ట్రెండ్‌గా మారిందని అఖిలపక్ష పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. బుధవారం టీజేఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల ఉమ్మడి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుతం రాష్ట్రంలో తీవ్రతరమవుతున్న నిరుద్యోగ సమస్య, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ, పదవతరగతి పేపర్ల లీకేజీల మీద భవిష్యత్తు కార్యాచరణ గురించి సమగ్రంగా చర్చించారు.

అఖిలపక్ష పార్టీలు, ప్రజా, విద్యార్థి, యువజన సంఘాలు ఒకే వేదికగా ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు. దీని కోసం "టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యతిరేక పోరాట కమిటీ" అనే వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా త్వరలోనే నిరుద్యోగులకు భరోసా కల్పించడానికి రాష్ట్ర వ్యాప్తంగా అఖిలపక్షాల ఆధ్వర్యంలో పోరాటాన్ని తీవ్రతరం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. దీనికి సంబంధించిన పూర్తి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. గురువారం సాయంత్రం 4 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగే విలేకరుల సమావేశంలో కమిటీ తరపున అఖిలపక్ష నాయకులు పూర్తి ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మల్లు రవి, టీజేఎస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం, బీయస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, తెలంగాణ బచావో ఫోరం కన్వీనర్ ఆకునూరి మురళి, సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యురాలు రమాదేవి, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జేవీ. చలపతి రావు, రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కన్నెగంటి రవి, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుధాకర్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంపన్నులపై సంపద పన్ను విధించాలి

- కార్పొరేట్లకు పన్నులు పెంచాలి
- పేదల సంక్షేమ కార్యక్రమాలను పెంచాలి : ప్రజా, కార్మిక, కర్షక, కూలీల డిమాండ్లకు ఉద్యోగుల సంఘీభావం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశంలోని అత్యంత సంపన్నులపై సంపద పన్ను విధించాలని, కార్పొరేట్లకు పన్ను పెంచి, పేదల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్స్ ఆర్గనైజేషన్స్ కాన్ఫెడరేషన్, నేషనల్ వైస్ చైర్మెన్ వి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ప్రజలపై భారాలు మోపుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలో లక్షలాది శ్రమజీవులు నిర్వహించిన మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో ప్రకటించిన డిమాండ్లకు పలు ఉద్యోగుల, ఆఫీసర్ల, పెన్షనర్ల సంఘాలు సంఘీభావం ప్రకటించాయి. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్పొరేటీకరణ విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థలు, సింగరేణి, విశాఖఉక్కు, ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, పెట్రోలియం, రైల్వే డిఫెన్స్, ఇన్సూరెన్స్, ప్రభుత్వరంగ బ్యాంకులు, హైవేలు మొదలైన ప్రజల సంపదకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తంచేశారు.

పరిహారం ఇచ్చాకే కూల్చివేయాలి : బీయస్పీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేదలకు పరిహారం ఇచ్చాకే వారి ఇండ్ల కూల్చివేతపై నిర్ణయం తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పర్మాల క్రిష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. ట్యాంక్ బండ్ నుంచి మూసారాంబాగ్ వరకున్న మూసీనది ప్రధాన డ్రైనేజీకి ఇరువైపులా రిటైయినింగ్ వాల్ కట్టే క్రమంలో పేదల ఇండ్లు కూల్చకుండా అధికారులను ఆదేశించాలని ఇది వరకే సీఎం కేసీఆర్‌తో పాటు ఉన్నతాధికారులను కోరినట్టు తెలిపారు. దీంతో ఫీవర్ హాస్పిటల్ సమీపంలో శివానంద నగర్ దగ్గర పేదల పరిస్థితి దయనీయంగా తయారైందని తెలిపారు. డ్రైనేజీకి ఇరువైపులా 12 అడుగుల స్థలంలో గోడ నిర్మిస్తున్నారనీ, ఇందుకోసం వందలాది ఇండ్లు కూల్చేస్తుండటంతో పేదలు నిరాశ్రయులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే పేదల నివాస హక్కుల కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మెన్, సభ్యులను నియమించాలి : మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీకు వెంటనే కొత్త చైర్మెన్, సభ్యులను నియమించాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వ్యవహారం ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పేపర్ లీకేజీపై సిట్ విచారణ కాకుండా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకుల విషయంలో ప్రశాంత్, బండి సంజయ్‌తో వందల సార్లు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు, నిరుద్యోగులతో బీజేపీ చెలగాటం : కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వార్థ రాజకీయాల కోసం విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో బీజేపీ నేతలు చెలగాటమాడుతున్నారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. పదో తరగతి ప్రశ్నపత్రాల లీక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అరెస్టు తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆయన ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పిచ్చోడి చేతిలో రాయి ఉంటే వచ్చి పోయేటోళ్లకే ప్రమాదం.. అదే పిచ్చోడి చేతిలో ఒక పార్టీ ఉంటే ప్రజాస్వామ్యానికే ప్రమాదం. స్వార్థ రాజకీయాల కోసం ప్రశ్నపత్రాలు లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు" అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో వరుసగా రెండు రోజులు టెన్త్ పరీక్ష ప్రశ్నపత్రాలు వాట్సప్‌లో ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. దీనిపై బీఆర్ఎస్, బీజేపీ మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ట్వీట్ చేశారు.

కొమ్మిరెడ్డి రాములు మృతికి రేవంత్ సంతాపం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బడుగు, బలహీనవర్గాల గొంతుకు అని, ఆయన మరణించడం తీవ్ర ఆవేదనను కలిగిస్తుందని పేర్కొన్నారు.

టప్పాచబుత్రలో కాల్పుల కలకలం..

- ఘటనా స్థలంలోనే ఒకరు మృతి
- పాత కక్షలే కారణం అంటున్న పోలీసులు



నవతెలంగాణ-ధూల్ పేట్

హైదరాబాద్‌లోని కార్వాన్ టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి కాల్పులు కలకలం రేపాయి. ఈ కాల్పుల్లో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. కాల్పుల శబ్దానికి స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికంగా నివాసముండే ఆకాష్ సింగ్‌కు కొందరికి మధ్య కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. మంగళవారం రాత్రి కార్వాన్‌లోని తోప్‌ఖానాలో షబాబ్ హోటల్ సమీపంలో ఆకాష్ సింగ్(26) తన స్నేహితులతో కలిసి ఉండగా.. దుండగులు ఒక్కసారిగా అతనిపై కాల్పులు జరిపారు. దాంతో ఆకాష్ సింగ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పాత కక్షల కారణంగానే ఈ దాడి జరిగినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. నిందితుల కోసం ప్రత్యేక క్లూస్ టీంను ఏర్పాటు చేశారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు.

సంపాదకీయం

అసలు మూలం ఎక్కడ..?

రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపేసిన తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని మనం మరిచిపోకముందే అలాంటి వ్యవహారమే మరోటి సంచలనం సృష్టించింది. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వేలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తును అయోమయంలో పడేస్తే..

> ఏకంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిలు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్ చేసిన హడావుడి, ఆర్భాటం అంతా ఇంతా కాదు. పదో తరగతి ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమవటంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్... నిజంగా ఎలాంటి తప్పూ చేయకపోతే ఆయన్ను పోలీసులు ఏమీ చేయలేరు. ఆ విషయం తెలిసినప్పటికీ హస్తినలోని బీజేపీ అగ్రనాయకత్వం ఆయన్ను అరెస్టు చేసిన వెంటనే ఎందుకు భుజాలు తడుముకుంటున్నదనేది ఇప్పుడు శేష ప్రశ్న

ఇప్పుడు వెలుగు చూసిన పదో తరగతి ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమైన ఘటన లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నది. ఇందుకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సహా మరో ఐదుగురిని అరెస్టు చేశామంటూ పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించిన దరిమిలా... ఈ కేసు తీవ్రమైన సంచలనాన్ని రేకెత్తించింది. సంజయ్ ఆదేశాల మేరకే ఏబీవీపీ, ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలు పది ప్రశ్నాపత్రాల తతంగాన్ని నడిపారన్నది అధికార బీఆర్ఎస్ నేతలు, ప్రజా ప్రతి నిధుల వాదన.

అయితే ఇక్కడే మరో అభిప్రాయం, అనుమానం వెల్లువెత్తకమానటం లేదు. గతంలో రాష్ట్రంలో జరిగిన పలు ఘటనలు ఇదే విషయాన్ని రూఢీ చేస్తున్నాయి. బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పెద్ద తలకాయలు తెలంగాణలో పర్యటించేందుకు కొద్ది రోజుల ముందే ఇక్కడ ఏదో ఒక అలజడి రేపటం కాషాయ దళానికి ఆనవాయితీగా మారటం గమనార్హం. కొద్ది నెలల క్రితం ప్రధాని మోడీ రాకకు ముందే ఎమ్మెల్యేల కొనుగోళ్లు, బేరసారాల వ్యవహారం కలకలం రేపిన విషయం మనకెరుకే. ఈనెల ఎనిమిదిన వందే భారత్ రైలును ప్రారంభించే నిమిత్తం ప్రధాని హైదరాబాద్‌కు రానున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇప్పుడు కూడా పేపర్ లీకేజీలాంటి అలజడులను క్రమం తప్పకుండా కొనసాగించటం ద్వారా మోడీ పర్యటనలో కూడా ఆ అంశాన్ని పదే పదే తమకు అనుకూలంగా మార్చుకోవచ్చన్నది రాష్ట్ర బీజేపీ నేతల వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు పేర్కొనటం గమనార్హం. మరికొద్ది నెలల్లో రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న దృష్ట్యా వచ్చిన ప్రతీ అవకాశాన్ని, సందర్భాన్నీ తమకు అనుకూలంగా మార్చుకోవటం ద్వారా తెలంగాణలో గద్దె నెక్కాలన్నది ఆ పార్టీ వ్యూహంగా కనబడుతున్నదనేది వారి వాదన. ఈ రకంగా అందలం ఎక్కటానికి ఎలాంటి అడ్డగోలు వ్యవహారాలకైనా పాల్పడే ఆ పార్టీ... ఇప్పుడు తెలంగాణలో గద్దె నెక్కేందుకు ఏకంగా పిల్లల భవిష్యత్తుతోనే రాజకీయ క్రీడలాడేందుకు సిద్ధపడుతుండటం అత్యంత దారుణం.



సరే.. ఇలాంటి అభిప్రాయాలు, వాదనలూ ఎలా ఉన్నా... బండి సంజయ్‌ను అరెస్టు చేసిన వెంటనే ఢిల్లీకి చెందిన కాషాయ పరివారం ఆగమేఘాల మీద స్పందించింది. ఏకంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జిలు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్ చేసిన హడావుడి, ఆర్భాటం అంతా ఇంతా కాదు. పదో తరగతి ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షమవటంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సంజయ్... నిజంగా ఎలాంటి తప్పూ చేయకపోతే ఆయన్ను పోలీసులు ఏమీ చేయలేరు. ఆ విషయం తెలిసినప్పటికీ హస్తినలోని బీజేపీ అగ్రనాయకత్వం ఆయన్ను అరెస్టు చేసిన వెంటనే ఎందుకు భుజాలు తడుముకుంటున్నదనేది ఇప్పుడు శేష ప్రశ్న. ఇక్కడ ఒక విషయం మన స్ఫురణకు రాక మానదు. లీకేజీల తతంగాలనేవి... బహుశా బీజేపీ నేతలకు తెలిసినంతగా మరొకరికి తెలియవేమో. ఎందుకంటే ఆ పార్టీ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో అనేక సార్లు పేపర్లు లీకేజీలై నిరుద్యోగులు, విద్యార్థుల భవితవ్యం బుగ్గిపాలైన ఘటనలు అనేకం.

మరోవైపు బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదిన్న రేండ్ల కాలంలో ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు చేయని కుట్ర, కుతంత్రం లేదు. బుజ్జగింపులు, బేరసారాలకు వింటే ఓకే... లేదంటే ఈడీ, సీబీఐ ద్వారా అదిరింపులు, బెదిరింపులకు పాల్పడటమనే పద్ధతులకు అది శ్రీకారం చుట్టిన, చుడుతున్న విషయం మనకందరికీ ఎరుకే. ఆ కోణంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అప్రదిష్ట పాల్జేసేందుకు ఇక్కడి కమలం నేతలు పావులు కదుపుతున్నారనే వాదనలను మనం కొట్టి పడేయలేం. కాకపోతే ఈ కుట్రలు, కుతంత్రాలు, పొలిటికల్ డ్రామాలు రాజకీయ క్రీడలకు బీజం మాత్రం ఢిల్లీలోనే పడుతున్నదనేది నగ్న సత్యం. అది ఎమ్మెల్యేల బేరసారాలైనా, టీఎస్‌పీఎస్సీ లీకేజైనా, పది ప్రశ్నాపత్రాల బాగోతమైనా అక్కడి డైరెక్షన్‌లోనే నడుస్తోందంటూ అధికార బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. గతంలో కొనసాగిన పరిణామాలు ఈ ఆరోపణలకు బలం చేకూర్చేదిగా ఉంది. 'బీజేపీ డీఎన్ఏలోనే మోసం, దగా ఉన్నాయి...' అంటూ ఇటీవల ఒక జాతీయ పార్టీ నాయకుడు వ్యాఖ్యానించిన విషయాన్ని మనం ఇక్కడ గుర్తుంచుకోవాలి. అందువల్ల ఇలాంటి చర్యలకు అసలు మూలాలను తుంచేయాలంటే... దేశ, ముఖ్యంగా రాష్ట్ర ప్రజలు అత్యంత జాగరూకతతో ఉండాలి. ప్రజాతంత్ర, లౌకిక, వామపక్ష శక్తులతో కలిసి ఎప్పటికప్పుడు దాని ప్రజా వ్యతిరేక, మతతత్వ, కార్పొరేట్ విధానాలపై పోరాడటం ద్వారా అలాంటి పన్నాగాలను తిప్పికొట్టాలి. నిరుద్యోగులను ఆత్మహత్యల నుంచి కాపాడాలన్నా, విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలన్నా ఇప్పుడు మనకు ఈ పోరాటాలు తప్ప వేరే మార్గం లేదు.



గొర్రెలు పెరుగుతున్నయ్..

ఎందరున్నారీ విశాల విశ్వంలో
ఏసుక్రీస్తులు, సుందరయ్యలు!
కాలాన్ని యశస్సుతో కొలిచేవాళ్ళు!
త్యాగాన్ని మనస్సుతో పిలిచేవాళ్ళు.

ఎందరున్నారీ భూమండలంలో
కారల్ మార్క్సులు, నెల్సన్ మండేలాలు!
పీడితులకు ముక్తి మార్గం చూపిన వారు,
విప్లవ జ్యోతి మండేలా ఆజ్యంపోసిన వారు.

ఎందరున్నారీ భువన భవనంలో
భగత్ సింగ్‌లు, సీతారామరాజులు!
ఉరితాళ్ళను ముద్దాడినవారు
పోరు సూర్యులై విప్లవం విరజిమ్మినవారు.

ఎందరున్నారీ ధరణీతలంలో
దొడ్డి కొమరయ్యలు, చాకలి ఐలమ్మలు!
దోపిడీకి ఎదురొడ్డిన వారు.
ఆధిపత్యాన్ని అణగదొక్కినవారు.

ఎందరైతేనేమి? వారె మనకాదర్శం
కొందరు, కొందరు కలిస్తే
వందలు, వేలు కారా!
ప్రశ్నించే వారేకద దేశ భక్తులు!
పిరికిపందలెపుడూ గొర్రెల మందలే!

స్వరాలు కరాలు కలిస్తేనే సమరాలు.
వివరాలు తెలిసినా, విపక్షాల మౌనాలు
పీడిత జనాన్ని ఏకం చేయకపోతే
మాటలన్ని గారడీలె, కాలక్షేపం బటాణీలె!

మన ప్రజాస్వామ్యం
మరణశయ్యపై వుంది.
బతికించే వైద్యులేమో
అతి తెలివితో వున్నారు.
శతులు, మతులు కుదరక,
వైద్యం గతి తప్పుతోంది.
ముహూర్తాలు చూస్తుంటే
ముప్పు ముంచుకొస్తోంది.

- కందాడై శ్రీనివాసులు

ఆర్థిక, సామాజిక పోరాటాలతోనే మతోన్మాదాన్ని ఓడించగలం

సమాజంలో ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయి. ఇవి ముఖ్యంగా భారతదేశం లాంటి మూడో ప్రపంచదేశాలలో ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. ఆర్థిక మాంద్యం ధోరణులు ఉధృతమవుతున్నాయి. పెట్టుబడులు మాత్రం భారత ఉత్పాదకత సామర్థ్యాలు పెంచేలా పెరగడం లేదు. ఉపాధి కల్పన చాలా స్తబ్ధతగా ఉంది. దారిద్ర్యమేమో చాపకిందనీరులా విస్తరిస్తున్నది. దీనికి ప్రధాన కారణం... సంపద కొద్దిమంది సుసంపన్నుల వద్ద పోగుబడి ఉండటం. వారు ధనవంతులు కావడానికి దేశ ఏలికలు ఎర్రతివాచీ పరవడం. మరి లేకపోతే దేశం సృష్టిస్తున్న ఆదాయంలో నలభై శాతం పైగా సంపద ఒక శాతం మంది వద్దే ఉండటమేంటి? ఇది ఆశ్చర్యకరమే కాదు ఆందోళనాకరం కూడా. పెట్టుబడిదారి వ్యవస్థ నయా ఉదారవాదం మిగులును రాబట్టుకోవటానికి అన్ని మార్గాలను ఉపయోగించుకుంటున్నది ఇది వాస్తవం. హక్కులను హరించటం ద్వారా బహుముఖ వేగంతో సంపదను పోగుచేసుకుంటున్నది. పది మంది సుసంపన్నుల మొత్తం సంపద 2022లో రూ.27.5లక్షల కోట్లుగా ఉంటే అది 2021తో పోల్చితే 32.8శాతం ఎక్కువ. యాభై శాతం మంది ప్రజల వద్ద ఉన్నది కేవలం మూడు శాతం సంపద మాత్రమే. 2022లో మొత్తం శతకోటీశ్వరుల సంఖ్య 102మంది. 2022లో ఈ సంఖ్య 166కి పెరి గితే దీనికి విరుద్ధంగా దాదాపు 23కోట్ల మంది ప్రజలు ఆకలి, దారిద్ర్యంలో బతుకులీడుస్తున్న దైన్యస్థితి. సంపన్న వర్గాలు చెల్లించే పన్నుల కన్నా సాధారణ ప్రజలు చెల్లించే పన్నులు ఆరు రెట్లెక్కువ. ఇక్కడున్న పెట్టుబడిదారీ విధానం వల్ల కార్మికవర్గం (గ్రామసీమలలో పనిచేస్తున్న కార్మికవర్గంతో సహా), రైతాంగం మీద దోపిడీ రోజురోజుకీ పెరుగుతున్నది. తిరోగమన ఫ్యూడల్, అభివృద్ధి నిరోధక సామాజిక పద్ధతులు, కులం, మతం, లింగ, జాతి లాంటి తారతమ్యాలు మనదేశంలో ఆచరణలో ఉన్నాయి. వీటన్నింటిని పాలకవర్గాలు ఉపయోగించుకోవటమే కాదు దుర్వినియోగం చేసి, మరింత దోపిడీని సాగించటానికి, లాభాలు పోగేసుకోవటానికి సాధనాలుగా వాడుకుంటున్నాయి. భూస్వామిక, పితృస్వామిక, కుల వ్యవస్థకు మూలమైన తిరోగామి 'హిందుత్వ' విధానంపై ఆధారపడి ఉన్న పాలనలో మనం జీవిస్తున్నాం. దేశంలో భూస్వామిక విధానానికి గుర్తులుగా ఉన్న కులం, లింగం వంటి వివక్షతలను పాలకవర్గాలు తమ రాజకీయ ప్రయోజనాలకే కాదు, ఆర్థిక ప్రయోజనాలకూ ఉపయోగించుకుంటున్నాయి.


పాలడుగు భాస్కర్

> సమాజంలోని అన్నిరకాల పీడన, దోపిడీల నుండి సంపూర్ణ విముక్తి కోసం సీఐటీయూ నిలబడుతుందని తన నిబంధ నావళిలో ప్రకటించింది. ఈ లక్ష్య సాధన అనేక కష్టనష్టాలతో కూడినది. దీన్ని సాధించాలంటే కార్మికవర్గంలో విశాల ఐక్యతను సాధించడమే మార్గం. కులం మన దేశంలో కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముళ్ళ కంచెలా ఉంటుంది. దోపిడీ వర్గాల, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పాలకవర్గాలు కార్మికవర్గాన్ని కులం, మతం, ప్రాంతం, జాతి, భాష, లింగం లాంటి అంశాలను ముందుకు తెచ్చి కార్మికవర్గాన్ని వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసి పాలకవర్గాలు పబ్బం గడుపు కుంటున్నాయి. అయినప్పటికీ సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తూ శ్రామిక వర్గాన్ని ఐక్యం చేయాలని సీఐటీయూ ఆకాంక్షిస్తున్నది.

6నుంచి 14వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు

జాతీయోద్యమ కాలంలోనూ, స్వాతంత్ర్యానంతర కాలం లోనూ భారతదేశంలో కొనసాగుతున్న కుల వివక్ష, అంటరాని తనం, అణచివేత, మూఢ నమ్మకాలు, స్త్రీల హక్కులు, ఆర్థిక, సామాజిక దోపిడీ, పీడనల నుండి విముక్తి కోసం దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలతో పాటు వెనకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు అశేషత్యాగాలు చేశారు. వారు నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాడారు. వారి పోరాటాలు, త్యాగాలు, వారుచేసిన కృషి ఫలితంగానే, నేడు ఆయా తరగతులకు కొన్ని హక్కులు, చట్టాలు, సౌకర్యాలు లభించాయి. ప్రజలను వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక రంగాల్లో అనేక విప్లవాత్మక మార్పులు సంభవించాయి. ఆ మహనీయులను స్మరించుకోవడానికి ప్రతి ఏడాది ఏప్రిల్ నెల ఓ ప్రత్యేకత చాటుతున్నది. అంటరానితనం, అణచివేత, దోపిడీలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప సంఘ సంస్కర్తలు, సామాజికవేత్తలు, విప్లవకారులు, దోపిడీ రహిత సమసమాజ స్థాపనను కాంక్షించే కార్మికోద్యమ నేతల వర్ధంతులు, జయంతులు వరుసగా ఈ నెలలోనే రావడం విశేషం. 5న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 6న అన్నిరకాల వివక్షతలు, అణచివేతలు, దోపిడీల నుండి ప్రజల్ని విముక్తి చేసి సమసమాజ స్థాపన లక్ష్యానికి కట్టుబడిన కార్మికోద్యమ నేత బీటీరణదివే జయంతి, 11న అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనలతో పాటు మహిళా ఉద్ధరణ, హక్కుల కోసం కృషి చేసిన జ్యోతిరావ్ పూలే జయంతి, 14న అంటరానితనం, బానిసత్వంపై పదునైన ఆయుధాన్ని ఎక్కు పెట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి. ఈ మహనుభావు లను స్మరించుకుంటూ, వారి స్ఫూర్తితో ఆర్థిక, సామాజిక ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన బాధ్యత మనం దరిపై ఉంది. ఈ నేపథ్యంలో 2023 ఏప్రిల్ 6 నుంచి 14 వరకు సామాజిక న్యాయ వారోత్సవాలను నిర్వహించాలని సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. మనుధర్మ శాస్త్రాన్ని మట్టుబెట్టడం, కుల వివక్షతను అంతం చేయడం, మతో న్మాద, విచ్ఛిన్నకర శక్తులను ప్రతిఘటించడం, సామాజిక న్యాయం కోసం కార్మికవర్గ ఐక్యతను చాటడం వంటి మౌలిక లక్ష్యాలుగా ఈ సామాజిక న్యాయ వారోత్సవాన్ని నిర్వహించాలని కార్మికులకు నిర్దేశిస్తున్నది.

మనుధర్మశాస్త్రం అమలుకు బీజేపీ-ఆరెస్సెస్ కుట్ర

కామ్రేడ్ బీటీఆర్, జ్యోతిరావ్‌పూలే, బీఆర్ అంబేద్కర్ ఆశించిన ఆశయాలకు బీజేపీ తూట్లుపొడుస్తున్నది. వారు పోరాడి మనకు అందించిన హక్కులను హరిస్తున్నది. ఆరెస్సెస్ గురువు గోల్వాల్కర్ 1930 నవంబర్ 30లో వారి అధికారిక పత్రిక ఆర్గనైజర్‌లో 'భారత రాజ్యాంగాన్ని మేము అంగీకరించడం లేదు' అని చాలా స్పష్టంగా చెప్పాడు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పరమ చెత్తని వ్యాఖ్యానించాడు. మన రాజ్యాంగంలో కొన్ని పేజీలు బ్రిటన్ రాజ్యాంగం, మరికొన్ని పేజీలు జర్మనీ రాజ్యాంగం, ఇంకొన్ని పేజీలు ఇంగ్లాండ్ రాజ్యాంగం ఇలా ఇతర దేశాల రాజ్యాంగాల నుంచి తీసుకొచ్చి వాటిని అతుకుబెట్టి పుస్తకంగా తయారుచేసి రాజ్యాంగమన్నారని హేళనచేశాడు ఇది భారత సనాతన ధర్మానికి పనికిరాదని, హిందూ సంస్కృతిని రక్షించలేదని, కాబట్టి ఈ రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగిస్తామని, కొత్త రాజ్యాంగాన్ని అమలు జరుపుతామని ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు చెబుతున్నారు. ఏమిటా కొత్త రాజ్యాంగం? అది మనుధర్మ శాస్త్రమట. మనుధర్మ శాస్త్రమే మనదేశానికి అనువైన రాజ్యాంగమని బీజేపీ- ఆరెస్సెస్‌లు చెప్తున్నాయి. కుల ధర్మాన్ని పాటించాలనేదే మనుధర్మం. ఏ కులం వారు ఎలా జీవించాలో శాసించేదే మనుధర్మ శాస్త్రం. బ్రాహ్మణులు అత్యున్నత కులంలో పుట్టినవారు, ఆరాధనీయులు, అందరూ గౌరవించాల్సిన వారనీ, వారి తరువాత క్షత్రియులంటే రాజులని, వీరు రాజ్యాన్ని పరిపాలించడానికి పుట్టారని, మిగిలిన కులాల వారందరూ పై కులాల వారికి సేవలు చేయాలని, పంచములు ఊరు బయట ఉండాలని, వారికి చదువు, ఆస్తి ఉండకూడదని నిబంధనలు విధించే దుర్మార్గమైన పుస్తకమే మనుధర్మ శాస్త్రం. ఆ కుల ధర్మాన్ని పాటించాలంటున్నది బీజేపీ. ఏ కుల వృత్తి వారు ఆ కుల వృత్తే చేయాలట. అంటే ఈ ఆధునిక కాలంలో కూడా మాదిగలు చెప్పులే కుట్టాలి, మేదరులు బుట్టలే అల్లాలి, కుమ్మరులు కుండలే చేయాలి, చాకలివారు బట్టలే ఉతకాలి, మంగళి క్షవరాలే చేయాలి, మిగతా అగ్ర కులాలు మాత్రం రాజ్యాన్ని ఏలాలి. ఇది మనుధర్మం. మనుధర్మం శిక్షలు కూడా కులాన్ని బట్టే వేయాలని చెబుతున్నది. బ్రాహ్మణులు తప్పు చేస్తే శిక్ష లేదు. క్షత్రియులు తప్పు చేస్తే మందలించాలి. శూద్రులు తప్పు చేస్తే కొరడాలతో కొట్టి చంపాలి. పంచములు తప్పు చేస్తే మెడనరికి చంపాలి. ఇది మనుధర్మ శాస్త్రం. ఈ మనుధర్మ శాస్త్రం పరమ పవిత్రమైందని, భారత రాజ్యాంగంలో అది పొందుపర్చా లనేటువంటి ఒక అనాగరికమైన సిద్ధాంతం బీజేపీ- ఆరెస్సెస్‌లది.

ముస్లింలు, క్రిస్టియన్లు దేశం విడిచిపోవాలట

భారతదేశంలో అనేక మతాల వారు, హిందువులు, ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీయులు వందల సంవత్సరాలుగా ఐక్యమత్యంగా అన్నదమ్ముల్లాగా జీవిస్తున్నటు వంటిది మన భారతీయ సంస్కృతి. ఇది అందరి మతస్తుల రాజ్యం కాదని, ఇది కేవలం హిందువుల రాజ్యమేనని బీజేపీ ఘంటాపథంగా చెపుతున్నది. హిందుస్థాన్‌ను స్థాపిస్తాం. ముస్లింలు, క్రిస్టియన్లు ఈ దేశంవారు కాదు. ముస్లింలు పాకిస్థాన్ పోవాల్సిందే, క్రిస్టియన్లు ఇంగ్లాండ్ పోవాల్సిందే' అంటూ మతోన్మాద, భావోద్రేకాలను రెచ్చగొడుతున్నారు ఆ నాయకులు. ఇక్కడే ఉండదలచుకుంటే 'మా కాలు కింద చెప్పు లాగా, చెప్పు కింద తేలు లాగా బతకాలి' తప్ప ఇతర మతస్తులకు సమానమైన హక్కులు ఈ దేశంలో వారికి ఉండబోవని బాహాటంగా చెబుతున్నది బీజేపీ. మనుధర్మ శాస్త్రం వెలుగులోనే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ కాలంలో దళితులపై మూడు రెట్లు హింస పెరిగింది. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఊనా పట్టణంలో ఆవు మాంసం వలుస్తున్నారనే నెపంతో నలుగురి దళిత యువకులను చెట్టుకు కట్టేసి కొట్టారు. ఒక దళితుడు గుర్రం ఎక్కాడని కిందపడేసి కొట్టి చంపారు. యూపీలో ఓ దళిత యువతిని హత్రాస్‌లో గ్యాంగ్ రేప్ చేసి, నాలుక కోసి, నడుము విరిచినా పోలీస్‌స్టేషన్‌లో కనీసం ఫిర్యాదు కూడా తీసుకోలేదు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణిస్తే కనీసం ఆ శవాన్ని కూడా కుటుంబానికి ఇవ్వలేదు. ఇది వారి పాలనా విధానం. అనుసరిస్తున్న దుర్మార్గం. మతం పేరుతో, దేశ భక్తి ముసుగులో ప్రజలు, కార్మికుల మధ్య చిచ్చు పెడుతున్నది. దళితులు, గిరిజనులు, మహిళలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నది. జాతీయ వనరులను, ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా తన తాబేదారులకు కట్టబెడుతున్నది. ప్రభుత్వరంగాన్ని మొత్తం ప్రయివేటుపరం చేయడం ద్వారా దళిత, గిరిజన, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లకు బీజేపీ ప్రభుత్వం గండి కొడుతున్నది. నూతన విద్యా విధానం పేరుతో మనువాద సిద్ధాంతాన్ని విద్యా విధానంలోకి చొప్పించి అమలు చేస్తున్నది. దీంతో అణగారిన పేదలను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నది. గోరక్షణ ముసుగుతో దేశంలో దళితులు, మైనారిటీలపై దాడులు పెంచుతున్నది. కార్మిక సంఘాలు, వారి హక్కులు, చట్టాలపై ఏకపక్ష దాడికి పూనుకున్నది. ఏండ్లుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మార్చివేస్తున్నది. ఈ దుర్మార్గ విధానాలను ప్రతిఘటిస్తున్న ప్రజలు, కార్మికులు ఐక్యం కాకుండా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. ఇది బీజేపీ ద్వంద్వ విధానం.



> కామ్రేడ్ బీటీఆర్, జ్యోతిరావ్‌పూలే, బీఆర్ అంబేద్కర్ ఆశించిన ఆశయాలకు బీజేపీ తూట్లుపొడుస్తున్నది. వారు పోరాడి మనకు అందించిన హక్కులను హరిస్తున్నది. ఆరెస్సెస్ గురువు గోల్వాల్కర్ 1930 నవంబర్ 30లో వారి అధికారిక పత్రిక ఆర్గనైజర్‌లో 'భారత రాజ్యాంగాన్ని మేము అంగీకరించడం లేదు' అని చాలా స్పష్టంగా చెప్పాడు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పరమ చెత్తని వ్యాఖ్యానించాడు. మన రాజ్యాంగంలో కొన్ని పేజీలు బ్రిటన్ రాజ్యాంగం, మరికొన్ని పేజీలు జర్మనీ రాజ్యాంగం, ఇంకొన్ని పేజీలు ఇంగ్లాండ్ రాజ్యాంగం ఇలా ఇతర దేశాల రాజ్యాంగాల నుంచి తీసుకొచ్చి వాటిని అతుకుబెట్టి పుస్తకంగా తయారుచేసి రాజ్యాంగమన్నారని హేళనచేశాడు ఇది భారత సనాతన ధర్మానికి పనికిరాదని, హిందూ సంస్కృతిని రక్షించలేదని, కాబట్టి ఈ రాజ్యాంగాన్ని పూర్తిగా తొలగిస్తామని, కొత్త రాజ్యాంగాన్ని అమలు జరుపుతామని ఆరెస్సెస్ సిద్ధాంతకర్తలు చెబుతున్నారు. ఏమిటా కొత్త రాజ్యాంగం? అది మనుధర్మ శాస్త్రమట.

కార్మికవర్గ జమిలి పోరాటాలే ఏకైక మార్గం

సమాజంలోని అన్నిరకాల పీడన, దోపిడీల నుండి సంపూర్ణ విముక్తి కోసం సీఐటీయూ నిలబడుతుందని తన నిబంధ నావళిలో ప్రకటించింది. ఈ లక్ష్య సాధన అనేక కష్టనష్టాలతో కూడినది. దీన్ని సాధించాలంటే కార్మికవర్గంలో విశాల ఐక్యతను సాధించడమే మార్గం. కులం మన దేశంలో కార్మికవర్గాన్ని ఐక్యం కానివ్వకుండా దారికడ్డంగా, ముళ్ళ కంచెలా ఉంటుంది. దోపిడీ వర్గాల, పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పాలకవర్గాలు కార్మికవర్గాన్ని కులం, మతం, ప్రాంతం, జాతి, భాష, లింగం లాంటి అంశాలను ముందుకు తెచ్చి కార్మికవర్గాన్ని వారి ఐక్యతను విచ్ఛిన్నం చేసి పాలకవర్గాలు పబ్బం గడుపు కుంటున్నాయి. అయినప్పటికీ సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తూ శ్రామిక వర్గాన్ని ఐక్యం చేయాలని సీఐటీయూ ఆకాంక్షిస్తున్నది. రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్ల పరిరక్షణ, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, మత సామరస్యం, ఫెడరలిజం వంటి రాజ్యాంగంలో ఉన్న మూల స్తంభాల రక్షణ కోసం కార్మికవర్గం నిరంతరం పోరాడాలి. నేటికి కులవివక్ష, అంటరానితనం కొనసాగుతున్నది.హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, గుడిలోకి రానివ్వకపోవడం, పండుగలు, ఉత్సవాలలో దళితులను అంటరానివారుగా దూరం పెట్టటం, దళితులు చైతన్యం ప్రదర్శిస్తే వారిపై భౌతిక దాడులు నిత్యకృత్యమవు తున్నాయి. రాష్ట్రంలో 76కుల దురహంకార హత్యలు జరిగాయి. గ్రామ అభివృద్ధి కమిటీల పేరుతో సాంఘిక బహిష్కరణలు చోటుచేసు కుంటున్నాయి. జోగిని వ్యవస్థ ఇంకా అమలులోనే ఉన్నది. వీటికి వ్యతిరేకంగా జరిగిన అన్ని పోరాటాల్లో కార్మికవర్గం అగ్రభాగాన నిలవాలి. ఆర్థిక పోరాటాలతో పాటు సామాజిక అణచివేత, వివక్షలకు వ్యతిరేకంగా జమిలి పోరాటం చేస్తేనే మతోన్మాదాన్ని ఓడించడం సాధ్యమవు తుంది.ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ కర్తవ్య సాధనకు కార్మికవర్గం పూనుకోవాలి. అప్పుడే కామ్రేడ్ బీటీ రణదివే, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావుపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల ఆశయాలను సాధిస్తాం. ఆ మార్గంలో కార్మికవర్గం కదన రంగంలోకి దిగాలి. సమరశీల పోరాటాలు చేయాలి. మతోన్మాద విధానాలను ఎండగట్టాలి. సమసమాజ స్థాపన కోసం ఉద్యమించాలి...

చట్టాల ఉల్లం'ఘనులు'

ప్రతి మనిషి జీవించే హక్కులో భాగంగా మానవ హక్కులు ఏర్పడ్డాయి. జీవించడం అంటే గౌరవంగా, స్వేచ్ఛగా జీవించడం. ప్రతి వ్యక్తికి సామాజిక, ఆర్థిక, రాజకీయంగా న్యాయం, సమానత్వం అందించాలనేది భారత రాజ్యాంగం స్ఫూర్తి. ప్రాథమిక హక్కులు అందరికీ సమానమే అలాగే మానవ హక్కులు కూడా అందరికీ సమానమే. మన దేశంలో మానవ హక్కులు ఎలా ఉన్నాయి? స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల మాటేమిటి? వాక్ స్వాతంత్ర్యపు హక్కు ఉన్నదా? దర్యాప్తు సంస్థలు, పోలీసులు చట్టానికి లోబడి పనిచేస్తున్నారా? లేదా అనే ప్రశ్నలకు లేదనే సమాధానం ఇవ్వాల్సిన పరిస్థితులను చూస్తున్నది. ఢిల్లీ లిక్కర్ కేసులో బీఆర్.ఎస్. ఎమ్మెల్సీ కవితకు నోటీసులు ఇచ్చి ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ).. విచారణ చేపడుతున్నది.


బచ్చు శ్రీనివాస్

తమ స్వార్థం కోసం, రాజకీయాలు చేయడం కోసం చట్టాలను ఉల్లంఘించడం బీజేపీ పెద్దలకు అలవాటే. దేశానికే మోడల్‌గా చెప్పుకునే గుజరాత్ రాష్ట్రం కస్టోడియన్ మరణాల్లో గత ఐదేండ్లలో దేశంలో నెంబర్1 అనే పార్లమెంట్ సాక్షిగా తాజాగా బయటపడింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పార్లమెంటులో అందజేసిన జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక ప్రకారం.. గుజరాత్‌లో 2017-18 సంవత్సరంలో14 మంది, 2018-19 లో 13, 2019-20లో 12, 2021లో 24 కస్టోడియల్ మరణాలు సంభవించాయి. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖాలీక్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ హోం వ్యవహారాల సహాయ మంత్రి తెలిపిన వివరాలివి. ప్రశ్నించే వారిని అరెస్ట్ చేయడం, జైలులో నిర్బంధించడంతో గుజరాత్ రాష్ట్రంలో జైళ్లు కూడా కిక్కిరిసిపోయిన విషయం తేటతెల్లమైంది. గుజరాత్ రాష్ట్రంలోని మొత్తం జైళ్లలో 13,999 మంది ఖైదీల సామర్థ్యం ఉంది. కాగా ప్రస్తుతం వాటిల్లో16,597 మంది ఖైదీలు ఉన్నారు. గుజరాత్‌లో పెరుగుతున్న కస్టోడియన్ మరణాలు, కిక్కిరిసిన జైళ్లు.. బీజేపీ పెద్దల చట్టబద్ధపాలన, చట్టాలను గౌరవించే తీరు, మానవ హక్కుల రక్షణకు చేస్తున్న కృషికి అద్దం పడుతున్నాయి.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతియుతంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న ఉద్యమకారులు, పాత్రికేయులు, రచయితలు, రాజకీయ, ప్రజా సంఘాల లీడర్లను నిరంకుశ చట్టాల కింద ఎలాంటి విచారణ లేకుండా అరెస్ట్ చేసి, దీర్ఘకాలం జైలులో ఉంచడం విపరీతంగా పెరిగింది. ఇండియాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నట్లు అంతర్జాతీయ వేదికలపై పలు దేశాలు బాహాటంగానే విమర్శల బాణాలు సంధిస్తున్నాయి. 2021-22లో మొదటి పది మాసాల్లో మానవ హక్కుల ఉల్లంఘన కేసులు 37 శాతం పెరిగాయని అంచనా. మానవ హక్కులకు సంబంధించి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఏటా విడుదలచేసే వార్షిక నివేదికను 2019 నుంచి ప్రచురించకుండా కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిలిపేసింది. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు గట్టిగా ప్రశ్నిస్తే నామ్ కే వాస్తే కొన్ని లెక్కలు బయటపెడుతున్నది.

మోడీ పాలనలో ఉపా(చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం) కింద మొత్తం గతేడాది వరకు10,552 అరెస్టులు చేస్తే, అందులో అభియోగాలు రుజువైన వారు కేవలం 253 మంది మాత్రమే. మిగతా 10,299 మంది కనీస హక్కులను, స్వేచ్ఛను బీజేపీ ప్రభుత్వం కాలరాసినట్లే కదా! దేశ ద్రోహం కేసుల్లోనూ ఇలాంటి అణచివేత వైఖరే కొనసాగుతున్నది. గత 8ఏండ్లలో దేశ ద్రోహం కేసులు 7,110 నమోదు చేస్తే, వాటిలో నేరం రుజువై, శిక్షలు పడిన కేసులు పది శాతానికి మించవు. ఇవిగాక మోడీని విమర్శించినందుకు కూడా 149 కేసులు నమోదు చేయడం రాజ్యాంగ, మానవ హక్కుల స్ఫూర్తికి నిలువుటద్దం.



> కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలు, బలగాలతో మానవ హక్కుల ఉల్లంఘన చర్యలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నది. అధికారంలో ఉన్న నాయకుల పట్ల, అధికారుల, పోలీసుల వైఖరి ఉదాసీనంగా ఉండటం, ప్రశ్నించేవారు, సామాన్య పౌరుల పట్ల కఠినంగా ఉండటం కూడా మానవహక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఇలాంటి చర్యలను పౌర సమాజం ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, విశ్వమానవ సౌభ్రాతత్వ భావన కొనసాగాలంటే మానవ హక్కుల ఉల్లంఘనలపై అందరూ పోరాడాల్సిందే!

ఇండియాలో పౌరహక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నదని 'ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ)' ఆ మధ్య ఆందోళన వ్యక్తం చేసింది. లక్షిత వర్గంపై ఉపా వంటి తీవ్రవాద వ్యతిరేక చట్టాలను అకారణంగా ప్రయోగించడం పెరిగిందని మండిపడింది. 'యూనివర్సల్ పీరియాడిక్ రివ్యూ' (యూపీఆర్) పేరిట నాలుగేండ్లకు ఒకసారి సమీక్షా సమావేశం జరుగుతుంది. ఇటీవల జరిగిన ఈ సమావేశంలో సభ్యదేశాల ప్రతినిధులు, పౌరహక్కుల కార్యకర్తలు, జర్నలిస్టులు భారత్‌లో నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో మోడీ సర్కారుకు పలు ప్రశ్నలు వేయడంతో పాటు.. ఆయా దేశాల ప్రతినిధులు కొన్ని సూచనలూ చేశారు. ఉపాచట్టం పేరుతో హక్కుల కార్యకర్తలను, మైనారిటీలను అరెస్టు చేసి జైలులో నిర్బంధించే చర్యలు మానుకోవాలని అమెరికా అంటే,ఉపా చట్టంలో మార్పులు చేయడంతోపాటు మతస్వేచ్ఛను రక్షించాలని కెనడా సూచించింది. బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడాలని జర్మనీ కోరితే, ఇంటర్‌నెట్, సోషల్‌మీడియాపై ఆంక్షలు పెట్టొద్దని స్విట్జర్లాండ్ హితబోధ చేసింది. జైలులో నిర్బంధించిన హక్కుల కార్యకర్తలను విడుదల చేయాలని ఐర్లాండ్, బెల్జియం, లక్సెంబర్గ్ లాంటి దేశాలు ఇండియాకు సూచించాయి. వాక్ స్వాతంత్ర్యం, నిరసన తెలిపే హక్కుకు అవకాశం కల్పించాలని లాటిన్ అమెరికా, ఐరోపా దేశాలు మోడీ ప్రభుత్వాన్ని కోరిన విషయం గమనించాలి. గత రెండు నెలల కింద దేశ వాణిజ్య రాజధాని ముంబైలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియా గుటెర్రస్ మానవ హక్కుల విషయంలో ఇండియాపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇండియాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆయన పరోక్షంగా విమర్శించారు. మానవ హక్కుల మండలి (కౌన్సిల్)లో ఎన్నికైన సభ్య దేశంగా ఉన్న ఇండియాకు ప్రపంచవ్యాప్త మానవ హక్కులను ఒక షేప్ లోకి తెచ్చే బాధ్యత ఉందని, మైనారిటీ వర్గాలతో సహా అన్ని సామాజిక వర్గాలు, వ్యక్తులందరి హక్కులను పరిరక్షించి.. ప్రమోట్ చేయాల్సి ఉందన్న గుటెర్రస్ వ్యాఖ్యల నుంచి దేశం పాఠాలు నేర్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

దేశంలో మానవ హక్కుల పరిక్షణకు కృషి చేయాల్సిన బాధ్యతను కూడా 'జాతీయ మానవ హక్కుల సంఘం' సరిగా నిర్వర్తించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, ఆ రాష్ట్రాన్ని ముక్క చెక్కలు చేసి, కాశ్మీరీల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించి, రాజకీయ నాయకులను నెలల తరబడి గృహ నిర్బంధంలో ఉంచి, ఇంటర్నెట్, కమ్యూనికేషన్ సదుపాయాలను స్తంభింపజేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన మోడీ ప్రభుత్వ నిరంకుశ పోకడలను ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌తో సహా పలు సంస్థలు తీవ్రంగా విమర్శించినా, జాతీయ మానవ హక్కుల సంఘం పెద్దగా స్పందించ లేదు. బుల్డోజర్ దాడులతో సంఘ్ పరివార్ మూకలు చెలరేగిపోతుంటే, ఎన్‌హెచ్‌ఆర్‌సీ మౌనం వహించింది. గుజరాత్ మారణకాండలో బాధితులకు న్యాయం చేకూర్చేందుకు సుదీర్ఘంగా పోరాడిన సోషల్ యాక్టివిస్ట్ తీస్తా సెతల్వాద్‌ను అరెస్టు చేస్తే, అది అన్యాయమని ప్రపంచమంతా ఘోషించినా ఎన్‌హెచ్‌ఆర్‌సీ పట్టించుకోలేదు. జర్నలిస్టు జుబేర్ అరెస్టును ఎడిటర్స్ గిల్డ్‌తో సహా పలు పాత్రికేయ సంఘాలు, మేధావులు, న్యాయవాదులు ఖండించినా ఎన్‌హెచ్‌ఆర్‌సీ మౌనం వీడలేదు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలు, బలగాలతో మానవ హక్కుల ఉల్లంఘన చర్యలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నది. అధికారంలో ఉన్న నాయకుల పట్ల, అధికారుల, పోలీసుల వైఖరి ఉదాసీనంగా ఉండటం, ప్రశ్నించేవారు, సామాన్య పౌరుల పట్ల కఠినంగా ఉండటం కూడా మానవహక్కుల ఉల్లంఘనే అవుతుంది. ఇలాంటి చర్యలను పౌర సమాజం ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, విశ్వమానవ సౌభ్రాతత్వ భావన కొనసాగాలంటే మానవ హక్కుల ఉల్లంఘనలపై అందరూ పోరాడాల్సిందే!

సెల్:9348311117

మనసుకు నచ్చినట్టు...



అన్నింట్లోనూ సహజత్వాన్ని కోరుకునే మనం వంటగదిని కూడా ఎకోఫ్రెండ్లీగా తీర్చిదిద్దుదాం. వంటగదిలోని అన్నింటినీ మనసుకు నచ్చిన విధంగా, ఆహ్లాదకరంగా మార్చేద్దాం..

- సరకులను నిల్వచేసేందుకు ప్లాస్టిక్ డబ్బాలకు బదులుగా గాజు, పింగాణీ సీసాలను, స్టీలు పాత్రలను ఉపయోగించొచ్చు. చూడటానికి అందంగా ఉండడమే కాక ఆరోగ్యానికీ, పర్యావరణానికీ చేటుచేయవు.
- ప్లాస్టిక్ చాపింగ్ బోర్డులకు బదులుగా కూరగాయలు తరిగేందుకు చెక్కవి ఉపయోగిస్తే మేలు. వంట కోసం మట్టి పాత్రలను కూడా ప్రయత్నించొచ్చు.
- కూరగాయలను బయటినుంచి తెచ్చుకునేందుకు ఫ్రిజ్‌లో భద్రపరుచుకోడానికి కూడా రీ యూజబుల్ సంచులను వినియోగిస్తే సరి. ఇంట్లో పాలిథీన్ కవర్లు పేరుకోకుండా ఉంటాయి.
- కరెంటుతో పనిచేసే అవెన్లు, ఏసీలు, ఫ్రిజ్‌ల్లాంటి వస్తువుల్లో కరెంటు ఆదా చేసేవి ప్రత్యేకంగా ఎంపిక చేసి కొనండి. వంటగది వ్యర్థాలను పడేయటానికి బదులుగా కంపోస్ట్ తయారు చేస్తే సరి. దాన్ని గార్డెన్‌లో ఉపయోగిస్తే మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.
- ఇంట్లో అక్కడక్కడా కుండీల్లో మొక్కలు పెంచటం వల్ల లోపల ఉన్న కార్బన్‌డైఆక్సైడ్ ఆక్సిజన్‌గా మారుతుంది. స్వచ్ఛమైన గాలితో, పచ్చదనం కనిపిస్తుంటే ఇల్లు కూడా ఆహ్లాదంగా మారుతుంది.

స్థలం తక్కువైనా...

పూలమొక్కలు, క్రోటన్స్ తదితర ఇండోర్ మొక్కలే కాదు, తాజా ఆకుకూరలు, కూరగాయలనూ అపార్టుమెంట్ బాల్కనీలో పెంచొచ్చు అంటున్నారు నిపుణులు. తోట పెంపకంపై ఆసక్తి ఉన్నవారు స్థలాభావంతో నిరాశ చెందకుండా ప్రత్యేక పద్ధతులను అనుసరిస్తే చాలంటున్నారు.

- బాల్కనీ ఉన్నప్పుడు స్థలాభావం అనుకోవాల్సిన అవసరం లేదు. ప్రణాళికగా అన్నిరకాల మొక్కల పెంచుకోవచ్చు. ముందుగా మనసుకు నచ్చిన కూరగాయలు, పండ్ల మొక్కలేంటో నోట్ చేసుకోవాలి. తర్వాత ఎండ ఏ ప్రాంతంలో ఎక్కువ, లేదా తక్కువగా పడుతుందో గుర్తించాలి. అలాగే ఏ వేళలో ఎండవేడి ఎక్కడ ఎక్కువ ఉంటుందనేది కూడా గమనించాలి. దీనికి తగినట్లుగా ఆయా ప్రదేశాలకు తగిన మొక్కలను ఎంచుకోవచ్చు. ఎండ బాగా తగిలే చోట టొమాటో, వంకాయ, పచ్చిమిర్చి వంటివాటిని పెంచుకోవచ్చు. పుదీనా, కొత్తిమీర, మెంతి కూరవంటి ఆకుకూరల్ని పెంచేటప్పుడు రోజంతా కాకుండా ఒక పూట మాత్రమే ఎండ పడే ప్రాంతాన్ని ఎంచుకోవాలి.
- బాల్కనీ గార్డెన్‌కు నీటి సౌకర్యం నిత్యం అందేలా ఏర్పాటు చేసుకోవాలి. అలాగని మొక్కలన్నింటికీ ఒకేలా నీటిని అందించకూడదు. మొక్క, మట్టి, తొట్టె, వాతావరణం వంటివాటికి ప్రాముఖ్యతనివ్వాలి. ప్రతి మొక్క తనకు తానుగా తేమను స్వీకరించే వాతావరణాన్ని కల్పించాలి. ఎక్కువైన నీళ్ల కుండీ నుంచి బయటకు పోయేలా చూడాలి. అలాగే మట్టి పూర్తిగా పొడిబారి పోకుండా జాగ్రత్తపడాలి. ఏయే మొక్కకు ఎప్పుడు ఎరువు, నీటిని అందించాలో ఒక క్యాలెండర్‌ను సిద్ధం చేసుకోవాలి. కొన్నింటికి రోజుకొకసారి, మరికొన్నింటికి వారానికి మూడుసార్లు అంటూ లెక్క ప్రకారం తడిని అందించడానికి ఇది ఉపయోగపడుతుంది.



- బాల్కనీలో ఐరన్ స్టాండ్‌లను ఏర్పాటు చేసుకుని గ్రోబ్యాగ్స్‌లో కూరగాయలు పెంచుకోవచ్చు. అలానే తక్కువ స్థలంలో ఎక్కువ రకాల్ని పెంచాలనుకుంటే ట్రేల్లో ఆకుకూరలు నాటుకోవచ్చు. తీగ జాతి కూరగాయ పాదులను గ్రిల్‌కి అల్లుకునేలా చేయొచ్చు. అయితే దీని కోసం కాస్త పెద్ద కుండీని ఎంచుకుంటే బలంగా ఎదుగుతాయి. వెర్టికల్ గార్డెనింగ్ పద్ధతిలో ఎత్తు తక్కువగా పెరిగే టొమాటో వంటి రకాల్ని ఎంచి పెంచితే స్థలం కలిసి వస్తుంది.

పెరుగు పచ్చళ్లే పసందు...

ఎండాకాలం వచ్చిందంటే మన శరీరానికి చల్లదనాన్ని అందించే వాటిలో పెరుగుది మొదటి స్థానం. అయితే ఎప్పుడూ పెరుగన్నమేనా..! అంటూ మూతి ముడుస్తారు చాలా మంది. మరి ఎప్పుడూ అలాగే తింటే కొత్తదనం ఏముంటుంది. అందుకే ఈ వేసవిలో కాస్త భిన్నంగా ట్రై చేద్దాం. పండ్లని పెరుగులో కలిపేసి రైతాలు చేసుకుందాం. ఇవి రుచితో పాటు పోషకాలనూ అందిస్తాయి. శరీరానికి చల్లదనాన్నీ ఇస్తాయి. మరి అవెలా చేద్దామో తెలుసుకుందామా...



కరివేపాకుతో...

కావల్సిన పదార్థాలు : కరివేపాకు - కప్పు, పెరుగు - రెండు కప్పులు, మిరియాలు, జీలకర్ర - అరచెంచా చొప్పున, పచ్చిమిర్చి - ఒకటి, చింతపండు - కొద్దిగా, నూనె - చెంచా, ఉప్పు - తగినంత, కొబ్బరి తురుము - పావుకప్పు.

తాలింపు కోసం : నూనె - చెంచా, ఆవాలు - పావు చెంచా, ఇంగువ - చిటికెడు.

తయారు చేసే విధానం : బాణలిని పొయ్యిమీద పెట్టి చెంచా నూనె పోయాలి. అది వేడయ్యాక మిరియాలు, పచ్చిమిర్చి, జీలకర్ర వేసి రెండు మూడు నిమిషాలు వేయించి పక్కనపెట్టుకోవాలి. ఇవి చల్లారాక మిక్సీలో మెత్తగా చేసుకోవాలి. అదే బాణలిలో కరివేపాకును కూడా నూనె లేకుండా ఐదు నిమిషాలు వేయించుకుని తీసుకోవాలి. తర్వాత మిక్సీలో పొడిలా చేసుకోవాలి. ఇప్పుడు కొబ్బరి తురుము, చింతపండును కూడా ముద్దలా చేసుకోవాలి. పెరుగులో కరివేపాకు పొడి, కొబ్బరి మిశ్రమం, జీలకర్ర ముద్ద, తగినంత ఉప్పు వేసి అన్నింటినీ బాగా కలపాలి. ఇప్పుడు బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేడిచేసి ఆవాలు వేయాలి. అవి చిటపటలాడాక ఇంగువ వేసి దింపేయాలి. ఈ తాలింపును పెరుగుతో వేసి బాగా కలిపితే చాలు.





మామిడికాయతో

కావల్సిన పదార్థాలు : మామిడి కాయ - సగం ముక్క (తురమాలి), పచ్చిమిర్చి - ఒకటి, కొబ్బరి తురుము - అరకప్పు, చిక్కటి పెరుగు - రెండు కప్పులు, ఉప్పు - తగినంత.

తాలింపుకోసం : నూనె - చెంచా, ఆవాలు - పావుచెంచా, ఇంగువ - చిటికెడు.

తయారు చేసే విధానం : ముందుగా మిక్సీలో మామిడి తురుము, కొబ్బరి తురుము, పచ్చిమిర్చి తీసుకుని మెత్తని ముద్దలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక గిన్నెలో తీసుకుని పెరుగు, ఉప్పు వేసి బాగా కలపాలి. బాణలిని పొయ్యి మీద పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఆవాలు, ఇంగువ వేయాలి. ఆవాలు చిటపట లాడాక పొయ్యి కట్టేసి ఈ తాలిం పును పెరుగు లో వేస్త చాలు.





అరటిదూటతో...

కావల్సిన పదార్థాలు : అరటి దూట - చిన్న ముక్క, గడ్డ పెరుగు - రెండు కప్పులు, అల్లం - చిన్నముక్క, పచ్చిమిర్చి - ఒకటి, కొబ్బరి తురుము - నాలుగు పెద్ద చెంచాలు, ఉప్పు - తగినంత, కొత్తిమీర - కట్ట.

తాలింపుకోసం : నూనె - ఒక పెద్ద చెంచా, ఆవాలు పావు చెంచా, ఇంగువ - చిటికెడు, కరివేపాకు - ఒక రెబ్బ.

తయారు చేసే విధానం : ముందుగా అరటి దూటను చిన్న చిన్న ముక్కలుగా తరిగి అయిదు నిమిషాలు ఉడికించుకుని తీసుకోవాలి. తర్వాత అందులో ఉన్న నీటిని పారబోసి మరో గిన్నెలోకి తీసి పెట్టుకోవాలి. మిక్సీలో అల్లం, పచ్చిమిర్చి, కొబ్బరి తురుము, కాసిని నీళ్లు పోసి మెత్తని ముద్దలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని అరటి దూట ముక్కలకు కలపాలి. బాణలిని పొయ్యిమీద పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు వేయాలి. రెండు నిమిషాలయ్యాక కరివేపాకు, ఇంగువ వేయాలి. ఈ తాలింపును ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న అరటి ముక్కలకు కలిపి తర్వాత పెరుగు, తరిమిన కొత్తిమీర, ఉప్పు వేసి మరోసారి కలిపితే చాలు.





పైనాపిల్‌తో

కావల్సిన పదార్థాలు : పైనాపిల్ - పండులో సగం (చిన్నచిన్న ముక్కలుగా కోయాలి), పెరుగు - రెండు కప్పులు, ఆవాలు - పావు చెంచా, కొబ్బరి తురుము - నాలుగు చెంచాలు, పచ్చిమిర్చి - ఒకటి, ఉప్పు - తగినంత.

తాలింపుకోసం : నూనె - చెంచా, ఆవాలు - పావు చెంచా, ఇంగువ - చిటికెడు, కరివేపాకు - రెబ్బ.

తయారు చేసే విధానం : పైనాపిల్ ముక్కలను ఒక గిన్నెలో తీసుకోవాలి, మిక్సీలో ఆవాలు, కొబ్బరి తురుము, పచ్చిమిర్చి, కాసిని నీళ్ల తీసుకుని మెత్తని ముద్దలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పైనాపిల్ ముక్కల్ని పెరగులో వేసి కలపనాలి. పొయ్యిమీద బాణలి పెట్టి నూనె పోయాలి. అది వేడయ్యాక ఆవాలు వేయాలి. అవి చిటపటలాడాక కరివేపాకు, ఇంగువ వేసి దింపేయాలి. ఈ తాలింపును పెరుగులో వేసి సరిపడా ఉప్పు కలిపితే చాలు.

సంఘర్ష్‌కరో...

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశభవిష్యత్ కు మార్పు అవసరం..

ఈ మార్చ్ జాతీయ స్థాయిలో జరిగింది. ఇలాంటి ర్యాలీలు క్షేత్ర స్థాయిల్లో కూడా జరగాల్సిన అవసరం ఉన్నది. దేశ భవిష్యత్తు కోసం మార్పు అవసరం. కార్పొరేట్, మతోన్మాద మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు గర్జించాల్సిన సమయం ఆసన్నమైంది.

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

కార్పొరేట్ల సేవలో మోడీ సర్కార్..

మోడీ సర్కార్, బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్పొరేట్ల కోసం మాత్రమే పని చేస్తున్నది. ఇకనైనా దేశంలోని రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల కోసం పని చేయడం ప్రారంభించాలి.. దేశంలో ఆక్సిజన్, ఆస్పత్రి బెడ్లు, మెడిసన్ లేక లక్షలాది మంది ప్రజలు మరణించారు. ఉద్యోగాలు లేక యువత, పంటలకు సరైన ధర దక్క రైతులు, ఉపాధి పోయి వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

- ఏఐకేఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే

పేదలను దు:ఖంలోకి నెట్టే పాలన మోడీ సాగిస్తున్నారు. పేదలకు ఇచ్చే సబ్సిడీలను రద్దు చేస్తున్నారు. పేదలకు సంబంధించిన పథకాలకు బడ్జెట్ కేటాయింపుల్లో కోత విధిస్తున్నారు. పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయి. మరోవైపు యువతకు ఉద్యోగ కల్పన చేయటం లేదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి మోడీ, తొమ్మిదేండ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉన్నది. కానీ ఆ హామీని మరిచిపోయారు. దేశంలోని పేదలకు ఉద్యోగాలు కల్పించని మోడీ, గోరక్షక్ పేరుతో రెచ్చిపోతున్న మూకలకు ఉద్యోగాలు ఇచ్చారు.

- ఏఐకేఎస్ అధ్యక్షుడు విజయ రాఘవన్

సీఐటీయూ అనుబంధంగా ఉన్న 12 సెక్టోరల్ ఫెడరేషన్‌లు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంస్థలు, బ్యాంకు, బీమా, బీఎస్ఎన్, ఎఐఎస్‌జిఇఎఫ్, సిసిజిఈయూ నాయకులు కూడా ర్యాలీలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఎంపిలు శివదాసన్, నటరాజన్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మార్చ్‌లో వేలాది మంది తెలంగాణ కార్మిక, కర్షకులు

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో వేలాది మంది తెలంగాణకు చెందిన కార్మిక, రైతు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, పి జంగారెడ్డి, సహాయ కార్యదర్శులు ఎం. శోభన్, కె. నాగిరెడ్డి, బొంతు రాంబాబు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు జె వెంకటేష్, భూపాల్, ఎస్.రమ, జయలక్ష్మి, సహాయ కార్యదర్శులు ఈశ్వర్ రావు, శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్. వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బొప్పని పద్మ, బి. ప్రసాద్, పొన్నం వెంకటేశ్వరరావు, జగన్, మచ్చ వెంకటేశ్వర్లు, ములకలపల్లి రాములు, నారి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల లూటీకి వ్యతిరేకంగా పోరు

(మొదటిపేజి తరువాయి)

లక్షలకు పైగా రోజు వారీ కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఐక్య పోరాటాలతోనే భూసేకరణ ఆర్డినెన్స్‌ను ఆపగలిగాం. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించగలిగాం. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను హననం చేశారు. దేశాన్ని లూటీ చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద మోడీ ప్రభుత్వాన్ని 2024లో గద్దెదించుతాం.

ట్రిపుల్ ఇంజిన్‌తో మోడీని ఓడిస్తాం

(మొదటిపేజి తరువాయి)

ఇంజిన్, రెండోది అంబానీ, అదానీ ఇంజిన్, మూడోది కార్పొరేట్, మతోన్మాద ఇంజిన్. దేశానికి వినాశకారిగా ఉన్నఈ ఇంజిన్‌ను కార్మికులు, రైతుల, వ్యవసాయ కార్మికులతో కూడిన ట్రిపుల్ ఇంజన్‌తో ఓడిస్తాం. మోడీ ఆటలు ఇక సాగవు. ఉపాధికి హామీ చట్టం అయినప్పుడు బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయించారన్నారు. మోడీ సర్కారు క్రమంగా తగ్గిస్తూ ప్రస్తుత బడ్జెట్‌లో 1.3 శాతానికి తగ్గించింది. ఆహార భద్రత విషయంలో కూడా గతేడాది బడ్జెట్‌లో రూ.2.87 లక్షల కోట్లు కేటాయిస్తే, రూ.1.97లక్షల కోట్లకు తగ్గించారు. దేశంలో 32 కోట్ల మంది ఎస్సీ (17 శాతం), ఎస్టీల (7 శాతం) పరిస్థితులు దారుణం.

స్వేచ్ఛనిస్తే బీజేపీ నేతలంతా జైల్లోనే..



నవతెలంగాణ-హనుమకొండ

దేశంలో ఈడీ, సీబీఐలకు స్వేచ్ఛనిస్తే ప్రధాని మోడీ సహా బీజేపీ నాయకులంతా జైల్లోనే ఉంటారని సీపీఐ పార్లమెంటరీపక్ష నాయకులు బినోయ్ విశ్వం అన్నారు. సీపీఐ 'ప్రజాపోరు యాత్ర' ముగింపు సందర్భంగా హనుమకొండలో బుధవారం బహిరంగ సభ నిర్వహించారు. సభలో బినోయ్ విశ్వం మాట్లాడుతూ.. దేశంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన అదానీ సహా కార్పొరేట్ శక్తులందరికీ మోడీ అండ ఉందన్నారు. మోడీ ప్రధాని అయ్యాకే అదానీ, అంబానీ ఆస్తులు అమాంతం పెరిగాయని, అవినీతిపరులంతా బీజేపీ పాలనలోనే పెరిగిపోయారని చెప్పారు. మోడీ, అదానీ వేర్వేరు కాదు ఒక్కటేనంటూ ఈడీ, సీబీఐకి అదానీని ముట్టుకునే దమ్ము, ధైర్యం ఉందా ? అని ప్రశ్నించారు. అదానీ అంశం తెరపైకి రాకుండా పార్లమెంటులో జేపీసీ వేయకుండా బీజేపీ అడ్డుకున్నదని విమర్శించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ప్రజల సమస్యలు పరిష్కారం కాలేదనీ, పేదలకు కూడు, నీడ కల్పించలేదని అన్నారు. అందుకే ప్రజల పక్షాన, పేదల పక్షాన సీపీఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో బీజేపీ అవినీతి పాలనకు వ్యతిరేకంగా వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఏకం కావాలని, ఏకమైతే బీజేపీని సాగనంపడం ఖాయమన్నారు. మోడీ హటావో, దేశ్‌కి బచావో పేరుతో సీపీఐ జాతీయ స్థాయిలో పోరాడుతున్నదని చెప్పారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న భూ పోరాటాలు చారిత్రాత్మకమని, ఈ పోరాటంలో పేదలు విజయం సాధించడం తథ్యమని అన్నారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. బయ్యారం ఉక్కు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వ విద్యాలయం వస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందేదని అన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్లకు కొమ్ముగాస్తూ పేదలను విస్మరించిందన్నారు. అందుకే బీజేపీ హటావో.. దేశ్‌కి బచావో నినాదం ఎత్తుకున్నామని చెప్పారు.

రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. సీపీఐ ఎల్లప్పుడూ ప్రజల పక్షమేనని, పాలకుల పక్షం కాదన్నారు. పేదలకు ఇండ్లు, స్థలాలు ఇవ్వకుంటే పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పేపర్ లీకేజీలతో బీజేపీ నేతలు విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ మత రాజకీయాలు కరోనా కంటే ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీని తరిమికొట్టడం కోసం గొంగళి పురుగునైనా ముద్దు పెట్టుకుంటామని, ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడే వారితో కలిసి పనిచేస్తామని చెప్పారు. మానవజాతి ఉన్నంత వరకూ కమ్యూనిస్టులు ఉంటారన్నారు.

కుడా మైదానంలో జరిగిన బహిరంగ సభకు సీపీఐ వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు మేకల రవి, కర్రె బిక్షపతి అధ్యక్షత వహించగా జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, పాదయాత్ర కన్వీనర్ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు బి.విజయ సారథి, సీహెచ్.రాజారెడ్డి, కొరిమి రాజ్‌కుమార్, తోట మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, షేక్ బాష్మియా, నాయకులు బి.అజయ్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీఉల్లా ఖాద్రి, మారుపాక అనిల్‌కుమార్, నల్లు సుధాకర్‌రెడ్డి, జంపాల రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భద్రత సాకు మాత్రమే !

(మొదటిపేజి తరువాయి)

కారణాల రీత్యా మీడియావన్ ప్రసారాలను నిషేధించాలన్న కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మీడియా వన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు పై వ్యాఖ్యలు చేసింది. పౌరుల హక్కులను నిరాకరించడానికి జాతీయ భద్రతను ప్రభుత్వం సాకుగా చూపుతోందంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర హోంమంత్రిత్వశాఖను తీవ్రస్థాయిలో మందలించింది. ఇలాంటి స్వల్ప విషయాలకు జాతీయ భద్రతను క్లెయిమ్ చేయలేమని, వాటికి మద్దతుగా పాదార్థిక వాస్తవాలు వుండాలని వ్యాఖ్యానించింది. 'ప్రజాస్వామ్య రిపబ్లిక్ క్రియాశీలంగా పనిచేయడానికి స్వతంత్రంగా పనిచేసే మీడియా చాలా కీలకం. ప్రజాస్వామ్య సమాజంలో దాని పాత్ర చాలా ముఖ్యమైనది. ప్రభుత్వ పనితీరుపై ఇదొక వెలుగునిస్తుంది. వాస్తవాలు మాట్లాడాల్సిన, పౌరులకు కఠోరమైన వాస్తవాలను అందచేయాల్సిన, ప్రజాస్వామ్యాన్ని సరైన దిశలోకి నడిపించే బాధ్యత మీడియాకు వుంటుంది. పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు విధిస్తే పౌరులు కూడా అదే పద్ధతిలో ఆలోచించాల్సి వుంటుంది. సామాజిక ఆర్థిక రాజకీయాల నుండి రాజకీయ సిద్ధాంతాల వరకు అనేక అంశాలపై సజాతీయ వీక్షణ వల్ల ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది' అని కోర్టు పేర్కొంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ భద్రతా అనుమతిని తిరస్కరించడానికి గల కారణాలను వెల్లడించకుండా కేవలం కోర్టుకు సీల్డ్ కవర్‌లో అందచేయడమనేది సహజ న్యాయ సిద్ధాంతాలను, న్యాయపరమైన చర్యలు తీసుకునే హక్కును ఉల్లంఘించిందని కోర్టు పేర్కొంది. చీకటిలో పోరాటానికి సదరు సంస్థను నెట్టిందని పేర్కొంది.

సీల్డ్ కవర్ పద్ధతిపైనా తలంటిన ధర్మాసనం

జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై విచారణ సందర్భంగా సీల్డ్ కవర్ అందచేసే పద్ధతిని కోర్టులు అనుసరించడానికి సమగ్ర మార్గదర్శకాలను విధించింది.

"ప్రజా రక్షణ చర్యల ద్వారా పరిష్కరించలేని ప్రమాదాలను కప్పిపుచ్చడా నికి సీల్డ్ కవర్ పద్ధతిని ప్రవేశపెట్టలేం. జాతీయ భద్రతా ప్రయోజనాలను పరిశీలించేటపుడు సహజ న్యాయ సిద్ధాంతాలను మినహాయించవచ్చు, కానీ, మొత్తంగా విషయాన్ని కప్పిపుచ్చడాన్ని అనుమతించలేం. సహజన్యాయం, బహిరంగ న్యాయ సిద్ధాంతాలను సీల్డ్ కవర్ పద్ధతు ఉల్లంఘిస్తుంది." అని కోర్టు పేర్కొంది. పౌరసత్వ సవరణ చట్టం, 2019, జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి)పై చానెల్ ఇచ్చిన కథనాన్ని, న్యాయ వ్యవస్థను, ప్రభుత్వాన్ని విమర్శించడాన్ని ప్రాతిపదికగా చేసుకుని చానెల్‌ను ప్రభుత్వ వ్యతిరేకిగా ముద్ర వేయడాన్ని ఏ మాత్రమూ సమర్థించలేమని బెంచ్ రూలింగ్ ఇచ్చింది. అన్ని ఇంటెలిజెన్స్ నివేదికలను రహస్యంగా పేర్కొలేమని, ఎందుకంటే ఇవి పౌరుల హక్కులు, స్వేచ్ఛను ప్రభావితం చేస్తాయని బెంచ్ పేర్కొంది.

ప్రజలపై దాడి తీవ్రం

(మొదటిపేజి తరువాయి)

నిర్ణయించిందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలతో ఈ అధిక దాడిని సంస్థాగతీకరించడానికి ప్రయత్నించిందని చెప్పారు. అయితే, రైతుల వీరోచిత ప్రతిఘటనతో మోడీసర్కారు కాస్త వెనక్కి తగ్గిందనీ, కానీ, అది తన ఉద్దేశాన్ని వదులుకోలేదని విమర్శించారు.

వ్యవసాయ కార్మికులు ఉపాధికి దూరమవుతున్న తీరును వివరించారు. మోడీ విధానాలతో నష్టపోయేది కేవలం ఆ వర్గాలే కాదనీ, దేశం మొత్తం అగాధంలోకి నెట్టబడుతున్నదని విమర్శించారు. ఆహార ధాన్యాల సాగు నుంచి రైతులను దూరం చేస్తున్నారనీ, ఇది ఆహార భద్రతను దెబ్బతీస్తుందని అన్నారు. సంపద అసమానతల్లో తీవ్ర పెరుగుదల ఉందనీ, అసమానతలు అరికట్టాల్సిన మోడీ సర్కారు దాన్ని విస్మరించిందని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ ధనికులకు పన్ను రాయితీలు ఇస్తున్న తీరును ఎండగట్టారు. "క్రోనీ క్యాపిటలిజం (ఆశ్రిత పెట్టుబడి)" బహిరంగంగా, విచ్చలవిడిగా నాట్యం చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారందరినీ భయభ్రాంతులకు గురిచేయడం, ప్రతిపక్ష రాజకీయ పార్టీలను అంతమొందించడానికి ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

మైనారిటీ వర్గాలకు వ్యతిరేకంగా విషపూరితమైన ద్వేషాన్ని పెంచుతున్నారని పేర్కొన్నారు. శ్రామిక ప్రజలపై దాడికి వ్యతిరేకంగా పోరాడటానికి, ప్రజాస్వామ్యాన్ని, ప్రతిఘటించే హక్కును రక్షించడానికి, దేశాన్ని లౌకిక గణతంత్ర రాజ్యంగా పరిరక్షించడానికి, ఆధునిక భారతదేశం నిర్మించిన రాజ్యాంగాన్ని కాపాడటానికే కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు వచ్చారన్నారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలను ప్రకటించారు.

భానుడి భగభగ..

(మొదటిపేజి తరువాయి)

మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల(30 నుంచి 40 కిలోమీటర్ల వేగం)తో కూడిన వడగండ్ల వాన కూడా పడే అవకాశం ఉందని హెచ్చరించింది. వర్షానికి సంబంధించి ఆరెంజ్ హెచ్చరిక జాబితాలో కొమ్రంభీమ్ అసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్‌భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలున్నాయి. రాబోయే 48 గంటల్లో హైదరాబాద్ పరిధిలో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే సూచనలున్నాయి. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆలపల్లిలో అత్యధికంగా 3.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తిలో 2.1 సెంటీమీటర్ల వాన పడింది.

ట్రంప్‌నకు 136 ఏండ్ల జైలుశిక్ష !

(మొదటిపేజి తరువాయి)

దోషిగా తేలినా.. అంత శిక్ష వేయకపోవచ్చు అన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు లక్షా 30 వేల డాలర్లు చెల్లించిన అంశంలో.. ఆ నేరాన్ని కప్పిపుచ్చేందుకు ట్రంప్ తన బిజినెస్ రికార్డులను మార్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిలో భాగంగానే ఎన్నికల చట్టాలను కూడా మార్చే ఆలోచన చేసినట్టు డేనియల్స్ తరఫు న్యాయవాది ఆరోపించారు. ఆ హష్‌మనీ వివరాల్ని దాచిపెట్టేందుకు ట్రంప్ 34 తప్పుడు ఎంట్రీలు చేశారని ఆరోపణలు వస్తున్నాయి.



ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-పరిగి

మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో బాబూ జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, నార్మల్ డైరెక్టర్ ఫిరంగి వెంకట్రాంరెడ్డి, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచ్ సాబేర్, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

సర్పంచ్ సావిత్రమ్మ సాయిలు

నవతెలంగాణ-కొడంగల్

పీడిత, దీన జనుల కోసం శ్రమించిన సంస్కరణల యోధుడు జగ్జీవన్ రామ్ అని, ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్పంచ్ సావిత్రమ్మ సాయిలు అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా కోడంగల్ మండలం చిన్న నందిగామ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, బిఆర్ఎస్ నాయకులు మల్లేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రాం జయంతి



నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

బంట్వారం మండలంతో పాటు మండల కేంద్రంలో బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ అవరణలో సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూల మాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్వతంత్ర సమ రయోధుడు, సంఘసం స్కర్త బడుగు బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రాం అని కొని యాడారు. కార్యక్రమంలో వికారాబాద్ నియోకవర్గ కురుమ సంఘం అధ్యక్షు లు అలంపల్లి శ్రీనివాస్, సెక్రటరీగోపాల్, లైబ్రేరియన్ యాదగిరి, వెటర్నరీ రా జు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి



- సర్పంచ్ వెంకటేష్ యాదవ్

నవతెలంగాణ-కోట్‌పల్లి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బాబూ జగ్జీవన్ రాంజయంతి ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని బార్వాద్‌లో సర్పంచ్ వెంకటేశ్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో బాబు జగ్గీవన్ రాం జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మా లలు వేసి ఘనంగా వేడుకలను జరుపుకున్నారు. స్వతంత్ర సమరయోధుడు, మాజీ ఉప ప్రధానిగా సేవలందించిన ఆయన ఆశయాలను గుర్తుచేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కరోబర్ నాగేష్ యాదవ్, నాయకులు గ్రామస్తులు ఎల్లారెడ్డి, నర్సింలు, విఠల్, తదితరులున్నారు.

చర్చి నిర్మాణానికి తనవంతుగా ఆర్థికసాయం



- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుందరి అనీల్

నవతెలంగాణ-కోట్‌పల్లి

చర్చి నిర్మాణానికి తన వంతుగా ఆర్థికసాయం అందజేశామని కోట్‌పల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరీంపూర్ సర్పంచ్ సుందరి అనిల్ తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో నిర్మిస్తున్న నూతన చర్చి నిర్మాణానికి తన వంతుసాయంగా రూ.52 వేలు అందించారు. గ్రామానికి చర్చి నిర్మాణానికి పెద్ద మనసుతో ముందుకు వచ్చి ఇంత పెద్ద ఆర్థికసాయం చేసినందుకు గ్రామం తరఫున వారికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడ్డలి మల్లయ్య, ఎంపీటీసీ అంబిక రాజు, నాయకులు శ్రీనివాస్, ఉపసర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సంగమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్





- వ్యకాసం. జిల్లా అధ్యక్షులు యు.బుగ్గప్ప
- మాజీ జడ్పీటీసీ సభ్యులు సిద్రాల శ్రీనివాస్,
- దేవనూరు సర్పంచ్ ఆకుల శివకుమార్

నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

సమానత్వం కోసం అంకితమై పని చేసిన గొప్ప సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ అని తెలంగాణ వ్యకాసజిల్లా అధ్యక్షులు యు బుగ్గప్ప అన్నారు. బుధవారం యాలాల మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం, స్థానిక సర్పంచ్ సిద్రాల సులోచన శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర, జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వేరువేరుగా జయంతిని ఘనంగా నిర్వహించారు. దేవనూరులో సర్పంచ్ ఆకుల శివకుమార్, తాండూరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఆశన్న మెట్లీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు సిద్రాల శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సులోచన, దేవనూరు సర్పంచ్ ఆకుల శివకుమార్, తాండూర్ ఏఎంసీ మాజీ డైరెక్టర్ మెట్లీ ఆశన్న, గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.



దోమ మండల పరిధిలోని బొంపల్లీ గ్రామంలో చిన్న నర్సింలు కుమార్తె మనీషా మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే, జిల్లా డీసీసీ అధ్యక్షులు టి.రామ్మోహన్ రెడ్డి, బాధితకుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

అందరినీ కలుపుకుని పోయే పార్టీ బీఆర్ఎస్

- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- బీఆర్ఎస్ కండువా కప్పుకున్నందుకు కార్యకర్తలు గర్వించాలి
- ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి
- సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం
- డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి





నవతెలంగాణ-పరిగి

అందరినీ కలుపుకొని పోయే పార్టీ బీఆర్ఎస్ అని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం పరిగి పట్టణ కేంద్రంలోని శారద గార్డెన్ లో పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, పరిగి పట్టణ అధ్యక్షుడు మంగుసంతు ఆధ్వర్యంలో పరిగి పురపాలక సంఘం బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నుండి రావలసిన పనులను తీసుకురా వడంలో ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. 9 ఏండ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి భవిష్యత్తులో చేయు పనుల గురించి కార్యకర్తలతో, నాయకులతో కలిసి చర్చించుకునేందుకు సీఎం కేసీఆర్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని తీసుకొచ్చారని తెలిపారు. రైతులకు పెద్దపీట వేసి రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, సమయానికి విత్తనాలు అందిస్తూ వ్యవసాయరంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పరిగిని అభివృ ద్ధి చేస్తే, ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆ అభివృద్ధికి మెరుగులు దిద్దుతున్నారన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి పరీక్ష పత్రాలను ఫోటోలు తీసి వాట్సాప్‌లో పెట్టి, సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని కుట్ర చేస్తున్నారని విమర్శించారు. చిల్లర రాజకీయాలు మానుకో వాలని హెచ్చరించారు. కార్యకర్తలు ఇంటింటికి తిరి గి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలపాలని సూచించారు. పరిగి నియోజకవర్గంలో మహేష్ రెడ్డిని మరొకసారి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ పార్టీగా మొదలై రాజకీయ పార్టీగా ఏర్పడి దేశంలో అత్యధిక సభ్యత్వాలున్న పార్టీగా బీఆర్ఎస్ ఎదిగిందంటే అది కేవలం మీరంత కృషి చేయడం వల్లేనని అన్నారు. డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనో హర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ 9 ఏండ్లలో చేసిన అభివృద్ధి గురించి చర్చించినందుకే ఈ ఆత్మీయ సమ్మేళ నమన్నారు. కార్యకర్తలే బీఆర్ ఎస్‌కు బలమన్నారు. సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకుపోవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కళ్ళు ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ అరవింద్ రావు, జడ్పీటీసీ హరిప్రియ ప్రవీణ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ శ్యాం సుందర్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్, పరిగి పట్టణ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి కౌన్సిలర్లు అర్చన రవికుమార్, మౌలానా, వేముల కిరణ్, ఎదురే కృష్ణ, నాగేశ్వర్, వెంకటేష్, తాహెర్ అలీ, రవీంద్ర, మునీర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు అన్వర్ సెట్, శేఖర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్ళు శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు మీర్ మహిముద్ అలి, మాజీ పట్టణ అధ్యక్షుడు గౌస్ బాషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



సెయింట్ థెరీసాస్ ఆస్పత్రిలో అండాశయ క్యాన్సర్ విజయవంతం





నవతెలంగాణ-శంషాబాద్

తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన మహిళకు విజయవంతంగా ఆపరేషన్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడారు. ఈ సంఘటన శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ థెరిసాస్ ఆస్పత్రిలో బుధవారం జరిగింది. ఆపరేషన్ బృందానికి నాయకత్వం వహించిన గైనకాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్ శారద తెలిపిన వివరాల ప్రకారం..ఒక మహిళ (23) మూడేండ్లుగా నెలసరి ఆగిపోయి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నది. ఆమె కడుపు నొప్పి భరించలేక శంషాబాద లోని సెయింట్ థెరిస్సాస్ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. వెంటనే ఆమెను ఆస్పత్రిలో చేర్చుకుని కడుపు నొప్పికి సంబంధించిన అన్ని రకాల పరీక్షలు చేశారు. పరీక్షల్లో ఆమెకు షుగర్‌తో పాటు గర్భాశయ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. షుగర్‌కు మందులు ఇచ్చి సాధారణ స్థాయికి తీసుకువచ్చారు. అనంతరం డాక్టర్ ఎం.ఎస్ శారద నేతృత్వంలో వైద్య బృందంతో కలిసి ఆమె గర్భాశయ క్యాన్సర్ కణితిని శస్త్ర చికిత్స చేసి తొలగించారు. విజయవంతంగా ఆపరేషన్ చేసి మహిళా ప్రాణాలు కాపాడినందుకు డాక్టర్లు, పేషెంట్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్న ఆమెకు ఆపరేషన్ విజయవంతం కావడం మంచి పరిణామం యాజమాన్యం తెలిపింది. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ బి.యశ్వంత్ (జనరల్ సర్జన్) డాక్టర్ ఆర్.శ్రీకాంత్ (అనేస్తీషియా) తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్, శ్రీశైలం



నవతెలంగాణ-పరిగి

విద్యాశాఖలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యనాయక్, శ్రీశైలం అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బుధవారం పరిగి పట్టణ కేంద్రంలో పరిగి మున్సిపల్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డికిని, ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని కలిసి సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో భాగమైన తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా పే స్కేలు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్యాశాఖకు అనుబంధంగా ఉన్న సమగ్ర శిక్షా యందు 21 వేల మంది ఉద్యోగులు కాంట్రాక్టు ప్రాతిపదికన 15 ఏండ్లుగా విధులను నిర్వహిస్తున్నారని, వారి సేవలను వెంటనే క్రమబద్ధీకరణ చేయాలన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కోసం రూ.10 లక్షలు, ప్రతి ఉద్యోగికీ జీవిత బీమా రూ.20 లక్షలను చెల్లించాలన్నారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, విషయం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం సభ్యులు కేజీబీవీ ఎస్ఓ దేవి, కృష్ణయ్య,విద్యాసాగర్, రాఘవేందర్, మోహన్, నజీర్, సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబూ జగ్జీవన్ '





నవతెలంగాణ-మర్పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీలు,యువజన సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బాబు జగ్జీవన్ రామ్ 116 జయంతి వేడుకలను ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి అధికారికంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోట్‌మర్పల్లి సర్పంచ్ విజయలక్ష్మి రాచయ్య, పట్లూర్ సర్పంచ్ ఇందిరా అశోక్, ఎస్సై అరుణ్‌కుమార్ గౌడ్, ఎంపీపీ బట్టు లలిత రమేష్, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌గుప్త, మార్కెట్ వైస్ చైర్మన్ రమేశ్వర్, మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమోదీన్, పెద్దాపూర్ మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, డైరెక్టర్ యాదయ్య, మర్పల్లి, పట్లూర్ యువజన సంఘాల అధ్యక్షులు సురేష్, శ్రీనివాస్, బిజెఆర్ యువజన సంఘాలు, ఆయా గ్రామాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ.. కుల రహిత సమాజానికి పాటుపడిన బడుగు, బలహీన వర్గాల నేత ప్రముఖ స్వతంత్ర సమర యోధుడు దేశ తొలి ఉప ప్రధానిగా సమసమాజ స్థాపనకు ఎంతో కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఇలాంటి మహనీయులను నేటి యువత ఆదర్శవంతంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

తాండూరులో ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





నవతెలంగాణ-తాండూరు

తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సంద ర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమల్ మాట్లాడుతూ.. సమసమాజ స్థాపన కోసం అలుపెరగని పోరాటం చేసిన సంఘ సంస్కర్త జగ్జీవన్ రామ్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ సమాజాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా రన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బొబ్బిలి శోభారాణి, కౌన్సిలర్స్ బోయ రవిరాజు, ప్రభాకర్‌గౌడ్, విజయలక్ష్మి పండిత్, అలాగే మున్సి పల్ అధికారులు, స్టాఫ్, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో బంజారా భవన్‌కు నిధులు

- ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి గిరిజన నాయకుల సన్మానం



నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

పెద్దేముల్ మండలంలో ఎమ్మెల్యే చొరవతో గిరిజన బంజారా భవనానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేసినట్టు పెద్దేముల్ మండల ఎంపీటీసీల ఫోరం సంఘం అధ్యక్షులు ధన్‌సింగ్ తెలిపారు. బుధవారం తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయంలో ఎంపీటీసీల ఫోరం సంఘ అధ్యక్షులు ధన్ సింగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డిని సర్పంచులు భరత్, పాండు, టోప్యా, గోవర్ధన్, జయరాం, రవి, ఎస్టీసెల్ అధ్యక్షులు విజయ్, సీనియర్ నాయకులు సురేష్, నరేష్ తదితరులు సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గిరిజన బంజారా భవనానికి ఎమ్మెల్యే సహకారంతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడం అభినందనీయమని కొనియాడారు. గిరిజనులు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో నేతలు, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్‌ల కుట్రనే పేపర్ లీకేజీ



- విద్యార్థుల జీవితాలతో ప్రతిపక్షాలు రాజకీయాలు చేయొద్దు
- ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కొడంగల్

బీజేపీ, కాంగ్రెస్‌లు కేసీఆర్‌ను ఎదుర్కోలేకనే తమ అనుచరులతో పేపర్ లీకేజీలకు పాల్పడుతుందని ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. కొడంగల్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ ఘటనను చూస్తే ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌ల అధ్యక్షుల కనుసన్నల్లోనే పేపర్ లీకేజీ జరుగుతుందన్నారు. రాజకీయంగా కేసీఆర్‌ను ఎదుర్కోలేక అప్రతిష్టపాలు చేయాలని ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పేపర్ లీకేజీ లాంటి దారుణమైన పనికి ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు పాల్పడుతు న్నాయన్నారు. వరంగల్ పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తి ప్రశాంత్ బీజేపీ కార్యకర్త అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఉద్యోగులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని, కాంగ్రెస్, రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిల ఉనికి కాపాడేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. వరంగల్‌లో జరిగిన ఘటనతో కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ ఉనికి కాపాడుకునేందుకు కావాలని చేస్తున్నాయని తెలంగాణ ప్రజలకు తేటతెల్లమైందన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డిలు విద్యార్థుల జీవితాలతో రాజకీయం చేస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ధైర్యంగా ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక ప్రతిపక్ష పార్టీల నాయకుల అనుచరులతో ఇలాంటి వాటికి పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బీజేపీలను వచ్చే ఎన్నికలలో బొంద పెట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, బోంరాస్ పేట్ పిఏసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షులు గోడల రామ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పకీరప్ప, పిఏసిఎస్ చైర్మన్ కటకం శివకుమార్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ బాబు, నరేష్, కవిత, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవలను పరిశీలించిన ఎమ్మెల్యే







నవతెలంగాణ-కొడంగల్

కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో కిడ్నీ రోగులకు అందుతున్న డయాలసిస్ సేవలను బుధవారం ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. డయాలసిస్ రోగులకు కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేయడంతో ఉపశమనం కలిగిందన్నారు. డయాలసిస్ రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడ ఏర్పాటు చేయడంతో రోగులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కోట్ల మహిపాల్, కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు గోడాల రామిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బాల్ రాజ్, నరేష్, మాజీ సర్పంచ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తీరుపై మండిపడ్డ మంత్రి సబితా ఇంద్రారెడ్డి




నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

పదో తరగతి విద్యార్థుల విషయంలో బీజేపీని తీరుపై విద్యాశాఖ మంత్రి సబిత రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. జగ్జీవన్ రామ్ ఏంటి సందర్భంగా వికారం పట్టణంలో ఉన్న జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు. విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటమాడుతోందని అన్నారు. అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్న తెలంగాణపై విషం కక్కుతూ ఇలాంటి ఘటనలుకు పాల్పడితే రాష్ట్ర ప్రజలు ఊరుకోరని తెలిపారు. ప్రశ్న పత్రాల కేసులో అడ్డంగా దొరికిపోయి మళ్ళీ బీజేపీ వాళ్లను రోడ్లెక్కి ఆందోళనలు చేస్తారా అని ప్రశ్నించారు. బీజేపీ అగ్రనాయకత్వం సూత్రధారులుగా జరుగుతున్న ఈ కుట్రలో బండి సంజయ్ పాత్ర దారుడిగా వ్యవహరిస్తున్నాడన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్, టెన్త్ పేపర్ల లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని మండిపడ్డారు. లక్షల మంది పిల్లలు భవిష్యత్తు,వారి తల్లి తండ్రులు ఎంత బాధ పడతారు అని కనీస బాధ్యత లేకుండా బండి సంజయ్ ప్రవర్తించాడన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకునే వారిని వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. ముగ్గుర్ని ప్రభుత్వ ఉద్యోగులను సర్వీస్ నుండి తొలగించి చర్యలు తీసుకున్నాం. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి ఘటనలకు పాల్పడ్డ కఠిన చర్యలు ఉంటాయి. చట్టం ఎవరికైనా ఒక్కటే బండి సంజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవామని ఆమె డిమాండ్ చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-పరిగి

పరిగి పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో బుధవారం 1.75 కోట్లతో 22 షాప్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డితో కలిసి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ మంత్రి సబిత ఇంద్రారెడ్డికి, ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డికి నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, ఎంపీపీ అరవిందరావు, జడ్పీటీసీ హరిప్రియ ప్రవీణ్ రెడ్డి, పిఏసిఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్ఎస్ పరిగి మండలాధ్యక్షుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభించిన చైర్ పర్సన్



నవతెలంగాణ-తుర్కయాంజల్

తుర్కయాంజల్ మున్సిపాలిటీ కూడలిలో తుర్కయాంజల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బుధవారం తుర్క యాంజల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధ రాంరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కుంట ఉదయ శ్రీగోపాల్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్, జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు బచ్చిగళ్ళ రమేష్, బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షులు వద్దిగళ్ళ బాబు, నాయకులు భాస్కర్ రావు, గుడ్ల అర్జున్, మేతరి కుమార్, ఎరుకలి రవి, శ్యామ్, రాజు, గుండ నర్సింహ, మధునూరి కుమార్, వస్పరి రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

- కొత్తూరులో చలివేంద్రం ప్రారంభించిన చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్



నవతెలంగాణ-కొత్తూరు

యువత సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని ఎస్బిఐ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్ సామల హేమ సహకారంతో స్థానిక యువకుడు బండ్ల శివ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివెంద్రంఏర్పాటుకు కృషి చేసిన శివను నేతలు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, కరోల్ల లక్ష్మయ్య, జోగు బాలరాజు, జంగా గళ్ళ శివకుమార్, శంకర్, ఆంజనేయులు గౌడ్, ప్రవీణ్, అనిల్, లక్ష్మణ్, శివరాజ్ పాల్గొన్నారు.

నీటి సంపులో పడి వృద్ధుడు మృతి



నవతెలంగాణ-కొత్తూరు

నీటి సంపులో పడి వృద్ధుడు మృతి చెందాడు.ఈ ఘటన మంగళవారం రాత్రి కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని సీఎంటీఎల్ సమీపంలో లేబర్ క్వార్టర్స్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన దాన గళ్ళ పోచయ్య వయసు (62) మంగళవారం రాత్రి సీఎంటీఎల్ కంపెనీ సమీపంలోని లేబర్ క్వార్టర్స్ దగ్గర రాత్రి భోజనం చేసుకుని చెయ్యి కడుక్కోవడానికి నీటి సంపు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం సంపులో మృత దేహాన్ని గమనించిన కార్మికులు స్థానికులకు, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని కూతురు పబ్బే ప్రేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు కందుకూరుకు విద్యాశాఖ మంత్రి రాక

నవతెలంగాణ-కందుకూరు

నేడు కందుకూరు మండలానికి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరవుతున్నట్టు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు గురువారం ఉదయం 9 గంటలకు మండల పరిధిలోని బేగంపేట్ గ్రామం నుంచి, మాదాపూర్ గ్రామం వరకు జరిగే రోడ్డు నిర్మాణం పనుల శంకుస్థాపన నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 10గంటలకు మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలో ఫార్మా ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు ఇండ్ల పట్టాలు, స్థలాల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గోపులారంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

గోపులారం గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల సందర్భంగా బుధవారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్, ఆలిండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తొండ యాదయ్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బయనంద్, మండల ఎస్సీ, సెల్ అధ్యక్షులు సామయ్య, వార్డు సభ్యులు సురేందర్ శివలీల, శ్రీను శారద, రాంచెందర్, అంబేద్కర్ సంఘంఉపాధ్యక్షులు మాణయ్య, కార్యదర్శి నారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్, యువకులు విష్ణు, సాయి, శ్రీ కాంత్, రాజు, కాంత్, శంకరయ్య సురేష్, రామయ్య ,సద్గున, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య



నవతెలంగాణ-శంకర్‌పల్లి

కుటుంబ కలహాలతో యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి మండలంలోని మహాలింగాపురం గ్రామంలో బుధవారం జరిగింది. వికారాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శంకర్పల్లి మండలంలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన చాకలి రమేష్ (28) కుటుంబ కలహాలతో శంకర్పల్లి మున్సిపల్ పరిధిలోని ప్రతేపురం రైల్వే ట్రాక్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేయడం దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బండి సంజయ్ అరెస్టుపై నిరసన



నవతెలంగాణ-శంకర్‌పల్లి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడం తీవ్ర తీవ్రంగా ఖండిస్తున్నామని శంకర్పల్లి బీజేపీ మండల అధ్యక్షులు రాములు గౌడ్, నాయకులు అన్నారు. బుధవారం శంకర్‌పల్లి చౌరస్తా సమీపంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం బిజెపి నాయకులను శంకర్పల్లి పోలీస్ స్టేషన్‌కు పోలీసులు తీసుకెళ్లారు. తదనంతరం వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రతాప్‌రెడ్డి, బి. సురేష్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్ సింగ్, సింగపురం రమేష్, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, బి నర్సింహారెడ్డి, రామ్‌రెడ్డి, హరినాథ్, సంజీవరెడ్డి, ధరమ్ సింగ్, మహేందర్, కేశవ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ల ముఠా అరెస్ట్

- మాదాపూర్ డీసీపీ శిల్పావళి



నవతెలంగాణ-మియాపూర్

నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లను తయారు చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మాదాపూర్ డీసీపీ ఆఫీసులో డీసీపీ శిల్పవల్లి విలేకర్లతో మాట్లాడుతూ నిందితుల నుంచి వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలకు చెందిన నకిలీ జనరల్ ఇన్సూరెన్స్ సర్టిఫికేట్లు, కంప్యూటర్ మానిటర్లు, హార్డ్ డిస్కులు, ప్రింటర్, నాలుగు మొబైల్ ఫోన్‌లతో పాటు, రూ. 79 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నగరంలో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీ లకు చెందిన నకిలీ జనరల్ ఇన్సూరెన్స్ లు తయారు చేసి విక్రయిస్తున్న ముఠాలో మొహమ్మద్ సర్వర్‌తో పాటు మొత్తం నలుగురు కలిసి, ఒక ముఠాగా ఏర్పడి ఈ నకిలీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఆ నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ పేట్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తున్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 7.25 లక్షల విలువ చేసే, మెటీరియల్ సీజ్ చేసినట్టు తెలిపారు. ప్రజల ఇన్సూరెన్స్ తీసుకునేటప్పుడు ఒకటికి రెండుసార్లు పాలసీ వివరాలు కంపెనీ వివరాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని డీసీపీ తెలిపారు.ఇలాంటి ఘటనలకు సంబంధించిన వివరాలను ప్రజల దృష్టికి వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని డీసీపీ సూచించారు.

ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ కడ్తాల్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం స్వాతంత్ర్య సమర యోధులు మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రములో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ పాల్గొని స్థానిక నాయకులతో కలిసి బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కంబాలపల్లి పరమేష్, యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ఎర్రోళ్ల రాఘవేందర్, స్థానిక నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆమనగల్ పట్టణంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షులు నేనావత్ పత్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ కిన్నెర మొగులయ్య, చుక్క నిరంజన్ గౌడ్, సయ్యద్ ఖలీల్, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ నాయక్, గుత్తి బాలస్వామి, భీమయ్య, వస్పుల సాయిలు, వడ్డె వెంకటేష్, శివకుమార్, అల్లాజీ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

- రూ.2 వేల నగదు, రెండు మాసాల అమ్మవారి పుస్తెలతాడు అపహరణ







నవతెలంగాణ-శంకర్‌పల్లి

గుర్తుతెలి తెలియని దొంగలు ఆలయం తాళాలు విరగొట్టి , రూ. 2వేల నగదు, రెండు మాసాల అమ్మవారి పుస్తెలతాడు గుర్తు తెలియని దుండగలు అపహరించారు. ఈ ఘటన శంకర్‌పల్లి మండలంలోని పరివేద గ్రామంలోని శ్రీరామాలయంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఆలయ కమిటీ చైర్మన్ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి మండలంలోని పరివేద గ్రామంలో శ్రీ రామాలయంలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు, గుడి తాళాలు విరగొట్టి లోపలికి ప్రవేశించి హుండీలో రూ. 2000 నగదు, అమ్మవారి రెండు మాసాల పుస్తెలతాడును అపహరించారు. బుధవారం ఉదయం పూజారి పూజ కోసం గుళ్లోకి వెళ్ళగా ఈ విషయం బయటపడింది. ఆయన వెంటనే ఆలయ కమిటీ చైర్మన్‌కు తెలిపాడు. చైర్మన్ సుదర్శన్ శంకర్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కడ్తాల్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం





- ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ ,జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి

నవతెలంగాణ-ఆమనగల్

కడ్తాల్ మండలంలోని ముద్విన్ గ్రామంలో బుధవారం జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముద్విన్ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా సీసీ రోడ్లను, అంగన్‌వాడీ కేంద్రాన్ని, రైతు వేదిక భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కంబాలపల్లి పరమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితా హరినాథ్ రెడ్డి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ గ్రామీణాభివృద్ధి శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యు లు, కడ్తాల్ మండల జడ్పీటీసీ సభ్యులు జర్పుల దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచ్లు యాదయ్య, భారతమ్మ నర్సింహ, గూడూరు లక్ష్మీ నరసింహ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లచ్చిరామ్ నాయక్, రైతు సమన్వయ జిల్లా కమిటీ సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు జోగు వీరయ్య, జంగయ్య, ఉపసర్పంచ్ వినోద్, నాయకులు గంప శ్రీనివాస్ గుప్తా, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడలో పయనించాలి

- మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



నవతెలంగాణ-కందుకూరు

స్వతంత్ర సమరయోధులు, సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్ అడుగుజాడలో ప్రతి ఒక్కరూ పయనించాలని మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలంలో బాబు జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, సరికొండ మల్లేష్, సరికొండ జగన్, వీర్లపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ఈర్లపల్లి శ్రీకాంత్ రెడ్డి, నరసింహచారీ, వినోద్ చారి, పాండురంగారెడ్డి, అఫ్జల్, భూపాల్ రెడ్డి, బాబు, ఢిల్లీ శ్రీధర్, కృష్ణ, జగదీష్, లక్ష్మయ్య, రజనీకాంత్, సురేందర్, అజిత్, ఐలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా రంజాన్ వేడుకలు చేద్దాం

- మైనార్టీ మండలాధ్యక్షులు ఎండీ బషీర్



నవతెలంగాణ-గండిపేట్

కులమతాలకతీతంగా రంజాన్ వేడుకలను నిర్వహించుకుందామని బీఆర్ఎస్ మైనార్టీ గండిపేట్ మండలాధ్యక్షులు ఎండీ బషీర్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపలిటీల్లో రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకున్ని పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ, పవిత్ర మాసంగా ఉపవాస దీక్షలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్‌లీడర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు శ్రీరాంలు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌ను వెంటనే మూసివేయాలి

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి



నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా సమీపంలో ఏర్పాటు చేసిన మైనింగ్‌ను వెంటనే మూసివేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి డిమాండ్ చేశారు. మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, కల్వకుర్తి నియోజకవర్గం కన్వీనర్ గోరటి నర్సింహ, మున్సిపల్ చైర్మెన్ నేనావత్ రాంపాల్ నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ రవి రాథోడ్ తదితరులతో కలిసి బుధవారం తల్లోజు ఆచారి మైనింగ్ ప్రదేశాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్థానిక గిరిజన రైతులతో మాట్లాడారు. వ్యవసాయ పంట పొలాలను, బోరు బావులను, నివాస గృహాలను నాశనం చేస్తున్న అక్రమ మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని అన్నారు. అంతకు ముందు ఆయన కడ్తాల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయం ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.



అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్





- మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్
- కొత్తూరులో బాబూ జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి..

నవతెలంగాణ-కొత్తూరు

బాబు జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొత్తూరు ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. బుధవారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం, పురపాలక కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ నేతలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శరత్ చంద్రబాబు వైస్ చైర్మన్ డోలి రవీందర్, నాయకులు బాతుక దేవేందర్ యాదవ్ బ్యాగరి యాదయ్య, జంగ గళ్ళ శివకుమార్, జోగు బాలరాజు, కర్రోళ్ల లక్ష్మయ్య, సాయి యాదవ్, నరసింహ, శంకర్, అనిల్, శివ, ఆంజనేయులు గౌడ్, శివరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కావలి రాములుకు అంబేద్కర్ నేషనల్ అవార్డు



నవతెలంగాణ-ఆమనగల్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాతీయ నేషనల్ అవార్డును ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ కావలి రాములు అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ (బిఎస్ఎ) వారు 2023 సంవత్సరానికి గాను రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన కావలి రాములు అంబేద్కర్ ఐడియాలజీని ముందుకు తీసుకుపోయేందుకు చేసిన వివిధ కార్యక్రమాల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు 2023 సంవత్సరమునకు గాను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంఘం నాయకులు ప్రముఖ జర్నలిస్ట్ కావలి రాములు జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఈక్రమంలో ఇటీవల హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ ఐదోవ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో కావలి రాములు తన కుటుంబ సభ్యులతో కలిసి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎం గౌతమ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాదేవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం



నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

బీఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పార్టీ మండల ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల పింఛన్లు, నిరంతర విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, తాగునీరు ,సాగునీరు వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి , అమలు చేస్తుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా నిలుస్తుంటే, ఓరువలేని ప్రతిపక్ష పార్టీలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. మండలంలో ఆరు గిరిజన తండాలకు బీటీ రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. అదేవిధంగా వచ్చే జూన్ నాటికి కే ఎల్ఐ డి-82 కాల్వ ద్వారా సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. తెలంగాణ అసెంబ్లీకి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు పెట్టినట్టుగా ప్రధాని మోడీకి దమ్ముంటే పార్లమెంటుకు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి జైపాల్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్ గౌడ్, సర్పంచ్ల సంఘం మండలాధ్యక్షుడు అంబల్ల జంగయ్య గౌడ్, పార్వతమ్మ, రైతు సమన్వయ సమితి జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, లాలయ్య గౌడ్, జైపాల్ నాయక్, నిరంజన్ జి, ఎంపీటీసీ గ్యార వెంకటయ్య, సురమల్ల సుభాష్, ఆదిమల్ల శ్రీను, బ్రహ్మం, సురమల సత్తయ్య, ఉడుతల చలమంద గౌడ్, కొప్పుల వెంకటయ్య, రాములు, మల్లేష్, మహేష్, చంద్రయ్య ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఉన్నతి కోసం ఉద్యమించిన జగ్జీవన్‌రామ్

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు కావలి చంద్రశేఖర్



నవతెలంగాణ-షాబాద్

స్వాతంత్రం ఉద్యమకాలం నుంచి సామాజిక రాజకీయ చైతన్యం కోసం బడుగు, బలహీన వర్గాల ఉన్నతి కోసం ఉద్యమించిన బాబు జగ్జీవన్ రామ్ నవయుగ వైతాళీకుడని, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కావలి చం ద్రశేఖర్ అన్నారు. బుధవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు షాబాద్‌లో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు తమ్మలి రవీందర్, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు వెంకట్‌రెడ్డి, జంగయ్య, శేఖర్, శ్రీనివాస్, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీకాంత్, మల్లయ్యగౌడ్, కృష్ణ, చంద్రయ్య, కిష్టయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచిరేవులల్లో చలివేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-గండిపేట్

వేసవిల్లో ప్రజల దహం తీర్చడానికి చలి వేంద్రాలను ప్రారంభిస్తున్న నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మేకల ప్రవీణ్‌యాదవ్, దేవాల చైర్మెన్ పొన్న రమేష్ అన్నారు. బుధవారం నార్సింగి మున్సిపాల్టీలోని మంచిరేవుల బస్సు స్టాప్ సమీపంలో, గోల్డెన్ ఫీష్ చౌరస్తా సమీపంలో చలివేంద్రాలను పొన్న రమేష్ సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎండ నుంచి వచ్చిన ప్రజలకు చల్లని తాగునీటి అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు దహం తీర్చాలనే ఉద్దేశంతోనే ఈ చలి వేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంల్లో డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, గోవింద్‌గారి, కాంతికుమార్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-మంచాల

మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలు సందర్భంగా బుధవారం టీపీసీసీ సభ్యులు మర్రి నిరంజన్‌రెడ్డి, జడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంపీటీసీ ఎడమ నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట రాజీ రెడ్డి, నాయకులు కంద కట్ల జైపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ వేషధారణలో అలరించిన సాయినిహస్

నవతెలంగాణ-ఆమనగల్

ఆమనగల్ పట్టణానికి చెందిన ప్రముఖ ఉపాధ్యాయులు విడియాల ప్రసాద్ కుమారుడు విడియాల సాయినిహస్ భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వేషధారణలో అలరించాడు. స్థానిక లిటిల్ స్కాలర్స్ హైస్కూల్లో 4వ తరగతి చదువుతున్న సాయినిహస్ బుధవారం స్వాతంత్ర్య సమర యోధులు మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వేషధారణ చేసి చూపరులను ఆకట్టుకున్నాడు.





తెలంగాణ ఉద్యమ కారుడు గణేష్ మృతి

- బీఆర్ఎస్ రాష్ట్రనాయకులు డబ్బికార్ శ్రీనివాస్, బర్ల జగదీశ్ యాదవ్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేత



నవతెలంగాణ-మంచాల

మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో తెలంగాణ ఉద్యమ కారుడు నాయినం పల్లి గణేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డబ్బికార్ శ్రీనివాస్, బర్ల జగదీష్‌లు రంగాపూర్ గ్రామానికి చేరుకుని గణేష్ మృతదేహంపై పూలమాలలు వేసి, నివాళు లర్పించారు.అనంతరం మృతుని కుంటుబాన్ని పరామర్శించి, రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంత్య క్రియల్లో బీఆర్ఎస్ నాయకులు గాజుల గోపాల్, బర్తాకి రాజు, కానుగుల మహేష్, శేఖర్‌గౌడ్, వేణు, శ్రీశైలం, విజయ్, పాండు, మహేందర్, శ్రీను తదితరులు ఉన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో బుధవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు బలహీన వర్గాల కోసం ఎనలేని కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ,కౌన్సిలర్లు చంద్రమౌళి, సంతోష్, శ్వేతా పాండురంగారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మహమూద్, మున్సిపల్ సిబ్బంది జయరాజ్, అశోక్, ఆర్. అనూష, నాయకులు ఆనంద్, తదితరులు ఉన్నారు.

బండి సంజయ్ అరెస్టుపై నిరసనలు



నవతెలంగాణ-కందుకూరు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేయడంపై కందుకూరు మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, ఊటు మహేందర్, ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, ర్యాలీ నిర్వహించారు.అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు పల్లె కృష్ణ గౌడ్, జిల్లా పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ కొత్తగూడ సర్పంచ్ సాద మల్లారెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర నాయకులు మంద పాండు, జిల్లా కార్యవర్గ సభ్యులు బొక్క సత్యనారాయణ రెడ్డి, నల్లబోలు నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షులు సోమరాజు వెంకటేష్ ,సురసాని భూమి రెడ్డి , సర్పంచ్ గౌర ప్రభాకర్ , సీనియర్ నాయకులు గంగుల వెంకటరెడ్డి ,రవీందర్ కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పడమటి శ్రీనివాస్ రెడ్డి , పలువురు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో వ్యక్తిపై హత్యాయత్నం

నవతెలంగాణ-శంకర్‌పల్లి



వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో వ్యక్తిపై, మరో వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శంకర్‌పల్లి మహారాజ్పేట్ గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. శంకర్పల్లి సీఐ వి.ప్రసన్నకుమార్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌పల్లి మండల పరిధిలోని గోపులారం గ్రామానికి చెందిన పొడువు క్రిష్ణ (40) కల్లు తాగడానికి మహరాజ్‌పేట్ గ్రామానికి వెళ్లాడు. కల్లు తాగిన తరువాత తిరిగి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా మహరాజ్‌పేట్ గ్రామానికి చెందిన జోగు శ్రీనివాస్ భార్య మంజులతో, క్రిష్ణ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానంతో క్రిష్ణను హత్య చేయాలనే పథకం పన్నాడు. ఆతని కోసం కాపు కాసి శ్రీనివాస్ అతని కొడుకులు సంజయ్, వంశీలు క్రిష్ణ వచ్చేది చూసి కట్టెలతో కొట్టి, చాకుతో మెడ కోస్తుండగా, ఈ విషయం క్రిష్ణ తల్లికి తెలియడంతో లక్ష్మమ్మ చూసి తన కొడుకును చంపుతున్నారని భయపడి విడిపించడానికి వెళ్లగా, ఆమెను కూడా కట్టెలతో కొట్టడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న క్రిష్ణ అన్న పొడవు యాదయ్య వెంటనే శంకర్ పల్లి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బండి సంజయ్ అక్రమ అరెస్ట్‌పై నిరసన



నవతెలంగాణ-మంచాల

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేపీ మండలాధ్యక్షులు మహేశ్వరం గోవర్ధనా చారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బండి సంజయ్ అక్రమ అరెస్టుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దన్నే భాషయ్య, నాయకులు పాండాల జంగయ్య గౌడ్, వింజమూరి వెంకట్ రెడ్డి, నారెడ్డి నర్సింహ రెడ్డి, మారమోని శ్రీశైలం యాదవ్, అని రెడ్డి వెంకట్ రెడ్డి, పాల మోనీ భిక్షపతి యాదవ్ తదితరులు ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం





- చేవెళ్ల కాలే యాదయ్య

నవతెలంగాణ-చేవెళ్ల

దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కొనియాడారు. బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉండే గొప్ప దార్శనికుడు బాబు జగ్జీవన్ రామ్ అని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.





బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడవాలి

- కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి నరసింహ
- యాచారంలో ఘనంగా 116వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-యాచారం

డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఆలంపల్లి నరసింహ పిలుపునిచ్చారు. బుధవారం బాబు జగ్జీవన్ రావు 116వ జయంతిని పురస్కరించుకుని, యాచారం మండల కేంద్రంలో ఉన్న ఆయన విగ్రహానికి కేవీపీఎస్ నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా నరసింహ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాం అందించిన సేవలు దేశంలో ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. నిరంతరం దళితుల అభివృద్ధి కోసం పని చేశారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షులు కావలి జగన్, కేవీపీఎస్ మండల కార్యదర్శి సర్పంచ్ దంతుక పెద్దయ్య, ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షులు విప్లవ కుమార్, కేవీపీఎస్ నాయకులు గడ్డం కుమార్, ప్రశాంత్ కుమార్, ఆలంపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





నవతెలంగాణ-రంగారెడ్డి డెస్క్

మహేశ్వరం మండల కేంద్రంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 116వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనిత హరినాద్ రెడ్డి, ఆధ్వర్యంలో మహనీయుని విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం మండల నియోజకవర్గ ఉపాధ్యక్షులు హనుమగల చంద్రయ్య ఎంపీపీ సునీత అంధ్యానాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు జంగయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆనందం, సీనియర్ నాయకులు అశోక్, ఎర్ర సత్తయ్య, వెంకటయ్య, సంజీవ, దేవేందర్, బక్కనిరాజు, నరసింహ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఉప్పల వెంకటేష్

- మాజీ ఎంపీటీసీ సభ్యులు చెనమోని రంగయ్య
- ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇండ్ల నిర్మాణాలు



నవతెలంగాణ-ఆమనగల్

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, తలకొండపల్లి మండల జడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేష్ పేదల పక్షపాతి అని మాజీ ఎంపీటీసీ సభ్యులు చెనమోని రంగయ్య అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాల కోసం నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణ పనులు చివరిదశకు చేరుకున్నాయి. అందులో భాగంగా కడ్తాల్ మండలంలో రావిచేడ్ గ్రామంలో ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఉప్పల ట్రస్ట్ సభ్యులు బుధవారం గ్రామానికి చెందిన శంకరయ్య, మోనాజీ, నరసింహ, జరుగుల నాయక్ తదితరుల ఇండ్ల నిర్మాణాల ఫినిషింగ్ కోసం కావాల్సిన సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈసందర్భంగా స్థానిక మాజీ ఎంపీటీసీ రంగయ్య మాట్లాడుతూ తలకొండపల్లి మండల జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ తన సంపాదనలో కొంత భాగాన్ని పేద ప్రజల అభివృద్ధి కోసం కేటాయించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా తమ ఇండ్ల నిర్మాణాలకు సహకరిస్తున్నందుకు లబ్దిదారులు శంకరయ్య, మోనాజీ, నరసింహ తదితరులు ఉప్పల వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, ఉప్పల వెంకటేష్ మిత్ర మండలి సభ్యులు రవికుమార్, మార్చ శేఖర్, శేరి రాములు, తిరుపతి నాయక్, శ్రీను, సందీప్, వినోద్, రమేష్, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

- షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి



నవతెలంగాణ-షాబాద్

ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాష్ రెడ్డి అన్నారు. గత వారం రోజులుగా ముద్యంగూడా గ్రామంలో వివిధ కారణా లతో మృతి చెందిన ఐదుగురి బాధిత కుటుంబాలను బుధ వారం ఆయన ఇంటింటికీ తిరిగి వారిని పరామర్శించారు. వారంతా నిరుపేదలు కావడంతో ప్రతి కుటుంబానికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన సరుగుటల యాదయ్య, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భూపతి సిద్దయ్య అనారోగ్య పరిస్థితుల వల్ల మృతి చెందినకంకంటి యాదమ్మ, కోమటి శ్రీరామ సత్తయ్య తదితర కుటుంబాల సభ్యులను ఓదార్చి, అన్ని విధాల ఆదుకుంటున్నట్టు జడ్పీటీసీ తెలిపారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ కూర వెంకటయ్య మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కా శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ జయ్యమ్మ సుదర్శన్, మాజీ సర్పంచ్ భూపతి రాజేంద్ర, శేఖర్, లింగం, సురేష్, రాందేవ్ యాదవ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-కందుకూరు

కందుకూరు మండలంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం కందుకూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. నేదునూరు, కందుకూరు మండల చౌరస్తా, దెబ్బడగూడ, మీర్ ఖాన్ పేట్, ఆకుల మైలారం, బాచుపల్లి, సాయి రెడ్డి గూడా, తిమ్మాపూర్ గ్రామాలలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళు లర్పించారు.

ఊరూరా 'బలగం'



- గ్రామాల్లో కొనసాగుతున్న ఫ్రీ షో ప్రదర్శనలు
- బంధాలు, అనుబంధాలను గుర్తు చేస్తున్న బలగం
- కన్నీరు పెట్టిస్తున్న క్లైమాక్స్ పాట
- సినీ ఇండస్ట్రీలో ఓ ప్రభంజనం బలగం

నవతెలంగాణ-కొత్తూరు

బలగం సినిమా పట్టణాల నుంచి పల్లెలకు పాకింది. బంధాలను అనుబంధాలను గుర్తుచేస్తూ, సాగిన బలగం మూవీ సినీ ఇండస్ట్రీలో ఓ ప్రభంజనం. బుర్రకథ, ఒగ్గు కథ లాగా సాగిన ఇందులోని పాటలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. 'తోడుగా మాతో నుండి నీడగా మాతో నడిచి.. నువ్వెక్కడా వెళ్లి నావు కొమురయ్య.. నీ జ్ఞాపకాలు మరువమయ్యో కొమురయ్య...' అనే పాటతో సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాడు దర్శకుడు వేణు, సినిమా చూసిన ప్రతి ఒక్కరూ తమ బంధాలు అనుబంధాలను గుర్తు చేసుకుంటున్నారు. తమ కుటుంబ సభ్యులందరితో కలిసి బలగం మూవీ చూసి థియేటర్ ముందు ఫొటోలు దిగి తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారు. మూవీ చూసిన తర్వాత దూరమైన బంధాలు దగ్గరైన ఘటనలు ఉన్నాయి. టెలివిజన్ లేని కాలంలో గ్రామాల్లో తెల్లని గుడ్డ ఏర్పాటు చేసి ప్రొజెక్టర్ సహాయంతో సినిమాలు చూపించేవారు.తిరిగి ఇన్నాళ్లకు మళ్ళీ పాత రోజులు గుర్తు చేస్తూ బలగం మూవీని ఊరురా ప్రదర్శి స్తున్నారు. 30 ఏండ్ల తరువాత ఇన్నాళ్లకు గ్రామంలోని యువత బలగం మూవీని గ్రామస్తులందరికీ చూపిస్తూ బంధాలను అనుబంధాలను గుర్తు చేస్తున్నారు. సినిమాలోని పాటలు సన్నివేశాలు నిజ జీవితానికి దగ్గరగా ఉండే విధంగా దర్శకుడు వేణు తెరకెక్కించిన విధానం అద్భుతం.

బలగం అనుబంధాలను గుర్తు చేస్తుంది



బలగం బంధాలు అనుబంధాలను గుర్తు చేస్తుంది. కొన్నేండ్ల తర్వాత ఒక మంచి సినిమా చూశాను. ప్రస్తుత సినిమాలు ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడలేకుండా ఉంటు న్నాయి. దర్శకుడు వేణు అశ్లీలతకు తావు లేకుండా నిజ జీవితానికి దగ్గరగా పాత్రలను మల్చి బుర్ర కథ, ఒగ్గు కథ లాగా సులభంగా పాటలు అర్థమయ్యే రీతిలో సినిమాను తెరకెక్కించిన విధానం అద్భుతం. బల గం సినిమా కుటుంబ సభ్యులతో కలిసి చూస్తే దూరమైన బంధాలు అను బంధాలు దగ్గరవుతున్నాయి. మొదటి సినిమాతోనే దర్శకుడు వేణు టాలీవుడ్‌ల ఓ ప్రభంజనాన్ని సృష్టించాడు.

కోస్గి శ్రీనివాస్, కౌన్సిలర్, కొత్తూరు మున్సిపాలిటీ

మా అమ్మ గుర్తుకు వచ్చి, గ్రామస్తులందరికీ 'బలగం' మూవీ చూపించాను



నిజ జీవితాలకు దగ్గరగా బలగం సినిమాను తెరకెక్కించారు. మేము చిన్నతనంలో ఉన్నప్పుడు గ్రామాల్లో తెల్లని గుడ్డ కట్టి సిని మాలను ప్రదర్శించి చూపించేవారు. రోజురోజుకూ ఆధునిక టెక్నాలజీ పెరిగి గ్రామాల్లో సినిమాల ప్రదర్శనలు కనుమరుగయ్యాయి. మళ్లీ ఇన్నాళ్లకు బలగం మూవీని గ్రామాల్లో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. బలగం మూవీ చూసిన తర్వాత చనిపోయిన మా అమ్మ గుర్తుకు వచ్చి మా గ్రామంలో బలగం మూవీ గ్రామస్తులందరికీ ప్రదర్శింపజేసి ఉచితంగా చూపించాను.

లింగారం సురేష్‌గౌడ్, ఎస్టిపల్లి, కొత్తూరు మండలం

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తాం

- అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుదర్శన్‌బాబు



నవతెలంగాణ-శంకర్‌పల్లి

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సుదర్శన్ బాబు అన్నారు. జన్వాడ షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షులుగా నగేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఆయన తెలిపారు.బుధవారం నగరంలోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుదర్శన్ బాబు, జిల్లా అధ్యక్షులు శివశంకర్ ల సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా రాజు, ప్రవీణ్, అనిల్ కుమార్, జాయింట్ సెక్రెటరీలుగా శ్రీనివాస్, భూపాల్, అరుణ్‌లు ఎంపికయ్యారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షులు నగేష్ మాట్లాడుతూ తనపై నమ్మకతో పదవి బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

- జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి
- ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-కందుకూరు

ప్రతి ఒక్కరూ మహనీయుల అడుగుజాడల్లో నడవాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. బాబు జగజీవన్ రామ్ 116 వ జయంతి సందర్భంగా కందుకూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంద నర సింహ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మన్నె జయేందర్, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు చిర్ర సాయిలు, ఎంఎ టీసీ ఫోరం మండలాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీలు ఇందిరాదేవేందర్, కాకి రాములు, డైరెక్టర్ పొట్టి ఆనంద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు సామయ్య యూత్ ప్రెసి డెంట్ విగ్నేశ్వర్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ బొక్క దీక్షిత్ రెడ్డి, కార్యాలయ కార్యదర్శి బర్కం వెంకటేష్, రామాం జనేయులు, నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ రాములు, జంగయ్య, కాకి నర్సింహా, గోవర్ధన్, కృష్ణారెడ్డి, రాములు, నర్సింహా, శ్రీధర్, రాకేష్ రెడ్డి అంబేద్కర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-కొత్తూరు



గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల ఒకటవ తేదీన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చేగూర్ చౌరస్తాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామానికి చెందిన గణేష్‌కు (32) తీవ్రగాయాల పాలయ్యాడు. శంషాబాద్‌లోని ట్రీ డెంట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

- బీఆర్ఎస్ మండల అధ్యక్ష,కార్యదర్శులు చీరాల రమేష్, కాట్రోత్ బహదూర్



నవతెలంగాణ-మంచాల

మంచాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు చీరాల రమేష్, కాట్రోత్ బహదూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మెన్, వైస్ చైర్మెన్ బుస్సు పుల్లారెడ్డి, బోద్రమోనీ యాదయ్య, సర్పంచ్‌లు కె. శ్రీనివాస్‌రెడ్డి, ఏ.జగన్ రెడ్డి, పి.బాల్ రాజ్,ఎం.రాజు నాయక్, ఎంపీటీసీ పి.సుకన్య శేఖర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు మొగిలి పావని వెంకటేశ్, నారి యాదయ్య, యువజన విభాగం మండల అధ్యక్షులు వన పర్తి బద్రీనాథ్ గుప్త, విద్యార్థి విభాగం మండలాధ్యక్షులు బొట్టు ప్రవీణ్ నాయక్ , ఎఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నల్ల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆరుట్లలో..

మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చినట్టు సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు..ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు గుడ్డి మల్ల చంద్రయ్య, కంబాలపల్లి భాస్కర్, సుంకరి ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





నాగారం గ్రామపంచాయతీలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

దారురు మండల పరిధిలోని నాగారం గ్రామపంచాయతీలో బాబు జగ్జీవన్ రామ్‌కు జయంతి వేడుక లను జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సూరిబాబు, వార్డ్‌మెంబర్ మదనపల్లి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌గౌడ్, జె.వెంకటరెడ్డి, ఏ.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

డీసీసీ అధ్యక్షులు టి. రామ్మోహన్ రెడ్డి

నవతెలంగాణ- చౌడాపూర్

ప్రజలు ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని డీసీసీ అధ్యక్షులు టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలం మక్త వెంకటాపూర్ తండాలో కాంగ్రెస్ నాయకురాలు లలిత నిర్వహించిన తుల్జా భవాని పూజా కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ కుమార్, జారుపుల వెంకట్, సుర్య నాయక్, రామ రావు,తదితరులు పాల్గొన్నారు.

వివక్షను జయించిన బాబూ జగ్జీవన్



నవతెలంగాణ-కొడంగల్

ఒకవైపు దేశ స్వాతంత్య్రం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజ కీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు రమేష్ బాబు, అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు జగన్, అడ్వకేట్ రాములు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ దస్తప్పలు అన్నారు. కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రాల అశోక్, పెద్ద నందిగామ సాయిలు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోభివృద్ధికి యువకులు పునాదులు వేయాలి



- సర్పంచ్, జడ్పీటీసీ

నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

దేశ పురోభివృద్ధికి యువకులు పునాదులు వేయాలని సర్పంచ్ విజయమ్మ, జడ్పీటీసీ ధారాసింగ్ తెలిపారు. బుధవారం పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు మంబాపూర్, తట్టేపల్లి తదితర గ్రామాల్లో బాబు జగ్జీవన్ రావ్ 116వ జయంతిని పురస్కరించుకొని సర్పంచ్ విజయమ్మ, జడ్పీటీసీ దారాసింగ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్, ఎంపీటీసీ శంకర్‌నాయక్, శ్రీనివాస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కోహిర్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు గోపాల్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పెండాల ప్రవీణ్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రంగయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రకాశం, నర్సింలు, గ్రామపంచాయతీ సభ్యులు అరవింద్, ఫయాజ్, మల్లేశం, గ్రామ పంచాయతీ సెక్రటరీ సెక్రెటరీ భాస్కర్ గౌడ్, కారోబార్ నర్సిరెడ్డి, యువజన సంఘాల సభ్యులు డివై. నరసింహులు, కష్ణ, రవి, ప్రసాద్, పెంటప్ప, మల్ల ప్ప, స్వామి దాస్, వెంకటయ్య, లక్ష్మణ్ గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు



- బీఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షులు జయసింహ

నవతెలంగాణ-శంషాబాద్

అణగారిన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని బీఎస్పీ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు రాచమల్ల జయసింహ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ 116 వ జయంతి వేడుకలు శంషాబాద్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొని పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుడు జగ్జీజీవన్ రామ్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ శంషాబాద్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి చిన్నగండు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రె శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.జన చైతన్య సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జన చైతన్య సేవా ఫౌండేషన్ ఫౌండేషన్ అధ్యక్షులు నీరటి దేవేందర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం ని యోజకవర్గం అధ్యక్షులు రొడ్డ రాజు , సాయిగౌడ్ జి. శ్రీ కాంత్. దేవదాస్, ఎం. సుధాకర్ నవీన్ చారి, వంశీ, ప్రమోద్ కుమార్ , కాశి తదితరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో రామ్మోహన్ రెడ్డి



నవతెలంగాణ-పరిగి

పరిగి పట్టణ కేంద్రంలో బుధవారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి





- జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

మహనీయుల భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తూ వారి ఆశయాలను ముందుకు సాగించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలంపల్లి చౌరస్తా నుండి ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటంతో భారీ ర్యాలీని చేపట్టి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బిజెఆర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద పటేల్, జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ బి, విజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎస్. సుశీల్ కుమార్ గౌడ్, పురపాలక సంఘం చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్, పిఏసిఎస్ చైర్మన్ ముత్యం రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మోముల స్వాతిలు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఎంతోమంది మహనీ యులు వారి జీవితాలను త్యాగం చేసి సమాజంలో మార్పు కోసం అహర్నిశలు కృషి చేశారన్నారు. పట్టణ కేంద్రంలో అంబేద్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటు చేయాలన్న ఆకాంక్ష తీరడం లేదన్న విషయాన్ని తన దృష్టికి తీసుకు రాగా తనవంతుగా నెల జీతం నుండి సగం విరాళంగా అందించినున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రకటించారు. అంబేద్కర్ చుట్టూ ఐలాండ్ నిర్మాణ పనుల నిమిత్తం సిబిఎఫ్ నుండి రూ.5 లక్షల మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేసిన మహనీయుల అని కొనియాడారు. అంబేద్కర్ కాంస్య విగ్రహం కోసం తన వంతుగా రూ.1 లక్ష 116 విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. విగ్రహం పరిసరాలలో ఐలాండ్ సుందరీకరణకు రూ 5 లక్షల ఎమ్మెల్యే నిధులను మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శుభ పటేల్ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసిన మహనీయులను ఆదర్శం తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మురళీధర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం, గిరిజన సంక్షేమశాఖ అధికారి కోటాజి, డీఆర్‌డీఓ కృష్ణన్, వికారాబాద్ ఆర్డిఓ విజయ కుమారి, డిపిఓ తరుణ్ కుమార్, వ్యవసాయశాఖ అధికారి గోపాల్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవాల కమిటీ అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నర్సింలు, కమిటీ సలహాదారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష బాగా రాయలేదని విద్యార్థి బలవన్మరణం

- గ్రామంలో విషాధఛాయలు
  కేసు నమోదు,





నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

పది పరీక్ష బాగా రాయలేదని విద్యార్థి బలవన్మరణం చేసుకున్న ఘటన యాలాల మండలంలోని అగ్గనూరు గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం మల్‌రెడ్డిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పదో తరగతి తెలుగు పరీక్ష బాగా రాయలేదని ఓ విద్యార్థి బలవన్మరణం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, ఎస్సై అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం..ధారూర్ మండలం నాగసముందర్‌కు చెందిన మామిళ్ళ రమేష్ (16) యాలాల మండలం అగ్గనూరు గ్రామ పంచాయతీ పరిధి అనుబంధ గ్రామం మల్రెడ్డిపల్లిలో ఉన్న తమ పెద్దమ్మ దగ్గర ఉంటు చిన్ననాటి నుండి అగ్గనూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్లో చదువుకుంటున్నాడు. ఈ నెల 3న నిర్వహించిన పదవ తరగతి తెలుగు పరీక్ష బాగా రాయలేదని మనస్థాపం చెంది బాధపడుతుండే వాడు. అదేరోజు సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. విద్యార్థి రమేష్, ఇంటికి తిరిగిరాని విద్యార్థి రమేష్ కోసం 2 రోజుల నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. రమేష్‌కు ఈత రాదు. బుధవారం మల్‌రెడ్డిపల్లి గ్రామ పరిధిలో ఉన్న రెడ్డి చెరువులో శవమై తేలి ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు యాలాల పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై అరవింద్ ఘటనా స్థలానికి చేరుకొని రమేష్ మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికు తీసి తాండూర్ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఘటనతో మల్‌రెడ్డిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దోమలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు





నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

దోమ మండలంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా జరిపారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు కె.రాజిరెడ్డి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వార్డ్ సభ్యులు నిరోషా, మైనొద్దీన్, లావణ్య, మార్కెట్ డైరెక్టర్ డప్పుశేఖర్, నాయకులు సురేందర్, డప్పుయాదయ్య, నరేష్, అంజిలయ్య, దాసరి రాజేందర్, ఏఎన్.యం సత్య అనసూజ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 'పల్లె పల్లెకూ పైలెట్' షెడ్యూల్ ఖరారు

- 13న మండల కేంద్రంలో
  బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

తాండూర్ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పల్లెకు పైలెట్' షెడ్యూల్ ఖరారు అయింది. మండలంలో..8న కందనెల్లి, ఖానాపూర్, రుక్మాపూర్, రేగొండి, కొండాపూర్, నెల్లిగడ్డతండా, మదనంతపూర్, మన్‌సాన్‌పల్లి, ఎర్రగడ్డ తండా..9న మరేపల్లితండా, దుగ్గపూర్, చైతన్యనగర్, మంబాపూర్, బండపల్లి, జనగాం, మారేపల్లి..10న కందనెల్లి తండా, బుద్దారం, పెద్దేముల్ తండా, పెద్దేముల్, తింసాన్‌పల్లి, గోపాల్‌పూర్, నాగులపల్లి, నర్సాపూర్, రుద్రారం...11న గోట్లపల్లి, హన్మపూర్, గిర్మాపూర్, జయరాం తండా, ఉష్ణనాయక్ తండా, దారువాక తండా, ఇందూర్, ఆత్కూర్, ఎర్రగడ్డ తండా, సిద్ధన్నమడుగు తాండ..12న బండమీదిపల్లి, రాంసింగ్ తాండా, పాషాపూర్, ఓమ్లానాయక్ తండా, రచకట్ట తండా, జయరాం తండా, ఊరెంటి తండా, బైమీది తండా, అడ్కిచర్ల 'పల్లె పల్లెకు పైలెట్' కార్యక్రమం తేదీల షెడ్యూల్ విడుదల చేశారు. 13న మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళన బహిరంగ సభ తేదీ షెడ్యూల్ విడుదల చేశారు.

జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

నవతెలంగాణ-శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గంలో బాబూ జగ్జీవన్ రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకల్లో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ అడుగుజాడల్లో నడవడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని తెలి పారు. కార్యక్రమంలో రాయదుర్గం సిఐ వెంకటేష్, రాయదుర్గం బాబు జగ్జీవన్ రామ్ యువ జన సంఘం అధ్యక్షులు సంజీవ. గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు కష్ణ ముదిరాజ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు నరేందర్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు



హనుమంతు నాయక్, రంగారెడ్డి జిల్లా ఎక్జిక్యూటివ్ మెంబర్ నీరుడి సురేష్, డివిజన్ ఎక్జిక్యూటివ్ మెంబర్ శంలేట్ నరసింహ రాజు. డివిజన్ వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దాం





- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి,
  ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

నవతెలంగాణ-పరిగి

బాబూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేద్దామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం పరిగి పట్టణ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాల వేశారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ బాబా సాహెబ్ అంబెద్కర్,బాబు జగ్జీవన్ రామ్ రెండు కళ్ళ లాంటి వారని ఇద్దరు మహనీయుల జయంతులు ఒకే నెలలో వస్తాయన్నారు. ఒకరు రాజ్యాంగం రచిస్తే మరొకరు దానిని ఆమోదించారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు, నేడు రాష్ట్రంలో ఏర్పాటైన నూతన జిల్లాలు, రెవిన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీలకు పటిష్టతకు రాజ్యాంగం దోహద పడిందన్నారు. భవిష్యత్తును ఊహించి నాడు మహనీయులు రూపొందించిన ఫలాలు నేడు అనుభవిస్తున్నామన్నారు. వారు చూపిన దారిలో నడుద్దామని, ఆశయ సాధనకు కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ మహిళ చదువుకు ఆయన కృషిచేశారన్నారు. అందరి అభ్యర్థనల మేరకు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఇక్కడకి మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ హరిప్రియ ప్రవీణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాన్వాయ్‌ని అడ్డుకునే ప్రయత్నం చేసిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-పరిగి

పరిగి పట్టణ కేంద్రంలో పరిగి మున్సిపల్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి బుధవారం విచ్చేసిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కాన్వాయ్‌ని బీజేపీ, ఏబీవీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకొని పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీజేపీ పరిగి నియోజకవర్గ నాయకులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, పరిగి అసెంబ్లీ కన్వీనర్ నర్సింహా మాట్లాడుతూ రాష్ట్రంలో పేపర్ల లీకేజీల పరంపర నడుస్తున్న నేపథ్యంలో, బా ధ్యతాయుత ప్రతిపక్ష పార్టీగా బీజేపీ ప్రశ్నిస్తుంటే, సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం, బండి సంజయ్‌ను అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్‌చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శులు పెంటయ్య, హరికృష్ణ, మండలాధ్యక్షులు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు జోగు రమేష్,ఎర్రగడ్డ పల్లి రమేష్, నర్సింలు, అశోక్, భీమయ్య శ్రీనివాస్, వివేక్, వెంకట్, సునీల్, రవికృష్ణ, ఏబీవీపీ నాయకులు ఉపేందర్, సాయి గణేష్, వినోద్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పీసీఎం తండా గ్రామపంచాయతీలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి



నవతెలంగాణ-వికారాబాద్ డెస్క్

దారురు మండల పరిధిలోన పీసీఎం తండా గ్రామ పంచాయతీలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంతోష్, గ్రామ సెక్రెటరీ, గ్రామస్తులు, గ్రామ యువత పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR JUDGE-CUM-X METROPOLITAN MAGISTRATE AT : KUKATPALLY
O.S. NO. 64 OF 2022

Between

1. T. Subhas Chandrabose, S/o. Late T. Rama Murthy Shastri,Aged about 72 years, Occupation: Retd, Employee.R/o. Plot No.856, HMT Swarnapuri Colony, Miyapur,Serilingampally Mandal, Ranga reddy District,Telangana State-500049, Aadhaar card No.8665 1355 7327
2. Tulasi Balakrishna, S/o. Late T. Rama Murthy Shastri,Aged about 72 years, Occupation: Retd. Employee,R/o. Flat No.204, Plot No.4/5/6, Rock Town Colony, Road No.1, Second Cross, Lakshmi Nialayam,Hayathnagar, Mansoorabad, Hayathnagar,Rangareddy District, Telangana State -500068, Aadhaar card No.4906 4923 4169

.....Petitioners/ Plaintiffs

AND

1. The Mandal Revenue Officer Serilingampally Mandal, R.R.District,
2. All Concerned

.....Respondents/Defendants

Please take notice that the plaintiffs herein have filed a suit for declaring the plaintiffs as legal heirs of the deceased, Late Tulasi Venkata Subba Lakshmamma, W/o.Late T. Rama Murthy Shastri who died on 06-09-2011, leaving behind her the Plaintiff No. 1(elder son) and the Plaintiff No.2 (younger son) as her legal heirs. If anybody is having objections or any claims in the said matter, they should appear before the The Hon'ble II Additional Junior Judge-Cum-X Metropolitan Magistrate At Kukatpally on 18-04-2023 at 10.30AM failing which the matter will be decided according to the law.

//By order of the Hon'ble Court///

Sd/
V.S.CHARY,
B.A. LLB.
-OFE Adj. to old IX M.M. Court
Allwyn Colony X Roads,
Miyapur, Hyderabad-49
Cell No:8341158619

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE CUM XV M.M, R. R. DSITRICT; AT: IBRAHMPATANAM
O.S.NO. 347 OF 2022

Between:

1. SMT. SUSHEELA DEVI SURANA, W/O LATE SRI KESRIMALJI SURANA, Age 66 years, Occ : House wife, R/o House No.3-5-874/14. 3rd Floor, Street NO.5, Hyderguda, Himayathnagar, Hyderabad (Aadhar NO. 2736 2000 5783).
2. SRI DILIPKUMAR SURANA,S/O SRI KESRIMALJI SURANA, AGE ; 47 YEARS, Occ : Business, R/o House No.3-5-874/14. 3rd Floor, Street NO.5, Hyderguda, Himayathnagar, Hyderabad (Aadhar NO. 4463 4391 7709).
3. SRI SANJAY KUMAR SURANA, S/O KESHRIMALJI SURANA, Age: 45, Occ: Business,R/o House NO.18-4-789/A/7, Rajanna bowli, Aliabad, Falkunama, Hyderabad (Aadhar NO.5335 3721 0661).
4. SMT SEEMA JAIN, W/O NAVIN CHAND JAIN, Age : 42 years, Occ : House wife,R/o 5-6-7/23, Tadbund, Saneevaiah Colony, Secunderabad (Aadhar NO.7895 8017 3544).
5. SMT PRAVEEN SUSHMA JAIN, W/O S.PRAVEEN JAIN, Age : 41 years, Occ : House wife, R/o House No.9-61/1, Temple Alwal, Alwal, Tirumalagiri, Hyderabad (7517 5849 3677). .....PLAINTIFFS

And

1. ALL CONCERNED.
2. Tahsildhar, Ibrahimpatnam Mandal office, Ibrahimpatanam, R. R. District.

....DEFENDANTS

SUMMONS TO CONCEREND PEROSNS

Whereas the plaintiffs have filed the above suit for declaration of legal heirs of LATE. KESHRI MALJI SURANA, S/O LATE BUDURAJ SURANA in respect of suit schedule of property If any person or persons have any objection on the above case, please appear before the Hon'ble court on 12 -04-2023 at 10.30 am either in person or pleader, otherwise the suit will be determined in exparte.

SCHEDULE OF PROPERTY

All that the piece and Parcel of land admeasuring Ac 0-11.50 Guntas in Survey No.285/EE/EE/1 in Survey No.671, land admeasuring Ac 0-12.50 Guntas in Survey No 299/AA 4/1, land admeasuring Ac 0-16.50 Guntas in Survey No.300/ E 2/1 total land admeasuring Ac 1-05 Guntas situated at POCHARAM VILLAGE, IBRAHRIM-PATAN MANDAL, R. R. DIST, T.S. bounded by:- **NORTH:** LAND OF PRUCAHSERS, **SOUTH** : ROAD TO VILLAGE, **EAST** : LAND OF KUMMARI NARAYANA AND OTHERS. **WEST** : LAND OF ANDELA MAHESH & OTHERS

(ORDER OF THE COURT)

SD/-
SAMUDRALA SRINIVASA RAO
ADVCOATE
COUNSEL FOR PLAINTIFFS
Cell : 9347043986

IN THE COURT OF THE HON'BLE II ADDL.SENIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT: AT:MALKAJGIRI
I.A.NO. 8 OF 2022
IN
O.S.NO. 301 OF 2022
AND ALSO IN THE MAIN SUIT
OS.NO.301 OF 2022

BETWEEN:
SMT. T. KIRANMAI

...PETITIONER/PLAINTIFF

AND

SRI K.PRAVEEN KUMAR REDDY&OTHERS
....RESPONDENTS/DEFENDANTS

To,
1) SRI K.PRAVEEN KUMAR REDDY, S/O. VISHNU VARDHAN REDDY, AGED ABOUT 42 YEARS, OCC: BUSINESS, R/O. H.NO. 4-12-14/15, BHAGYALATHA B D COLNY, VANASTHALIPURAM, R.R.DISTRICT. 2) SRI. D.JAIHIND S/O.LAXMAIAH, AGED ABOUT:64 YEARS, OCC: RETIRED, R/O.H.NO. 18-7- 599/52, UPPUGUDA, HYDERABAD. 3) SRI. DURUSOJU YELLA CHARY, S/O.RAGHAVA CHARY, AGED ABOUT.51 YEARS, OCC:LABOUR, R/O. H.NO.5-45/5,GANDHINAGAR,PARVATHA-PUR VILLAGE,GHATKESAR MANDAL, R.R. DISTRICT. 4) SRI. KALAKATLA ALFRED, S/O. NUKARAJU, AGED ABOUT: 76 YEARS, OCC: RETIRED, R/O.H.NO.30-151/7, VINAYAKA NAGAR COLONY, R.K.PURAM, SECUNNDRABAD 5) SRI. SAMBA BALAJI RAO, S/O. DURGA RAO, AGED ABOUT: 32YEARS,OCC:BUSINESS, R/O.H.NO.3-19, HANUMAN NAGAR, OPP. KALA NIKETHAN ROAD, DILSUKHNAGAR, HYDERABAD. 6) SRI. K.NARESH, S/O.K. RAJENDRA,AGED ABOUT:37YRS, OCC: BUSINESS, R/O. H.NO. 2-4-254/B, CIB QUARTERS, NEHRU NAGAR, KACHIGUDA, HIMAYATH NAGAR, HYDERABAD. 7) SMT. AFSHAN JABEEN, W/O.FAREED KHAN, AGED ABOUT: 51 YEARS, OCC: HOUSE WIFE, R/O. FLAT NO. 1/3, MANI OM COMPLEX,NEW NALLAKNTA,HYDERABAD. 9) SRI.M.RAMULU, S/O. CHANDRAIAH, AGED ABOUT:69YEARS, OCC: RAILWAY EMPLOYEE, R/O.H.NO. 163/2, CHILKALGUDA,SECUNDRABAD. 10) SRI. KORA VENKATAIAH, S/O.KISTAIAH, AGE ABOUT: 71 YEARS, OCC :RETIRD, R/O.TYPE B/12, MARKET NORTH LALAGUDA,SECUNDRABAD. 11) SRI. DUBBAKA ANJANEYALU, S/O.MALLAIAH, AGED ABOUT 42 YRS, OCC : AGRICULTURE,R/O. 2-18/1, PARVATHAPUR VILL., MEDI PALLY MANDAL, MEDCHAL-MALKAJGIRI DIST.

...RESPONDENT NOS.1 TO 7 AND 9 TO 11 / DEFENDANT NOS.1 TO 7 AND 9 TO 11

Please take notice that the Petitioner/Plaintiff filed the above Petition andsuit i.e.I.A.No. 8 OF 2022 in O.S.NO. 301 of 2022 filed U/O 39 Rule 1 and 2 of C.P.C. Os.No.301 of 2022 for Perpetual Injunction on the file of Hon'ble II Addl.Senior Civil Judge,Medchal-Malkajgiri District: At:Malkajgiri against above mentioned RESPONDENT NOS.1 TO 7 AND 9 TO 11 / DEFENDANT NOS.1 TO 7 AND 9 TO 11 intheabove said suit. The said I.A.No. 8 of 2022 and OS.No.301 of 2022 is posted on27-04-2023 for your appearance. Therefore you should be present in person or through Advocate on the aforesaid date at 10:30 A.M. otherwise you will be set exparte onthesaid day and the same will be decided on merits.

By Order of the Court.

V.SRINIVAS
Y.BHASKER
ADVOCATES
Res:H.No.8-2-268/C/10, Road No.3, Arora Colony, Advocates Banjara Hills, Hyderabad-34 Ph.no. 9848996008

మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్





జనంలో రాఘవులు....





సైడ్‌లైట్స్...

- తమ బ్యాగులు, ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న వస్తువులను భుజాల పెట్టుకొని, నెత్తిపై మోసుకుంటు ర్యాలీలో కదిలిన కార్మిక, కర్షకులు
- దారిపొడువునా మోడీ ప్రభుత్వ వ్యతిరేక నినాదాల హోరు
- కాలినడక చెప్పులు లేకుండా అనేక మంది ర్యాలీలో కనిపించారు
- అత్యధిక భాగం మహిళలు ప్రదర్శనలో భాగస్వామ్యం అయ్యారు.
- ఎక్కడా ఎలాంటి అవాఛనీయ ఘటన తలెత్తకుండా క్రమశిక్షణతో మెలిగిన కార్మిక, కర్షకులు
- వివిధ రాష్ట్రాల కార్మిక, కర్షకులు ప్రాంతీయ భాషల్లో నినాదాలు
- అస్సాం, మణిపూర్ వంటి ఈశాన్య, రాజస్థాన్, హర్యానా వంటి ఉత్తరాది రాష్ట్రాల మహిళ తమ రాష్ట్రాల సాంప్రదాయ వస్త్రాధారణలో కనిపించారు.
- కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల పురుషులు సాంప్రదాయ దోతి (లుంగీ) వస్త్రాదారణతో కనిపించారు.
- ఉత్తరాది రైతులు తమ సాంప్రదాయ సిలకట్టును, తలపాకాతో పురుషులు హాజరయ్యారు.
- సోదర సంఘాల సంఘీభావం
- ఎర్ర సముద్రంలా మారిన రాంలీలా మైదానం
- ఆలోచింప చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేదిక వద్ద లాల్ సలామ్, రెడ్ సెల్యూట్ నినాదాలు

నలుమూలల నుంచి ర్యాలీలు

తొలుత దేశ రాజధాని ఢిల్లీ నలుమూలల నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ర్యాలీలు రాంలీలా మైదానానికి చేరుకున్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ (అజ్మీరీ గేట్), పాత ఢిల్లీ రైల్వే స్టేషన్ (శిష్ గంజ్ గురుద్వారా), సరాయ్ రోహిల్లా రైల్వే స్టేషన్ (గురుద్వారా రకబ్ గంజ్), గురుద్వారా బంగ్లా సాహెబ్, అంబేద్కర్ భవన్ నుంచి ఐదు ప్రధాన ప్రదర్శనలు, వీటితో పాటు వివిధ ప్రాంతాల నుంచి చిన్న చిన్న ర్యాలీలు రాంలీలా మైదానానికి చేరుకున్నాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ర్యాలీలు, మధ్యాహ్నం రెండు గంటల వరకు రాంలీలా మైదానానికి వస్తూనే ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు క్రమ శిక్షణతో నినాదాలిచ్చుకుంటూ ముందుకు సాగారు.



తెలంగాణ బృందం

దద్దరిల్లిన ఢిల్లీ

లక్షలాదిగా తరలొచ్చిన కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు

(మొదటిపేజీ తరువాయి)

గుజరాత్ నుంచి గౌహతి వరకు దేశ నలుమూల నుంచి భారీగా తరలివచ్చిన కష్ట జీవులతో దేశ విశిష్టమైన భిన్నత్వంలో ఏకత్వం ఢిల్లీ నగరంలో ప్రస్ఫుటించింది. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేసేందుకు రాజకీయ మార్పులే లక్ష్యంగా ఎర్ర జెండాలతో తరలివచ్చిన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు మహానగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మోడీ హటావో దేశ్ బచావో అంటూ దేశ నడిబొడ్డిన గొంతెత్తి నినదించారు. హిందీ, ఇంగ్లీష్ భాషలతో పాటు వివిధ ప్రాంతీయ భాషల్లో కార్మిక, కర్షకులిచ్చే నినాదాలతో దేశ రాజధాని దద్దరిల్లింది.

బుధవారం రాంలీలా మైదానంలో 13 డిమాండ్ల సాధనం కోసం సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో భారీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ మార్చ్ జరిగింది. లక్షలాది మంది కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మి కులు హాజరు కావడంతో రాంలీలా మైదానం కిక్కిరిసి పోయింది. హర్యానా, పంజాబ్, రాజ స్థాన్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర , ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, అసోం, త్రిపుర, మణిపూర్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్ రాష్ట్రాల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సంఘీభావం

ర్యాలీలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, బృందా కరత్, బీవీ రాఘవులు, ఎంఏ బేబి, నీలోత్పల్ బసు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీపీ సానూ, మయూక్ బిశ్వాస్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, కోశాధికారి ఎస్. పుణ్యవతి వంటి వివిధ సంఘాల నేతలూ సంఘీభావం ప్రకటించారు.

గర్జించిన కష్టజీవులు

దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కష్టజీవులు వారి జీవనోపాధిపై జరుగుతున్న దాడిని ఆపాలనీ, ఉచిత విద్య, వైద్యం అందించాలనీ, గౌరవప్రదమైన జీవితం కావాలని గర్జించారు. 'నమో.. నో మోర్' అంటూ మోడీ ప్రభుత్వ దుర్మార్గ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈశాన్య రాష్ట్రాలు, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కార్మికులు, రైతులు సంప్రదాయ దుస్తులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు.

బీజేపీ సర్కార్‌పై కన్నెర్ర

దేశ సంపదను నాశనం చేసే బిజెపి ప్రభుత్వంపై కార్మికులు, రైతులు, వ్యవ సాయ కార్మి కులతో కూడిన ఐక్య ప్రతి ఘటన ఆగ్రహం వ్యక్తం చేసింది. శ్రామిక ప్రజల జీవితాలను అగాధం లోకి నెట్టే తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి దృష్టిని మరల్చేం దుకు మోడీ సర్కార్ చేసే విద్వేష ప్రచారాలకు వ్యతిరేకిం చింది. బడా కార్పొరేట్ శక్తులకు లాభాల వర్షం కురిపిస్తూ, తమ ప్రాథ మిక అవసరాలను పట్టిం చుకోక పోవడంపై దేశంలోని శ్రామిక ప్రజల ఆగ్రహానికి ఈ ర్యాలీ నిదర్శనమని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన పెద్ద పెద్ద ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ యజమానులకు విక్రయిం చడం, కార్మికులు, రైతుల ప్రాథమిక హక్కులను హరించడం, దేశీయ వ్యవసాయం, పాడి పరిశ్రమలను స్వాధీనం చేసుకునేందుకు విదేశీ పెట్టుబడిని ఆహ్వానించడం, ప్రజల కష్టాలను దోచుకోవడంలో అవినీతిపరులకు సాయం చేయడం ఇకపై సాగనీయమని ప్రకటించింది. సంపన్న వ్యాపార సంస్థల చేతుల్లో దేశం బందీ కాకుండా కాపాడటానికి కార్మికులు, రైతులు చేతులు కలిపి దేశవ్యాప్తంగా ఉధృతమైన ఉద్యమాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది.

ఎర్ర సముద్రంలో మహిళా సత్తా

ఢిల్లీని ఎర్రని సముద్రంగా మార్చిన మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ సత్తా చాటారు. నిర్వాహకుల అంచనాలను సైతం తలకిందులు చేస్తూ వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళలు అపూర్వంగా పాల్గొన్నారు. అసోంకు చెందిన 1,500 మంది ప్రతినిధులలో 80 శాతం మంది మహిళలే ఉన్నారు. మహారాష్ట్ర, బెంగాల్, రాజస్థాన్, మణిపూర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది మహిళలు హాజరయ్యారు. రైతుల విజయం, అంగన్‌వాడీ ఉద్యమ విజయం ఉత్తర భారత గ్రామాల్లో మహిళల భాగస్వామ్యానికి నిదర్శనం. అంగన్‌వాడీ ఫెడరేషన్ బలమైన పోరాటాలను నిర్వహిం చిన హర్యానా నుంచి ఎక్కువ మంది మహిళలు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాంలీలా మైదానంలోని వేదికపై ఉదయం 8 గంటల నుంచి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు కార్మిక, కర్షకులను ఆకట్టుకున్నాయి. జన నాట్య మంచ్, జన సంస్కృతి వంటి సంఘాల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రజలపై మోడీ సర్కార్ చేసే కుతంత్రాలను, ప్రజల సమస్యలను వివరిస్తూ కవితలు, నాటికలు, గీతాలాపనలు చేశారు. సభ ప్రారంభానికి ఏఐఏడబ్ల్యూయూ మాజీ సహాయ కార్యదర్శి సునీత్ చోప్రా హఠాన్మరానికి సంతాపం తెలిపారు.

నవచిత్రం

అసలు పుష్ప ఎక్కడ?



అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా, డైరెక్టర్ సుకుమార్ తెరకెక్కించిన చిత్రం 'పుష్ప'. ఈ సినిమా రికార్డుల గురించి, కలెక్షన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పుష్ప రాజ్ క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసి వరల్డ్‌వైడ్‌గా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు సుకుమార్. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటించిన తీరు, డైలాగ్ డెలివరీ, వాయిస్ మాడ్యులేషన్, యాటిట్యూడ్ ఇవన్నీ అందర్నీ అద్భుతమైన అనుభూతినిచ్చాయి. అప్పటివరకు తెలుగు, మలయాళ ప్రేక్షకులకు మాత్రమే సుపరిచితమైన అల్లు అర్జున్ ఈ సినిమాతో విశ్వవ్యాప్తంగా ప్రేక్షకులందరికీ చేరువయ్యారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'పుష్ప 2' చిత్రం రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర గ్లిమ్స్‌ను రీసెంట్‌గా రిలీజ్ చేసిందీ చిత్రం బృందం. 20 సెకన్ల నిడివిగల ఈ గ్లిమ్ప్స్‌లో ఆసక్తికరమైన విషయం ఏంటంటే 'తిరుపతి జైలు నుండి బుల్లెట్ గాయాలతో తప్పించుకున్న పుష్ప' అని న్యూస్ వస్తుంది. ఆ తరువాత 'అసలు పుష్ప ఎక్కడ' అని ఒక వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. దీని పూర్తి వీడియోను అల్లు అర్జున్ బర్త్డే కానుకగా ఈనెల 7న సాయంత్రం 4:05 నిమిషాలకు రిలీజ్ చేయనున్నారు. రష్మిక మందన్న నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, ధనుంజయ, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఉస్తాద్.. షూటింగ్ షురూ

'గబ్బర్ సింగ్' వంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తరువాత పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇందులో పవన్ కళ్యాణ్‌కి జోడీగా శ్రీలీల నాయికగా నటించనుంది. గత డిసెంబర్‌లో పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. బుధవారం నుంచి ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి రూపొందించిన అద్భుతమైన పోలీస్ స్టేషన్ సెట్‌లో మొదటి షెడ్యూల్ జరగనుంది. కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించనుకోనున్న ఈ షెడ్యూల్‌లో పవన్ కళ్యాణ్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణం పాల్గొననున్నారు.

'గబ్బర్ సింగ్'కి మించి, ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా ఈ చిత్రాన్ని అందించాలని దర్శకుడు హరీష్ శంకర్ పట్టుదలగా ఉన్నారు. ఈ చిత్రం కోసం అత్యుత్తమ సాంకేతిక బృందం పని చేస్తోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో అశుతోష్ రాణా, నవాబ్ షా, కేజీఎఫ్ అవినాష్, గౌతమి, నర్రా శ్రీను, నాగ మహేష్, టెంపర్ వంశీ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.



పవన్ కళ్యాణ్

అంచనాలు పెంచిన ట్రైలర్



సమంత

'అనిర్వచనీయమైన ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన అజరామరమైన పౌరాణిక ప్రణయగాథ 'శాకుంతలం'. మహాభారతంలోని అద్భుతమైన దుష్యంత, శకుంతల ప్రేమగాథను మహాకవి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం కావ్యంగా రాశారు. దీని ఆధారంగా గుణ శేఖర్ రూపొందించిన విజువల్ వండర్ ఇది. సమంత, దేవ్‌మోహన్ నటించిన పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రం ఈనెల 14న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీ ఎత్తున రిలీజ్ అవుతుంది. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలున్నాయి. అందరూ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఆసక్తిని మరో మెట్టుకి తీసుకెళ్లేలా రిలీజ్ ట్రైలర్‌ను దర్శక, నిర్మాతలు బుధవారం విడుదల చేశారు.

హై వోల్టేజ్ ఎంటర్‌టైనర్

మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో కిరణ్ అబ్బవరం హీరోగా తెరకెక్కిన చిత్రం 'మీటర్'. నూతన దర్శకుడు రమేష్ కదారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు తెరకెక్కించిన ఈ చిత్రంలో అతుల్య రవి కథానాయిక. సమ్మర్ స్పెషల్‌గా ఈనెల 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్‌లో హీరో మాట్లాడుతూ, 'దర్శకుడు రమేష్ నన్ను చాలా డిఫరెంట్‌గా చూపించారు. మాస్ కమర్షియల్ ఆడియెన్స్‌కి ఎలాంటి ఎలిమెంట్స్‌తో కథ కావాలో అవన్నీ ఇందులో ప్రజంట్ చేశారు. సినిమా హై వోల్టేజ్ ఎనర్జీటిక్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. విజిల్స్ కొట్టి, గోల చేసి థియేటర్‌కి వెళ్లి ఎంజాయ్ చేసే సినిమా' అని తెలిపారు.



అతుల్య రవి, కిరణ్ అబ్బవరం

ప్రేక్షకులకు షాకిచ్చే రావణాసుర



అభిషేక్ నామా

రవితేజ నటించిన తాజా చిత్రం 'రావణాసుర'. సుధీర్‌వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్‌వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ గ్రాండ్‌గా నిర్మించారు. హీరో సుశాంత్ కీలక పాత్ర పోషించారు. ఈనెల 7న సమ్మర్ స్పెషల్‌గా సినిమా రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో నిర్మాత అభిషేక్ నామా 'రావణాసుర' చిత్ర విశేషాలని మీడియాతో షేర్ చేసుకున్నారు. 'శ్రీకాంత్ ఈ కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జైట్‌గా ఫీల్ అయ్యాను. ఇంతవరకూ రవితేజ ఇలాంటి సినిమా చేయలేదు. ఈ సినిమా చూసిన తర్వాత రవితేజ ఇలా కూడా చేయగలుగుతారా? అని ప్రేక్షకులు షాక్ అవుతారు. కొత్త కాన్సెప్ట్. ఇది వర్క్ అవుట్ అయితే హీరోలు ఇలాంటి మరిన్ని కథలు ప్రయత్నిస్తారు. రవితేజని ఇంత కొత్త కోణంలో చూసే సరికి అదిరిపోయింది కదా అనే ఫ్యాక్టర్ వస్తుంది. ఇంటర్వెల్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటూ ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది. ఒక ఇన్నోసెంట్ ఫేస్‌తో ఫ్రెష్‌గా ఉండాలని సుశాంత్‌ని ఎంపిక చేశాం. ఇందులో సుశాంత్‌ని కూడా చాలా కొత్తగా చూస్తారు. సుధీర్ వర్మతో చేసిన 'కేశవ' నిర్మాతగా నాకు కమర్షియల్‌గా వర్క్ అవుట్ అయ్యింది. కానీ బ్లాక్ బస్టర్ మిస్ అయ్యింది. ఈ సినిమాతో 100% బ్లాక్ బస్టర్ హిట్ కొడతాం. ఇప్పటికే 'రావణాసుర' మ్యూజిక్ హిట్ అయ్యింది. ప్రేమ విమానం, డెవిల్, డెవిల్ 2 కూడా ఉంది. మొత్తమ్మీద వచ్చే ఏడాదిలో దాదాపుగా ఏడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.

సరికొత్తగా ధూమ్ దామ్ దుమారం

జీఎల్‌బి సినిమా బ్యానర్ పై నిర్మిస్తున్న చిత్రం "ధూమ్ దామ్ దుమారం'. జీఎల్‌బి శ్రీనివాస్ ఈ చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతున్న సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజు బి యాదవ్ మాట్లాడుతూ,'ఈ సినిమా అనుకున్న విధంగా చాలా బాగా వస్తోంది. ఒక మారుమూల గ్రామం నుండి హైదరాబాద్ నగరానికి వచ్చిన ఒక నాయిని బ్రాహ్మణ కుర్రాడి కథ ఇది. అతను కటింగ్ షాపు మెయింటెన్ చేస్తూ, అనుకోని సంఘటన వల్ల నగరంలో జరుగుతున్న ఒక మాఫియా గ్యాంగ్‌తో ఇరుక్కుంటాడు. ఆ తర్వాత ఏం జరిగిందనేది ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ నెలలో కొమురవెల్లిలోని టెంపుల్, ఇతర పరిసర ప్రాంతాలలో ఫైట్‌సీన్స్, ఫ్యామిలీ సెంటిమెంట్ సీన్స్ తెరకెక్కిస్తాం. సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా అందర్నీ కచ్చితంగా మెప్పిస్తుంది' అని తెలిపారు. మల్లిక్ బాబు హీరోగా, హీరోయిన్‌గా ఇషాను నటిస్తున్నారు. రాజుబి యాదవ్ ప్రధాన పాత్రలో కనిపించనున్న ఈ చిత్రంలో లక్ష్మీరావు, హైమావతి, ఎం.సుబ్బరాజు, నరసింహ, నవల్ కిషోర్ అగర్వాల్, మహేష్ గూడుగుంట్ల, మల్లాది శాస్త్రి , టి వెంకటేష్ తదితరులు నటిస్తున్నారు. దీనికి కథ -నిర్మాత -దర్శకత్వం: జి ఎల్ బి శ్రీనివాస్.



రాజు బి. యాదవ్, స్వప్న

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot No. 8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Published At Navatelangana Printers Private Limited, Laxmidas Bhavan, Phase-2, Plot.8&9, Surana X Road, Near Mint Compound, Ida, Charlapally, Medchal-Malkajgiri District-500051, Telangana State, Editor : R.Sudha Bhaskar. TELTEL/2015/60815